# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 274 | హైదరాబాద్ | ఆదివారం 26-04-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

ఇదే చివరి బ్యాచ్...! తెలంగాణ పోలీసుల ఎదుట 47 మంది మావోల లొంగుబాటు

## గులాబీ కోటలో 'చీలిక' విస్ఫోటనం

# తండ్రిపై తనయ సమరశంఖం!

- మునీరాబాద్ వేదికగా 'తెలంగాణ రాష్ట్ర సేన' ఆవిర్భావం.. కేసీఆర్‌తో కవిత కటీఫ్!
- "గత పాలన తప్పిదాలకు క్షమించండి.. అమ్మలా అండగా ఉంటా": పశ్చాత్తాపం వ్యక్తం చేసిన కవిత

12లో







ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు 11లో

## అంగీకరించాం

: మంత్రి పొన్నం ప్రభాకర్

- రెండు రోజుల సమ్మెలోనే పలుమార్లు కార్మికులతో చర్చలు జరిపామని వెల్లడి
- కార్మిక సంఘాల ఎన్నికలు, 11 శాతం పీఆర్సీ ప్రకటనకు అంగీకరించినట్లు వెల్లడి
- ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్న మంత్రి



ప్రధాని నరేంద్రమోదీ

## తెలంగాణ పర్యటన ఖరారు

- మే 9న తెలంగాణకు రానున్న ప్రధాని మోదీ 11లో
- పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్న మోదీ
- పరేడ్ మైదానంలో భారీ బహిరంగ సభ

ఆసుపత్రి, బడి, గుడి, గుడిసె

## అన్నీ లెక్కిస్తాం

- తెలంగాణ భౌగోళిక పరిధిలో ఉన్న ప్రతి ఇంటిని లెక్కిస్తామన్న తెలంగాణ డైరెక్టర్
- ఒక భవనంలో ఉండే ప్రతి కుటుంబాన్ని పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడి
- 2027 ఫిబ్రవరి నుంచి రెండో దశ జనగణన

11లో


## మన జనాభా లెక్కలు, మన అభివృద్ధి

(జనాభా గణన 2027 మొదటి దశ)

गृह मंत्रालय भारत सरकार

మీ రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతంలో భారత ప్రభుత్వం చేపట్టే గృహాల జాబితా మరియు గృహ గణన త్వరలో ప్రారంభం కానుంది. దీనికి ముందు, మీరు మీ సమాచారాన్ని ఆన్‌లైన్‌లో స్వయంగా పూరించుకోవడానికి 15 రోజుల ప్రత్యేక సదుపాయం కల్పించబడుతోంది.

నా పేరు ప్రగతి



# స్వీయ - గణన

సాధారణ మరియు సురక్షితమైన డిజిటల్ సౌకర్యం

నా పేరు వికాస్



### స్వీయ గణన ఎలా చేయాలి ?

1. అధికారిక పోర్టల్‌ను సందర్శించండి (se.census.gov.in)
2. మీ మొబైల్ నెంబర్‌ను ఉపయోగించి ఓటిపితో లాగిన్ అవ్వండి
3. మీ రాష్ట్రం, జిల్లా మరియు స్థానిక వివరాలను ఎంచుకోండి
4. డిజిటల్ మ్యాప్‌లో మీ ఇంటి స్థానాన్ని గుర్తించండి
5. ఇల్లు మరియు కుటుంబానికి సంబంధించిన సమాచారాన్ని పూరించండి
6. సమర్పించిన తరువాత మీకు ఒక SE ID వస్తుంది
7. SE ID ని సురక్షితంగా ఉంచుకోండి
8. గణనకర్త సందర్శించినప్పుడు వారికి SE ID ని అందించండి
9. గణనకర్త మీ సమాచారాన్ని ధృవీకరిస్తారు

ప్రయోజనాలు :
- సమయం ఆదా
- ఖచ్చితమైన సమాచారం
- వేగవంతమైన డేటా ప్రాసెసింగ్

**గుర్తుంచుకోండి స్వీయగణన అనేది ఒక ప్రత్యేక సౌకర్యం**

మీరు స్వయంగా గణన చేసుకోలేకపోతే, చింతించకండి, సమాచారాన్ని నమోదు చేయడానికి నిర్ణీత సమయంలో ఒక గణన అధికారి తప్పకుండా మీ ఇంటికి వస్తారు

మీ సమాచారం అంతా పూర్తిగా గోప్యంగా మరియు సురక్షితంగా ఉంచబడుతుంది

## తెలంగాణ

| స్వీయ గణన | హౌస్ లిస్టింగ్ |
|---|---|
| ఏప్రిల్ 26 - మే 10 | మే 11 - జూన్ 9 |

CBC 19108/13/0074/2627

## మన బాధ్యతను నెరవేర్చి, జనగణనలో పాల్గొందాం

CensusIndia2027

భారత శక్తి

# హిట్ తక్కువ.. హిస్టరీ ఎక్కువ

ప్రజల నమ్మకమే పార్టీకి ప్రాణం.. అది కోల్పోతే ఎంతటి వారైనా చరిత్ర పుటల్లో పేర్లుగా మిగలడం అనివార్యం.'తెలుగు రాష్ట్రాల రాజకీయ ముఖచిత్రం ఎప్పుడూ ఆసక్తికరమే. సిద్ధాంతాల కంటే సంచలనాలకే ఇక్కడ పెద్దపీట. పవర్‌కోసం పుట్టి.. విలీనాల్లో ముగిసిన పార్టీల కథలుమెజారిటీ పార్టీలు మనుగడ కోసం పెద్ద పార్టీల్లో కలిసిపోతున్నాయి. సిద్ధాంతం కంటే వ్యక్తుల చుట్టూ రాజకీయాలు తిరగడం వల్ల నేత వెనుకబడితే పార్టీ కనుమరుగవుతోంది. క్షేత్రస్థాయిలో బలమైన కేడర్ లేకపోవడం, కేవలం ఎన్నికల ముందే హడావుడి చేయడం కూడా పలు సందర్భాలలో కనిపించింది.తెలుగు రాజకీయ చరిత్రను గమనిస్తే.. 'ప్రజల నమ్మకమే పార్టీకి ప్రాణం.. అది కోల్పోతే ఎంతటి వారైనా చరిత్ర పుటల్లో పేర్లుగా మిగలడం అనివార్యం జాగృతి నేత, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీని ప్రకటించారు తెలుగు రాష్ట్రాల్లో మరోసారి 'ప్రాంతీయ పార్టీల' ప్రస్థానంపై చర్చ మొదలైంది. ఉమ్మడి ఎపినుంచి నేటి విభజిత రాష్ట్రాల వరకు తెలుగు రాజకీయ చరిత్రలో ఎన్నో పార్టీలు పుట్టాయి, కొన్ని చరిత్ర సృష్టించాయి, మరికొన్ని కాలగర్భంలో కలిసిపోయాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి గమనిస్తే ఆత్మగౌరవ నినాదంతో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ గురించి చెప్పాలి. తెలుగు రాజకీయాల్లో ప్రాంతీయు పార్టీ అంటే గుర్తొచ్చే మొుదటి పేరు తెలుగుదేశం.1982లో నందమూరి తారకరామారావు స్థాపించిన ఈ పార్టీ కేవలం 9 నెలల్లోనే అధికారాన్ని చేజిక్కించుకుని రికార్డు సృష్టించింది. ఢిల్లీ పెత్తనానికి వ్యతిరేకంగా 'తెలుగువారి ఆత్మగౌరవం' నినాదంతో పుట్టిన ఈ పార్టీ, నాలుగు దశాబ్దాల తర్వాత కూడా నేడు ఆంధ్రప్రదేశ్‌లో అధికార పీఠంపై ఉండి తన ఉనికిని చాటుకుంటోంది. మరోవైపు, రైతు నాయకుడు ఆచార్య ఎన్.జి. రంగా స్థాపించిన కృషికార్ లోక్ పార్టీ, రాజగోపాలాచారి స్థాపించిన స్వతంత్ర పార్టీ ఒకప్పుడు ఉమ్మడి ఎపిలో బలమైన ముద్రవేసినప్పటికీ, కాలక్రమేణా పెద్ద పార్టీల్లో విలీనమై అంతర్ధానమయ్యాయి. 1969లో మర్రి చెన్నారెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రజా సమితి 1971 లోక్‌సభ ఎన్నికల్లో 14 స్థానాలకు గాను 10 గెలిచి ప్రభంజనం సృష్టించినా, చివరకు కాంగ్రెస్‌లో విలీనమై ఒక అధ్యాయాన్ని ముగించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008 ఆగస్టు 26న తిరుపతిలో మెగాస్టార్ చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం 18% ఓట్లు సాధించినా రెండేళ్లకే కాంగ్రెస్‌లో విలీనమైంది. మాజీ సిఎం కిరణ్ కుమార్‌రెడ్డి స్థాపించిన జై సమైక్యాంధ్ర, వి.వి. లక్ష్మీనారాయణ స్థాపించిన జై భారత్ నేషనల్ పార్టీ వంటివి ఓటర్లను ఆకట్టుకోవడంలో వెనుకబడ్డాయి. రాష్ట్రవిభజనను వ్యతిరేకిస్తూ అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి 2014లో జై సమైక్యాంధ్ర పార్టీ పార్టీని స్థాపించారు. ఆ ఎన్నికల్లో ఈ పార్టీ ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. మెజారిటీ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. ఎన్నికల తర్వాత కిరణ్ కుమార్‌రెడ్డి తిరిగి కాంగ్రెస్‌లో చేరడంతో పార్టీ దెబ్బతిన్నది. తర్వాత ఆయన బిజెపిలో చేరిపోయారు. ఎన్‌టిఆర్ మరణానంతరం లక్ష్మీపార్వతి స్థాపించిన ఎన్‌టిఆర్ టిడిపి, నందమూరి హరికృష్ణ స్థాపించిన అన్నా టిడిపి కూడా వారసత్వ పోరులో నిలబడలేకపోయాయి. ఐఎఎస్ అధికారి జయప్రకాశ్ నారాయణ 2006లో రాజకీయ సంస్కరణల కోసం స్థాపించిన లోక్ సత్తా పార్టీ కూకట్‌పల్లి నుంచి ఒక సీటు గెలిచినప్పటికీ, కాలక్రమేణా ఎన్నికల రాజకీయాలకు దూరమైంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికీ వివిధ ప్రజాసంబంధ అంశాలపై ఆ పార్టీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ పోరాటాలు సాగిస్తున్నారు. ఇక సంచలనాల కె.ఎ.పాల్ 2008లో రాజకీయాల్లోకి ప్రవేశిస్తూ ప్రజాశాంతి పేరిట ప్రాంతీయ పార్టీని స్థాపించారు. 2009లోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని స్థానాల్లో పోటీ చేసినా చెప్పుకోదగ్గ ఓట్లు సాధించలేకపోయింది. తర్వాత 2019 లో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఈ పార్టీ అభ్యర్థులను నిలబెట్టింది. పాల్ స్వయంగా నరసాపురం లోక్‌సభ స్థానం నుండి పోటీ చేసి కేవలం 3,046 ఓట్లు (0.3%) మాత్రమే సాధించారు. 2024లో విశాఖపట్నం లోక్‌సభ స్థానం నుండి పోటీ చేసినప్పటికీ, కేవలం 7,529 ఓట్లు మాత్రమే పొంది ఓటమి పాలయ్యారు. ఈ పార్టీకి ఎన్నికల సంఘం గుర్తింపు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో రాజకీయ ప్రభావం చాలా తక్కువనే చెప్పాలి. తెలంగాణ సాధన సమితి పేరిట ఆలే నరేంద్ర స్థాపించిన ఈ పార్టీ తర్వాత టిఆర్ఎస్ (ప్రస్తుతం బిఆర్ఎస్)లో విలీనమైంది. అలాగే తల్లి తెలంగాణ పార్టీ పేరిట ప్రస్తుత కాంగ్రెస్ ఎంఎల్‌సి, నటి విజయశాంతి స్థాపించిన ఈ పార్టీ కూడా తర్వాత టిఆర్ఎస్‌లో విలీనమైపోయింది. అయితే ఈ రెండు పార్టీలను తమ పార్టీలో చేర్చుకునేంతవరకు ఆదరించిన కెసిఆర్ తర్వాత నరేంద్ర, విజయశాంతికి మొండిచేయి చూపడమేగాక వారు పార్టీ నుంచి వెళ్లిపోయేలా వ్యవహరించారన్న విషయం ప్రచారంలో ఉంది. అటువంటి కెసిఆర్ పార్టీని వ్యతిరేకిస్తూ ఇప్పుడు స్వయంగా ఆయున కూతురు కవిత వేరుకుంపటి పెట్టడం చర్చనీయమైంది. గతంలో జై తెలంగాణ పార్టీ పేరిట పి. ఇంద్రారెడ్డి స్థాపించిన పార్టీ ఆయన మరణం తర్వాత ఉనికిని కోల్పోయింది. ఆయన సతీమణి కాంగ్రెస్ టిక్కెట్‌పై గెలిచి తర్వాత కాలంలో కెసిఆర్ పంచన చేరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాయలసీమ పరిరక్షణ సమితి పేరిట బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి స్థాపించిన పార్టీ కూడా ఎన్నికల్లో ప్రభావం చూపలేకపోయింది. విభజిత ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వారసత్వ యుద్ధం, సినీ గ్లామర్ రెండు ప్రధాన పార్టీలకు జన్మనిచ్చాయి. కాంగ్రెస్ అధిష్టానంపై తిరుగుబాటు చేసి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి స్థాపించిన వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ఒక ప్రాంతీయ పార్టీగా అత్యంత వేగంగా అధికారంలోకి వచ్చింది.. రాజశేఖర్‌రెడ్డి వారసత్వాన్ని అందిపుచ్చుకుని 2019లో భారీ విజయాన్ని అందుకుంది.

# సింహాచలం చందనోత్సవంలో కనిపించని గంటా

విశాఖపట్టణం, ఏప్రిల్ 25 (

సీనియర్ మోస్ట్ లీడర్. ప్రతీ ఎన్నికలప్పుడు నియోజకవర్గం మార్చి పోటీ చేసి గెలవడం ఆయన స్టైల్. అలాంటి లీడర్ కొన్నాళ్లుగా సైకిల్ పార్టీలో సైలెంట్‌గా ఉండిపోతున్నారట. టచ్ మీ నాట్ అన్నట్లుగా ఉంటున్నారట. లేటెస్ట్‌గా ఆయన



నియోజకవర్గ పరిధిలో జరిగిన..చందనోత్సవంలో కూడా సిట్టింగ్ ఎమ్మెల్యే కనిపించకపోవడం చర్చకు దారితీసింది.ఉత్తరాంధ్రలో మోస్ట్ పాపులర్ లీడర్ గంటా శ్రీనివాసరావు. 2014లో మంత్రిగా చక్రం తిప్పారు. ఆ తర్వాత 2019లో వైసీపీ వేవ్‌లోనూ గెలిచారు. 2024లో గెలిచాక అమాత్య యోగం దక్కకపోవడంతో ఆయన అసంతృప్తిగా ఉన్నట్లు కొన్నాళ్లుగా వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇది చాలదన్నట్టు లేటెస్ట్‌గా సింహాచలంలోని శ్రీ వరహాలక్ష్మీ నరసింహస్వామి ఆలయ చందనోత్సవంలో ఆయనెక్కడా కనిపించలేదు. గంటా నియోజకవర్గం అయిన భీమిలి పరిధిలోకే సింహాచలం వస్తోంది. ఏడాదికి ఒకసారి జరిగే అతిపెద్ద ఈ ఆధ్యాత్మిక వేడుకకు సీనియర్ టీడీపీ లీడర్, సిట్టింగ్ ఎమ్మెల్యే గంటా దూరంగా ఉండటం..తన నియోజకవర్గ పరిధిలోనే జరిగినా అటువైపు కన్నెత్తి చూడకపోవడం చర్చకు దారితీస్తోంది.సింహాచల ఆలయ ఉత్సవాల బాధ్యతలను హోంమంత్రి అనితకు ఇచ్చింది సర్కార్. ఆమె అంతా తానై రివ్యూలు చేసి.. ఎక్కడా భక్తులకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే తన నియోజకవర్గంలో జరిగిన వేడుకకు సీనియర్ నేతనైన తనను కాదని..హోంమంత్రికి బాధ్యతలు అప్పగించడం గంటాకు నచ్చలేదనేది ఓ వర్గం వాదన. గతేడాది చందనోత్సవంలో గోడ కూలి అపశృతి జరగడం..ప్రభుత్వానికి కాస్త బ్యాడ్ నేమ్ రావడంతో ఈసారి జాగ్రత్తలు తీసుకుందట సర్కార్. అందుకే హోంమంత్రి అనితకు బాధ్యతలు అప్పగించారని తెలుగు తమ్ముళ్లు చర్చించుకుంటున్నారు.రెండు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నా సరే ఓటమి అంటే తెలియని నాయకుడు గంటా. అలాగే జిల్లాలో పోటీ చేసిన స్థానం నుంచి తిరిగి పోటీ చేయకుండా విజయ కేతాన్ని ఎగురవేయడం ఆయన స్టైల్. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ, టీడీపీ ప్రభుత్వంలోనూ మంత్రిగా పని చేశారు. అలా ఉత్తరాంధ్రలో సీనియర్ మోస్ట్ లీడర్‌గా.. ఓటమెరుగని నేతగా ఉన్న ఆయనకు 2024లో కూటమి అధికారంలోకి వచ్చాక మంత్రి పదవి దక్కకపోవడంతో అసంతృప్తిగా ఉన్నారన్న టాక్ నడిచింది. ప్రభుత్వంలో పదవి దక్కకపోయినా..పార్టీలో మంచి పొజిషన్ ఇస్తారని ఆశపడ్డ గంటాకు నిరాశే ఎదురైందట. అటు పొలిట్ బ్యూరో, ఇటు జాతీయ, రాష్ట్ర కమిటీల్లో ఆయనకు చోటు దక్కలేదు. పోనీ గంటాకు బదులుగా ఆయన కుమారుడు రవితేజకు అయినా సరే యూత్ కోటాలో ఛాన్స్ ఇచ్చారంటే అదీ లేదు. తండ్రీ కొడుకులిద్దరికీ టీడీపీ అధిష్టానం మొండి చేయి చూపింది. ఉత్తరాంధ్రలోని సీనియర్ లీడర్లకు లేదా, వారి వారసులకు పార్టీలోని ఏదో ఒక పొజిషన్ కట్టబెట్టారు. కానీ గంటాకు, ఆయన కుమారుడుకు పార్టీ పదవులు దక్కలేదు. తాను కోరుకున్న మంత్రి పదవి ఇవ్వకుండా పక్కన పెట్టడం, ఓ వైపు పార్టీ కమిటీల్లో స్థానం లేకుండా చేయడంతో గంటా డీప్‌గా హర్ట్ అయ్యారన్న గుసగుసలకు దారితీసింది. ఇక తన నియోజకవర్గంలో జరిగే చందనోత్సవ నిర్వహణ బాధ్యతలు పూర్తిగా హోంమంత్రికి అప్పగించడం కూడా తనను తగ్గించడమేనన్న ఫీలింగ్‌లో ఉన్నారట గంటా. అందుకే ఆయన చందనోత్సవం రోజు విశాఖలో లేకుండా..బిజీగా ఉండటం వల్లే రాలేదనే సంకేతాన్ని పంపే ప్రయత్నం చేశారట.మరోవైపు టీడీపీ అధిష్టానం పెద్దలు గంటాను పూర్తిస్థాయిలో తమవాడిగా నమ్మడం లేదన్నది తెలుగు తమ్ముళ్లు చర్చించుకుంటున్న మాట. చంద్రబాబు అరెస్ట్ అప్పుడు..ఆ తర్వాత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం..హైకమాండ్ పెద్దలు ఫోన్ చేసినా లైట్ తీసుకోవడం వంటివి టీడీపీ అధిష్టానంతో గంటాకు గ్యాప్ ఏర్పడటానికి కారణమయ్యాయని అంటున్నారు. అందుకే ఇప్పుడు పవర్‌లోకి వచ్చినా ఆయనకు పెద్దపీట దక్కట్లేదని ఓపెన్ సీక్రెట్ అంటున్నారు విశాఖ టీడీపీ నేతలు.

# ఇనామ్ భూములపై క్లారిటీ


విజయవాడ, ఏప్రిల్ 25

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇనామ్ భూములక సంబంధించి మరో మెమో జారీ చేసింది. మతపరమైన ఇనామ్‌లకు మినహాయింపు వర్తించదని క్లారిటీ ఇచ్చింది. మతపరమైన, దేవాదాయ, సంస్థాగత సర్వీస్ ఇనామ్ భూములకు మినహాయింపు వర్తించదని తెలిపింది. ఈ మేరకు సీఎస్ సాయిప్రసాద్ ప్రత్యేకంగా మరో మెమో జారీచేశారు. మతపరమైన, దేవాదాయ, సంస్థాగత సర్వీస్ ఇనామ్ భూముల అంశంపై క్లారిటీ ఇచ్చారు.. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ఇనామ్ భూములకు విముక్తి కల్పించిన సంగతి తెలిసిందే. విలేజ్ సర్వీసు ఇనాం భూములకు నిషేధిత జాబితా నుంచి తొలిగించింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం లక్షా 36వేల24 ఎకరాల భూములకు రిజిస్ట్రేషన్లపై ఉన్న నిషేధం ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో సర్వీసు ఇనామ్ భూములకు విముక్తి కల్పించారు. తాజాగా ఇనామ్ భూములకు సంబంధించి ప్రభుత్వం మరో ముఖ్యమైన స్పష్టత ఇచ్చింది. రాష్ట్రంలో మతపరమైన ఇనామ్ భూములకు ఈ మినహాయింపు వర్తించదని మరో మెమో విడుదల చేశారు.రాష్ట్రంలో ఇటీవల ఇచ్చిన మ్యుటేషన్, రిజిస్ట్రేషన్ అనుమతులు మతపరమైన, దేవాదాయ, సంస్థాగత సర్వీస్ ఇనామ్ భూములకు వర్తించదని సీఎస్ సాయిప్రసాద్ మరో మెమో ద్వారా క్లారిటీ ఇచ్చారు. మతపరమైన, దేవాదాయ, సంస్థాగత సర్వీస్ ఇనామ్ భూములకు సంబంధించి నిబంధన ఉంటుంది. ఏపీ ఇనామ్స్ చట్టం-1956ను బట్టి.. ఈ ఇనామ్‌లు మతపరమైన సంస్థలకు సేవ చేయాల్సి ఉంటుంది. అందుకే ఈ భూముల సాగుదారులు వారి జీవనోపాధి కోసం భూమిని సాగు చేసుకుంటూనే సేవలు అందించాలి. గ్రామ పనివారు.. అలాగే గ్రామ సర్వీస్ ఇనామ్‌లు గ్రామంలో వృత్తి పనివారికి, సమాజానికి సేవ చేసినందుకు కేటాయించినవని గుర్తు చేశారు. వీరు దైవ సేవ చేయాల్సిన నిబంధన లేదని.. ఈ భూములు ఏపీ ఇనామ్స్ చట్టం-1956 పరిధిలోకి రావని కూడా పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం ఈ నెల 17న ఇచ్చిన మెమో గ్రామ పనివారు, గ్రామ సర్వీస్ ఇనామ్‌లకే వర్తిస్తుందన్నారు. మతపరమైన, సంస్థాగత సర్వీస్ ఇనామ్ భూములకు వర్తించదని క్లారిటీ ఇచ్చారు.పూర్వకాలంలో రాజులు, పాలకులు ఆలయాలు, మసీదుల కోసం.. మతపరమైన సేవలు అందించేవారి కోసం ఇచ్చిన భూముల్ని.. మతపరమైన ఇనామ్ భూములు అంటారు. గతంలో ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలు, ఆలయాల మరమ్మతుల పనులు, అర్చకులతో పాటు సేవలు అందించినవారి జీవనోపాధి కోసం ఈ భూముల్ని కేటాయించారు. ఈ భూములు సాగు చేసుకునేవారికి వచ్చే ఆదాయాన్ని జీవనోపాధికి ఉపయోగించుకుంటూనే మతపరమైన సేవలు కూడా అందిందించాలి. సాధారణ ఇనామ్ భూములలాగా వీటిని విక్రయించడానికి, రిజిస్ట్రేషన్ చేయడానికి వీల్లేదు.. కొన్ని పరిమితులు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ఇచ్చిన మినహాయింపులు కేవలం గ్రామ సేవా ఇనామ్‌లకే వర్తిస్తాయని స్పష్టత ఇచ్చారు. ఈ మినహాయింపులు మతపరమైన, దేవాదాయ ఇనామ్‌లకు వర్తించవని తేల్చి చెప్పారు. మొత్తం మీద ఏపీ ప్రభుత్వం మతపరమైన ఇనామ్‌లపై స్పష్టతనిస్తూ తాజాగా మరో మెమోను జారీ చేసింది.. ఈ భూముల విషయంలో ఎలాంటి కన్ఫ్యూజ్ లేకుండా క్లారిటీ ఇచ్చారు.

# టికెట్ల తనిఖీతో 22 రోజుల్లో రూ.10 కోట్లు

విజయవాడ, ఏప్రిల్ 25

విజయవాడ రైల్వే డివిజన్ ప్రయాణికులకు విధించే జరిమానాల ద్వారా భారీగా ఆదాయాన్ని సాధించింది. కేవలం 22 రోజుల్లో ఏకంగా రూ.10 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే చరిత్రలో జోనల్ స్థాయిలో ఇంత భారీ ఆదాయం రావడం సరికొత్త రికార్డ్ అని




చెబుతున్నారు. ఈ సందర్భంగా రైల్వే సిబ్బందిని అధికారులు అభినందించారు.విజయవాడ రైల్వే డివిజన్ సరికొత్త రికార్డ్ సృష్టించింది. ప్రయాణికులకు విధించే జరిమానాల (టికెట్స్ తనిఖీ) ద్వారా ఏప్రిల్ నెలలో 22 రోజుల్లో భారీగా ఆదాయం లభించింది. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో టికెట్ల తనిఖీల ద్వారా 22 రోజుల వ్యవధిలో, రికార్డు స్థాయిలో రూ.10 కోట్ల ఆదాయాన్ని సాధించింది. దక్షిణ మధ్య రైల్వే చరిత్రలోనే జోనల్ స్థాయిలో ఇంత ఆదాయం రావడం ఒక రికార్డు అని అధికారులు చెబుతున్నారు. గతేడాది అక్టోబరులో నెలవారీ ఆదాయం రూ.8.59 కోట్ల ఆదాయం వచ్చింది.. ఇప్పుడు ఆ రికార్డును అధిగమించారు. ఇది రికార్డ్ మాత్రమే కాదు ఆల్ టైమ్ రికార్డ్ అని చెబుతున్నారు.విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో సీనియర్ డీసీఎం బి ప్రశాంత్‌కుమార్ నేతృత్వంలో రైల్వే తనిఖీ సిబ్బంది ప్రతి రోజూ రైళ్లు, స్టేషన్‌లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎవరైనా ప్రయాణికులు టికెట్లు లేకుండా ప్రయాణిస్తుంటే వారికి భారీగా జరిమానాలు విధిస్తున్నారు. అయితే విజయవాడ డివిజన్‌కు ఈ ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.76.34 కోట్లు ఆదాయం లభించింది. తనిఖీల ద్వారా భారీగా ఆదాయం సాధించినందుకు సీనియర్ డీసీఎం ప్రశాంత్ కుమార్, తనిఖీ సిబ్బందిని డీఆర్ఎం మోహిత్, అధికారులు అభినందించారు.రైల్వేశాఖ దేశవ్యాప్తంగా టికెట్ల తనిఖీ చేపడుతుంది.. టికెట్లు లేకుండా ప్రయాణించేవారికి జరిమానాలు విధిస్తుంటారు. ప్రయాణికుల దగ్గర టికెట్లను తనిఖీలు చేసేందుకు టీటీలు విధుల్లో ఉంటారు.. వీరు రైల్వే స్టేషన్‌లతో పాటుగా రైళ్లలో కూడా తనిఖీలు చేస్తుంటారు. కొంతమంది ప్రయాణికులు టికెట్లు లేకుండా ప్రయాణిస్తూ వీరికి అడ్డంగా దొరికిపోతారు. టికెట్ లేనివారికి రైల్వే చట్టంలోని 137, 138 సెక్షన్ల ప్రకారం జరిమానా విధిస్తున్నారు. అలాగే జరిమానాతో పాటు ఆ ప్రయాణికుడు ఎక్కిన స్టేషన్ నుంచి టీటీకి దొరికిపోయిన స్టేషన్ వరకు అయ్యే టికెట్ డబ్బులు కూడా వసూలు చేస్తారు. ఒకవేళ ప్రయాణికుడు జరిమానా చెల్లించడానికి నిరాకరిస్తే.. రైలు నుంచి దింపేస్తారు. అంతేకాదు రైల్వే మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉంటుందని రైల్వే చట్టాలు చెబుతున్నాయి.

# ప్రత్యేక రాష్ట్రం తోనే వైసిపికి పూర్వ వైభవం!

కర్నూలు, ఏప్రిల్ 25

ఎలాగైనా పూర్వ వైభవం సాధించాలన్నది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ టార్గెట్. కూటమి దూకుడు చూస్తుంటే అది సాధ్యమయ్యే పని కాదు అని తెలుస్తోంది. ఈ తరుణంలో కొత్త కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఈ క్రమంలో ప్రాంతీయ విద్వేషాలను రగిలించేందుకు కూడా వెనుకడుగు వేయడం లేదని కూటమి ఆరోపిస్తోంది. ఏ రాయలసీమ ను అడ్డం చేసుకొని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందో.. అదే ప్రాంతాన్ని ఎటువంటి అభివృద్ధి చేయలేదు ఆ పార్టీ. ప్రధానంగా సాగునీరు, పారిశ్రామిక అభివృద్ధి వంటి కీలక రంగాల్లో చేసిందేమీ లేదు. కానీ ఇప్పుడు ప్రతిపక్షంలోకి రాగానే రాయలసీమ ప్రయోజనాల పేరిట కొత్త నాటకం ప్రారంభించింది ఆ పార్టీ. అమరావతి పై విషం చిమ్ముతూ.. డబ్బునంత అక్కడే ఖర్చు పెడుతున్నారంటూ సీమ ప్రజలలో వ్యతిరేక భావన వచ్చేలా ప్రయత్నిస్తోంది.గతంలో మూడు రాజధానులు అన్నది వైయస్సార్ కాంగ్రెస్. అప్పట్లో న్యాయ రాజధాని పేరుతో కర్నూలుకు ఒక హైకోర్టు ప్రతిపాదన చేసింది. ఇప్పుడేమో మావిగన్ అంటూ అమరావతి పక్కనే నగరాలను కలుపుతూ రాజధాని చేయాలని చూస్తోంది. మరోవైపు రాయలసీమకు అన్యాయం జరుగుతోందంటూ కొత్త నినాదాలు అందుకుంది. ఐదేళ్ల లో రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేయడంలో కానీ.. ఉపాధి కల్పనలో కానీ.. వైయస్సార్ కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా విఫలమైంది. హంద్రీ నీవా, గాలేరు నగరి వంటి ప్రాజెక్టులను పూర్తిగా గాలికి వదిలేసింది. ఇప్పుడు రాయలసీమ ప్రయోజనాల పేరుతో అక్కడి ప్రజల్లో ఒక రకమైన వ్యతిరేక భావన ప్రభుత్వం పై వచ్చేలా పన్నాగం పన్నుతోంది.అమరావతి పై విషం చిమ్మడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆపడం లేదు. దానిని రాయలసీమలో మూడు పెడుతూ ప్రచారం చేస్తోంది. కానీ అమరావతి అనేది కేవలం ఒక ప్రాంతానికి చెందినది కాదు. ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవం, ఆర్థిక వనరు కూడా. అక్కడ సృష్టించే ప్రతి రూపాయి, సంపద రాష్ట్రంలోని అన్ని జిల్లాల అభివృద్ధికి దోహదం చేయనుంది. సమాజంతో పాటు పరిస్థితులపై అవగాహన ఉన్న ప్రతి ఒక్కరికి ఇది తెలిసిందే. ఇప్పటికే రాష్ట్ర విభజన జరిగి రెండు రాష్ట్రాలు ఎంతలా నష్టపోయాయి తెలియంది కాదు. ఇప్పుడు ప్రత్యేక ప్రాంతం నినాదాన్ని ప్రజలు లెక్క చేసే స్థితిలో లేరు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు కూడా వర్కౌట్ కావు.

# ముఖ్య కార్యకర్తలతో, నాయకులతో సమావేశం నిర్వహించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్

నంద్యాల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఈరోజు నంద్యాలలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి ఫరూక్ నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి పనులు మరియు ప్రజల సమస్యలపై కార్యకర్తలతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చొరవ తీసుకోవాలని మంత్రి ఫరూక్ సూచించారు. నంద్యాల నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జాప్యం లేకుండా చూడాలని అధికారులతో సమన్వయం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి సమస్యలను పరిష్కరించడంలో తాను ఎల్లప్పుడూ ముందుంటానని మంత్రి ఫరూక్ భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మరింత ఉత్సాహంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# కనిపించని కోటరీ

కడప, ఏప్రిల్ 25

వైసీపీ అధినేత వైఎస్ జగన్ తన పై వస్తున్న విమర్శలకు చెక్ పెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తుంది. ముఖ్యంగా కోటరీ విషయంలో జగన్ కొంత దిగి వచ్చినట్లు కనపడుతుంది. అందుకు ఉదాహరణ ఇటీవల జరిగిన వైసీపీ ఆవిర్భావ వేడుకలే కారణమంటున్నారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కొత్త చర్చకు దారి తీశాయి. గత ఐదేళ్లుగా పార్టీలో, ప్రభుత్వంలో అన్నీ తానై వ్యవహరించిన సజ్జల రామకృష్ణారెడ్డి ఈ వేడుకల్లో ఎక్కడా కనిపించకపోవడం హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం అంటే జగన్ పక్కనే ఉండి ప్రోటోకాల్ చూసుకునే సజ్జల, ఈసారి కనీసం ఫోటోల్లో కూడా లేకపోవడం పార్టీ కేడర్‌లో రకరకాల సందేహాలకు కారణమయింది.గత ఐదేళ్ల పాలనలో జగన్ రెడ్డికి నీడగా సజ్జల పేరు మారుమోగిపోయింది. పార్టీలో ఏ చిన్న నిర్ణయం తీసుకోవాలన్నా సజ్జల కనుసన్నల్లోనే జరిగేది. అయితే, గత ఎన్నికల్లో వైసీపీ చవిచూసిన ఘోర పరాజయానికి సజ్జల అనుసరించిన వ్యూహాలే కారణమని పార్టీ కేడర్‌లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. క్షేత్రస్థాయి కార్యకర్తల నుంచి సీనియర్ నేతల వరకు చాలామంది సజ్జల వైఖరి వల్లే పార్టీకి ఈ గతి పట్టిందని బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలోనే జగన్ ఆయనను కావాలనే పక్కన పెట్టారా..? అన్న చర్చ మొదలైంది. అయితే ఇందుకు స్పష్టమైన సంకేతాలు మాత్రం ఇంకా కనిపించడం లేదు. సజ్జల అప్పుడప్పుడు వచ్చి మీడియా ముందు మాట్లాడుతున్నప్పటికీ జగన్ పెద్దగా దరి చేరనివ్వడం లేదంటున్నారు. వైసీపీని వీడిపోయిన నేతలందరూ తమను జగన్ ను కలవకుండా కొందరు అడ్డుకుంటున్నారని, జగన్ తో తమ సమస్యలను చెప్పుకునేందుకు కూడా ఐదేళ్లు పార్టీలో అధికారంలో ఉన్న సమయంలో వీలు కాలేదు. అయితే ఇందులో సజ్జల రామకృష్ణారెడ్డి ఒక్కరే కాదు.. నాడు సీఎంవోలో ఉన్న అధికారులు సయితం పెత్తనం చేసే స్థాయికి వచ్చారంటే అది జగన్ కు తెలిసి జరిగిందా? తెలియకుండా జరిగిందా? అన్నది తెలియకపోయినా డ్యామేజీ మాత్రం భారీగానే జరిగింది. అయితే తాజా పరిణామాలు చూస్తుంటే జగన్ తన నీడలను పక్కన పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, కొత్త టీం భవిష్యత్ లో కనిపిస్తుందని పార్టీ నేతలు అంటున్నారు. మరి ఇందులో నిజమెంతో తెలియాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయాల్సిందే.

ఆత్మగౌరవం, ఆర్థిక వనరు

ఎలాగైనా పూర్వ వైభవం సాధించాలన్నది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ టార్గెట్. కూటమి దూకుడు చూస్తుంటే అది సాధ్యమయ్యే పని కాదు అని తెలుస్తోంది. ఈ తరుణంలో కొత్త కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఈ క్రమంలో ప్రాంతీయ విద్వేషాలను రగిలించేందుకు కూడా వెనుకడుగు వేయడం లేదని కూటమి ఆరోపిస్తోంది. ఏ రాయలసీమ ను అడ్డం చేసుకొని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందో.. అదే ప్రాంతాన్ని ఎటువంటి అభివృద్ధి చేయలేదు ఆ పార్టీ. ప్రధానంగా సాగునీరు, పారిశ్రామిక అభివృద్ధి వంటి కీలక రంగాల్లో చేసిందేమీ లేదు. కానీ ఇప్పుడు ప్రతిపక్షంలోకి రాగానే రాయలసీమ ప్రయోజనాల పేరిట కొత్త నాటకం ప్రారంభించింది ఆ పార్టీ. అమరావతి పై విషం చిమ్ముతూ.. డబ్బునంత అక్కడే ఖర్చు పెడుతున్నారంటూ సీమ ప్రజలలో వ్యతిరేక భావన వచ్చేలా ప్రయత్నిస్తోంది.మూడు రాజధానులు అన్నది వైయస్సార్ కాంగ్రెస్. అప్పట్లో న్యాయ రాజధాని పేరుతో కర్నూలుకు ఒక హైకోర్టు ప్రతిపాదన చేసింది. ఇప్పుడేమో మావిగన్ అంటూ అమరావతి పక్కనే నగరాలను కలుపుతూ రాజధాని చేయాలని చూస్తోంది. మరోవైపు రాయలసీమకు అన్యాయం జరుగుతోందంటూ కొత్త నినాదాలు అందుకుంది. ఐదేళ్ల లో రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేయడంలో కానీ.. ఉపాధి కల్పనలో కానీ.. వైయస్సార్ కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా విఫలమైంది. హంద్రీ నీవా, గాలేరు నగరి వంటి ప్రాజెక్టులను పూర్తిగా గాలికి వదిలేసింది. ఇప్పుడు రాయలసీమ ప్రయోజనాల పేరుతో అక్కడి ప్రజల్లో ఒక రకమైన వ్యతిరేక భావన ప్రభుత్వం పై వచ్చేలా వన్నాగం పన్నుతోంది.అమరావతి పై విషం చిమ్మడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆపడం లేదు. దానిని రాయలసీమలో మూడు పెడుతూ ప్రచారం చేస్తోంది. కానీ అమరావతి అనేది కేవలం ఒక ప్రాంతానికి చెందినది కాదు. ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవం, ఆర్థిక వనరు కూడా. అక్కడ సృష్టించే ప్రతి రూపాయి, సంపద రాష్ట్రంలోని అన్ని జిల్లాల అభివృద్ధికి దోహదం చేయనుంది. సమాజంతో పాటు పరిస్థితులపై అవగాహన ఉన్న ప్రతి ఒక్కరికి ఇది తెలిసిందే. ఇప్పటికే రాష్ట్ర విభజన జరిగి రెండు రాష్ట్రాలు ఎంతలా నష్టపోయాయి తెలియంది కాదు. ఇప్పుడు ప్రత్యేక ప్రాంతం నినాదాన్ని ప్రజలు లెక్క చేసే స్థితిలో లేరు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు కూడా వర్కౌట్ కావు.

## మే 25 నుంచే వానలు

హైదరాబాద్, ఏప్రిల్ 25, ఈ సామి మార్చి మొదటి నుంచే ఎండలు మండిపోతున్నాయి. ఏప్రిల్ ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో, భారత దేశంలోని చాలా ప్రాంతాలు తీవ్రమైన ఎండలతో జనాలు అల్లాడిపోతున్నాయి. ఇప్పటికే దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో 43-44 డిగ్రీలు నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో ఈ ఎండలు మరింత ముదిరే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ క్రమంలోనే దేశ ప్రజలకు మరో చల్లని శుభవార్త కూడా చెప్పింది. గతంతో పోల్చుకుంటే ఈసారి నైరుతి రుతుపవనాలు ముందే దేశాన్ని చేరుకుంటాయిన తెలిపింది.యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం-రేంజ్ వెదర్ ఫోర్కాస్ట్స్ అంచనాల ప్రకారం, ఈసారి నైరుతి రుతుపవనాలు ముందస్తుగానే పలకరించే అవకాశం ఉందని తెలుస్తోంది. మే చివరి నాటికే దక్షిణ భారతదేశంలో వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. మే 18 నుండి 25 మధ్య నైరుతి రుతుపవనాలు అండమాన్ మరియు నికోబార్ దీవుల్లోకి ప్రవేశించే అవకాశం ఉందని అంచనాలు చెబుతున్నాయి. ఈ ప్రాంతంలో సాధారణం కంటే 30 నుండి 60 మి.మీ ఎక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయిని స్పష్టం చేశాయి.ఇక మే 25 నుండి జూన్ 1 మధ్య ఈ రుతుపవనాలు పశ్చిమ దిశగా కదిలి కేరళ తీరాన్ని, తమిళనాడులోని దక్షిణ జిల్లాలను తాకవచ్చని వాతావరణ శాఖ పేర్కొంది. రుతుపవనాల ప్రభావంతో అండమాన్ ఉత్తర ప్రాంతంలో ఒక ఉష్ణమండల వ్యవస్థ ఏర్పడే అవకాశం ఉందని.. దీని కారణంగా రుతుపవనాలు మరింత వేగంగా ముందుకు కదులుతాయని స్పష్టం చేసింది.గతేడాదిలో కూడా రుతుపవనాలు అంచనా వేసిన దానికంటే ముందే కేరళ తీరాన్ని తాకాయి. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి పునరావృతమైతే, మే 25 నాటికే రుతుపవనాలు భారత్‌లోకి ప్రవేశించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

# మళ్లీ అసెంబ్లీ సమావేశాలు

విజయవాడ, ఏప్రిల్ 25

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలను రాబోయే 10 రోజుల్లో నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. అమరావతి వేదికగా జరిగిన టెలి కాన్ఫరెన్స్‌లో కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు , కీలక నేతలతో ఆయన సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశాల్లో ప్రధానంగా రాష్ట్ర ప్రయోజనాలతో పాటు మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు, దానిపై ప్రజల్లో అవగాహన కల్పించే అంశాలపై చర్చలు నిర్వహించే అవకాశం ఉంది. మహిళా బిల్లుకు సంబంధించి కాంగ్రెస్ మినహా మిగిలిన అన్ని పక్షాలు సానుకూలత వ్యక్తం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు.మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడం, విపక్షాలు చేసిన ద్రోహంపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం , కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని నియమించింది. ఇందులో టీడీపీ తరఫున రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ తరఫున పీవీఎన్ మాధవ్, జనసేన తరఫున మంత్రి నాదెండ్ల మనోహర్ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ కార్యక్రమాలను రూపొందించనున్నారు.ప్రతి ఎమ్మెల్యే తమ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రెస్ మీట్లు ఏర్పాటు చేసి, మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రాముఖ్యతను, కూటమి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రజలకు వివరించాలని చంద్రబాబు ఆదేశించారు. దీనికి తోడు, రాబోయే రోజుల్లో విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి వంటి ప్రధాన నగరాల్లో భారీ బహిరంగ సభలను నిర్వహించాలని టెలి కాన్ఫరెన్స్‌లో నిర్ణయించారు. ఈ సభల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే కాకుండా, ప్రభుత్వ లక్ష్యాలను స్పష్టంగా వివరించనున్నారు.అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి కోరారు. టీడీపీ, జనసేన, మరియు బీజేపీ నేతలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని, ముఖ్యంగా మహిళా సాధికారత దిశగా తీసుకుంటున్న నిర్ణయాలకు ప్రజల మద్దతు కూడగట్టాలని సూచించారు. 10 రోజుల్లో ప్రారంభం కానున్న ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులు ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం.

==============

# మండలిలో పట్టు కోసం ప్రణాళికలు

గుంటూరు, ఏప్రిల్ 25

వైయస్సార్ కాంగ్రెస్పార్టీకి చాలామంది నేతలు గుడ్ బై చెప్పారు. కొంతమంది అయితే వైసిపి ద్వారా వచ్చిన పదవులను సైతం వదులుకునేందుకు సిద్ధపడ్డారు. ఆ పదవులకు రాజీనామా చేశారు. కూటమి పార్టీలో చేరిపోయారు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చేసిన రాజీనామాను ఆమోదించారు కానీ.. పదవులకు రాజీనామా ఆమోదించడం లేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చాలా మంది ఎమ్మెల్సీలు గుడ్ బై చెప్పారు. కూటమి పార్టీలో చేరి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు జగన్మోహన్ రెడ్డిని వారు విమర్శిస్తున్నారు. అలాంటి వారిపై కచ్చితంగా చర్యలకు డిమాండ్ చేస్తారు. అనర్హత వేటు వేయాలని కోరుతారు. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆ పరిస్థితి లేదు. వ్యక్తిగతంగా రాజీనామా చేసినా ఆమోదించక.. బలవంతంగా ఆ పదవుల్లో ఉండాల్సిందేనని తేల్చి చెబుతున్నారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత ఆ పార్టీకి చెందిన ఐదుగురు ఎమ్మెల్సీలు తమ పదవులకు రాజీనామా చేశారు. శాసనమండలి ఛైర్మన్ ఫార్మేట్లో తమ రాజీనామాలను సమర్పించారు. కానీ మండలి ఛైర్మన్ ఆమోదించకపోవడం వెనుక పెద్ద రాజకీయ కోణం ఉంది. సాంకేతికంగా వారు వైసిపి ఎమ్మెల్సీలు గానే కొనసాగాలని కోరుకుంటున్నారు. దీని వెనుక భారీ మాయాజాలం ఉంది. రాజీనామా చేసిన మరుక్షణం తమ బలం తగ్గిపోతుంది శాసనమండలిలో. ఆపై కూటమి బలం పెరిగిపోతుంది. చివరికి న్యాయస్థానాలు ఆదేశించినా శాసనమండలి ఛైర్మన్ వారి రాజీనామాలను ఆమోదించలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇదే ఎమ్మెల్సీలతో రాజీనామా చేసిన రాజ్యసభ సభ్యుల రాజీనామాలు ఆమోదం పొందాయి. వారి స్థానంలో కొత్త వారి ఎన్నిక కూడా జరిగిపోయిందిమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలం ఉంది. ఆ బలంతో రాజకీయం చేయాలని చూస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం గురించి తెలియంది కాదు. 11 మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తే వారు సభకు వెళ్లడం లేదు. ఉన్న ఎమ్మెల్సీలపై ఆధారపడి శాసనమండలిలో రాజకీయం చేస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. అక్కడ బలం తగ్గిపోతుందని తెలిసి ఎమ్మెల్సీల రాజీనామా ఆమోదం పొందడం లేదు. చివరకు న్యాయస్థానాలు ఆదేశిస్తున్న వారు వినడం లేదు. అయితే దీనిపై కూటమి ఎలా ముందుకు వెళ్తుందో చూడాలి.

# రాజకీయాల్లోకి విజయసాయిరెడ్డి రీ ఎంట్రీ



హైదరాబాద్, ఏప్రిల్ 25,

రాజకీయాల్లోకి రీఎంట్రీపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి క్లారిటీ ఇచ్చారు. మళ్లీ రాజకీయాల్లోకి వస్తానన్న విజయసాయిరెడ్డి.. జులైలో పొలిటికల్ రీఎంట్రీ ఉంటుందని తెలిపారు. అలాగే మీడియా రంగంలోకి కూడా వస్తానని మరోసారి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో మరో రాజకీయ పార్టీ రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 2024 ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పారన్న విజయసాయిరెడ్డి.. ఆ పార్టీ నేతలు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలన్నారు. ఇకనైనా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు.మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రత్యక్ష రాజకీయాలకు దూరమైనప్పటికీ.. రాజకీయ రంగాన్ని మాత్రం పూర్తిగా విడిచిపెట్టలేదు. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన తర్వాత కొన్ని రోజుల పాటు సైలెంట్‌గా ఉన్న విజయసాయిరెడ్డి.. ఆ తర్వాత సోషల్ మీడియా ద్వారా వివిధ రాజకీయ అంశాలపై తన అభిప్రాయాలను పంచుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలోనే తన పొలిటికల్ రీఎంట్రీపై విజయసాయిరెడ్డి క్లారిటీ ఇచ్చారు. జులై నెలలో మళ్లీ రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించాల్సిన అవసరం ఉందని విజయసాయిరెడ్డి అభిప్రాయపడ్డారు. మీడియా రంగంలోకి కూడా ప్రవేశించనున్నట్లు విజయసాయిరెడ్డి మరోసారి స్పష్టం చేశారు.ఇదే క్రమంలో వైసీపీపై విమర్శలు చేశారు విజయసాయిరెడ్డి. గత ఎన్నికల్లో ఓడించి.. వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పారన్న విజయసాయిరెడ్డి.. ఇప్పటికైనా ఆ పార్టీ నేతలు తమ పద్ధతి మార్చుకుని, ప్రజాసమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. మరోవైపు 2024 ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం తర్వాత పలువురు నేతలు ఆ పార్టీని వీడారు. ఈ క్రమంలోనే 2025 జనవరి నెలలో వైసీపీ పార్టీకి, రాజ్యసభ సభ్యత్వానికి విజయసాయిరెడ్డి రాజీనామా చేశారు. రాజకీయాల నుంచి తప్పుకుంటున్నానని, తన పదవికి న్యాయం చేయలేక రాజీనామా చేస్తున్నట్లు అప్పట్లో విజయసాయిరెడ్డి ప్రకటించారు. విజయసాయిరెడ్డి రాజీనామాకు ఆ వెంటనే రాజ్యసభ ఛైర్మన్ ఆమోదం కూడా లభించింది.ఆ తర్వాత సోషల్ మీడియా ద్వారా వివిధ అంశాలపై స్పందిస్తూ వస్తున్న విజయసాయిరెడ్డి.. ఇటీవలే మీడియా రంగంలోకి ఎంట్రీ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. త్వరలోనే తెలుగు, హిందీ, ఇంగ్లీషులో డిజిటల్ మీడియా ప్లాట్‌ఫామ్ ప్రారంభిస్తామని ఎక్స్ వేదికగా వెల్లడించారు. మధ్యతరగతి ప్రజలు, మహిళలు, యువత, రైతాంగం, కార్మికులకు సంబంధించిన సమస్యలను ప్రస్తావిస్తూ ప్రజా గొంతుకగా మారతామని పేర్కొన్నారు. ఏ పొలిటికల్ పార్టీకి అనుబంధంగా తాము పనిచేయమని.. డిజిటల్ ప్లాట్‌ఫామ్ ప్రారంభించిన తర్వాత తెలుగులో శాటిలైట్ ఛానెల్ కూడా తెస్తామని పేర్కొన్నారు. త్వరలోనే వీటి పేర్లు ప్రకటిస్తామంటూ విజయసాయిరెడ్డి ఇటీవల ట్వీట్ చేయటం ప్రాధాన్యం సంతరించుకుంది. విజయసాయిరెడ్డి. ఏపీ లిక్కర్ కేసులో విజయసాయిరెడ్డి నివాసంలో శుక్రవారం ఈడీ సోదాలు నిర్వహించింది. ఈ సోదాలలో ఏమీ లభించలేదని విజయసాయిరెడ్డి వెల్లడించారు. ఈ క్రమంలోనే రాజకీయ విషయాలపై మాట్లాడిన విజయసాయిరెడ్డి జూలైలో రాజకీయాల్లోకి మళ్లీ వస్తానని ప్రకటించారు. అలాగే ఏపీలో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించాల్సిన అవసరముందని వ్యాఖ్యనించటంతో విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ పార్టీ పెడతారా అనే ఊహాగానాలు మొదలయ్యాయి

# డిస్టెన్స్ మోడ్ లో డిగ్రీ...
# సర్కారీ ఉద్యోగాలకు రెడ్ సిగ్నల్

హైదరాబాద్, ఏప్రిల్ 25,

దూరవిద్యా విధానంలో డిగ్రీలు పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టు బిగ్ షాక్ ఇచ్చింది. ఇతర రాష్ట్రాలకు చెందిన విశ్వవిద్యాలయాలు తమ రాష్ట్ర సరిహద్దులు దాటి నిర్వహిస్తున్న స్టడీ సెంటర్ల ద్వారా పొందే డిగ్రీలు ప్రభుత్వ ఉద్యోగాలకు పనికిరావని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ తీర్పుతో వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తు ఇప్పుడు ప్రశ్నార్థకమైంది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2022లో విడుదల చేసిన లైబ్రేరియన్ పోస్టుల నోటిఫికేషన్ ఈ వివాదానికి మూలమైంది. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న కొందరు అభ్యర్థులు.. ఆంధ్రప్రదేశ్‌లోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి మాస్టర్స్ ఇన్ లైబ్రరీ సైన్స్ పూర్తి చేశారు. అయితే వీరు ఈ డిగ్రీని ఏపీలో కాకుండా తెలంగాణలో ఉన్న ఆ వర్సిటీ స్టడీ సెంటర్ల ద్వారా దూరవిద్యా విధానంలో పొందారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సమయంలో వీరి డిగ్రీలు చెల్లవని టీజీపీఎస్సీ తిరస్కరించడంతో అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. గతంలో ఇదే తరహా డిగ్రీలతో కొందరికి ఉద్యోగాలు వచ్చాయని వారు వాదించారు.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసులో కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక రాష్ట్ర చట్టం కింద ఏర్పడిన విశ్వవిద్యాలయం తన కార్యకలాపాలను ఆ రాష్ట్ర సరిహద్దులకే పరిమితం చేయాలి. ఇతర రాష్ట్రాల్లో స్టడీ సెంటర్లు పెట్టి డిగ్రీలు ఇవ్వడం యూజీసీ నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసింది. 2013లో యూజీసీ జారీ చేసిన పబ్లిక్ నోటీసు ప్రకారం.. ఏ వర్సిటీ కూడా తన ప్రాదేశిక అధికార పరిధిని దాటి వెళ్లకూడదు. తెలంగాణలో ఏపీ వర్సిటీ సెంటర్లు నిర్వహించడం చట్టవిరుద్ధమని కోర్టు తెలిపింది. 2017 నియామకాల్లో ఇలాంటి డిగ్రీలను అంగీకరించారు కదా అని అభ్యర్థులు చేసిన వాదనను కోర్టు తోసిపుచ్చింది. “

## సీబీఎస్సీలో సైన్స్ బెటర్ మెంట్ కే ఎక్కువ

హైదరాబాద్, ఏప్రిల్ 25, (

మే 15 నుంచి 21 వరకు జరగనున్న సీబీఎస్సీ సెకండ్ బోర్డు పరీక్షలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్షల కోసం మొత్తం 6,68,854 మంది రెగ్యులర్ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో అత్యధికంగా 4.74 లక్షల మంది విద్యార్థులు కేవలం సైన్స్ సబ్జెక్టులోనే మార్కుల ఇంప్రూవ్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సీబీఎస్సీ వెల్లడించింది. ఇక వీరిలో 5,25,655 మంది ఇంప్రూవ్‌మెంట్ కేటగిరీకి, 85,285 మంది కంపార్ట్‌మెంట్ కేటగిరీ కింద, 57,914 మంది కంపార్ట్‌మెంట్ ఉ ఇంప్రూవ్‌మెంట్ రెండు కేటగిరీల కింద దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో బాలురు 4,02,643 మంది, బాలికలు 2,66,209 మంది ఉన్నారు.కాగా అఇాఇ 2026 నుంచి 10వ తరగతి బోర్డు పరీక్షల కోసం రెండు-ఎడిషన్ల విధానాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం విద్యార్థులందరూ తప్పనిసరిగా ప్రధాన పరీక్షలకు హాజరు కావల్సి ఉంటుంది. అయితే సెకండ్ బోర్డు పరీక్షలకు కంపార్ట్‌మెంట్ కేటగిరీలో ఉన్నవారికి, మెరుగుదల కోరుకునే వారికి మాత్రమే అవకాశం ఉంటుంది. రెండు పరీక్షలలోనూ వచ్చిన అత్యుత్తమ మార్కులను బోర్డు జారీ చేసే మార్క్ షీట్-కమ్-సర్టిఫికేట్‌లో పరిగణనలోకి తీసుకుని విద్యార్థులకు అందిస్తారు.సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) తెలిపిన ప్రకారం.. సెకండ్ బోర్డు పరీక్షలు 2026 మే 15వ తేదీ నుండి ప్రారంభమై, 2026 మే 21వ తేదీ వరకు జరుగుతాయి. పరీక్షల తేదీల షెడ్యూల్‌ను ఇప్పటికే బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

# భూముల విలువల సవరణ

హైదరాబాద్, ఏప్రిల్ 25,

తెలంగాణలో భూముల మార్కెట్ విలువలను మే మొదటి వారం నుంచి సవరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రుల ఉపసంఘం దీనిపై అధికారులకు దిశానిర్దేశం చేసింది. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య చైనా తరహా పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు సానుకూలత వ్యక్తం చేయడంతో పాటు 'హిల్ట్' విధానం ద్వారా పారదర్శక పద్ధతిలో భూ వినియోగ మార్పిడి చేపడతామని స్పష్టం చేసింది. పారిశ్రామికవేత్తల సూచనల మేరకు రాయితీలు, కొత్త జోన్ల కేటాయింపుపై ప్రభుత్వం దృష్టి సారించింది.తెలంగాణలో ఆదాయ వనరుల పెంపుదల, పారిశ్రామిక అభివృద్ధిపై ప్రభుత్వం దూకుడు పెంచింది. మే మొదటి వారం నుంచి సవరించిన భూముల మార్కెట్ విలువలను అమలులోకి తీసుకురావాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను 'ఆదాయ వనరుల సమీకరణ మంత్రివర్గ ఉపసంఘం' ఆదేశించింది. శుక్రవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావులతో పాటు పారిశ్రామిక ఎస్టేట్ల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేస్తూనే.. భూ విలువల సవరణ ద్వారా ఖజానాకు అదనపు ఆదాయాన్ని చేకూర్చడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశ్యంగా ప్రభుత్వం చెబుతోంది. పారిశ్రామిక రంగానికి సంబంధించి అనేక వినూత్న ప్రతిపాదనలు చర్చకు వచ్చాయి. ముఖ్యంగా హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ఉన్న ప్రాంతాలను చైనా తరహాలో ప్రత్యేక పారిశ్రామిక పార్కులుగా అభివృద్ధి చేయాలని పారిశ్రామికవేత్తలు కోరగా.. ప్రభుత్వం దానికి సానుకూలత వ్యక్తం చేసింది. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ విధానాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా ఎటువంటి నగదు బదిలీలకు తావులేకుండా అమలు చేస్తామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. పరిశ్రమల వల్ల కాలుష్యం ఉండకూడదని అదే సమయంలో అవి లాభసాటిగా నడవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.అయితే హిల్ట్ పాలసీపై రాజకీయంగా తలెత్తుతున్న కొన్ని విమర్శలను పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు కొట్టిపారేశారు. చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ విధానం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయని కొందరు నేతలు భయపెట్టే ప్రయత్నం చేశారని కానీ పారదర్శకమైన ఈ విధానంలో ఎవరికీ అనుమానాలు అవసరం లేదని తాము భావిస్తున్నట్లు తెలిపారు. భూ వినియోగ మార్పిడి ఛార్జీలను రోడ్డు విస్తీర్ణాన్ని బట్టి 30 శాతం నుంచి 50 శాతం వరకు నిర్ణయించారని అయితే వీటిని స్వల్పంగా తగ్గించాలని పారిశ్రామికవేత్తలు విజ్ఞప్తి చేశారు. రాయితీలు ఇవ్వకపోయినా సరే పరిశ్రమల స్థాపనకు తగినంత భూమిని కేటాయించాలని వారు కోరారు.మరోవైపు, రాష్ట్రంలోని అన్ని శాఖల పరిధిలో ఉన్న భూముల వివరాలను సమగ్రంగా సేకరించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. ఖాళీగా ఉన్న భూములు, ఆక్రమణకు గురైన ప్రాంతాలు, ప్రభుత్వానికి అందుబాటులో ఉన్న స్థలాల డేటాను సిద్ధం చేయాలని సూచించారు. అన్ డెవలప్డ్ ల్యాండ్ పాలసీ కింద కేంద్ర, రాష్ట్ర




ప్రభుత్వాలు, ప్రైవేటు భాగస్వామ్యంతో పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నిర్ణయాలు రాష్ట్రంలో పారిశ్రామిక రూపురేఖలను మార్చడమే కాకుండా.. పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను సృష్టించే అవకాశం ఉంది.

# కొత్త డీజీపీగా సీవీ ఆనంద్?

హైదరాబాద్, ఏప్రిల్ 25,

తెలంగాణకు కొత్త పోలీస్ బాస్ రానున్నారు. తదుపరి డీజీపీగా 1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ నియమితులయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత డీజీపీ శివధర్‌రెడ్డి ఈ నెల 30న పదవీ విరమణ చేయనుండటంతో.. యూపీఎస్సీ పంపిన ముగ్గురు సీనియర్ల జాబితాలో అత్యంత సీనియర్ అయిన ఆనంద్ వైపు ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. హోంశాఖలో ఇటీవల జరిగిన ఐపీఎస్ బదిలీలు కూడా ఈ మార్పును ధృవీకరిస్తున్నాయి. ఈ నెలాఖరులోగా దీనిపై అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.తెలంగాణకు కొత్త డీజీపీ రానున్నారు. సీనియర్ ఐపీఎస్ అధికారి, 1991 బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్‌ను తదుపరి డీజీపీగా నియమించేందుకు ప్రభుత్వం దాదాపు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్న శివధర్‌రెడ్డి ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ నేపథ్యంలో.. కొత్త డీజీపీ ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందుకు సంబంధించి కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇప్పటికే ముగ్గురు అర్హులైన అధికారుల పేర్లతో కూడిన జాబితాను రాష్ట్రానికి పంపింది.యూపీఎస్సీ పంపిన ఆ జాబితాలో సీవీ ఆనంద్‌తో పాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్య మిశ్రా పేర్లు ఉన్నాయి. అయితే ఈ ముగ్గురిలో సీవీ ఆనంద్ అత్యంత సీనియర్ కావడం, క్షేత్రస్థాయిలో శాంతిభద్రతల నిర్వహణలో ఆయనకు ఉన్న అపార అనుభవం ఆయనకు కలిసి వచ్చే అంశాలు. ప్రస్తుతం హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆనంద్.. గతంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసి సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు పొందారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఐపీఎస్ అధికారుల బదిలీలు కూడా సీవీ ఆనంద్ డీజీపీ అవుతారనే ప్రచారానికి మరింత బలం చేకూర్చాయి. హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న ఆనంద్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించి.. ఆ స్థానాన్ని శిఖాగోయెల్‌కు అప్పగించారు. ఇది ఆయనను డీజీపీ పదవికి కేటాయించడానికేనని పోలీస్ వర్గాలు



భావిస్తున్నాయి. ఒకవైపు సీనియారిటీ, మరోవైపు ప్రభుత్వ నమ్మకాన్ని గెలుచుకున్న అధికారి కావడంతో సీవీ ఆనంద్ పేరు దాదాపు ఖరారైనట్లేనని తెలుస్తోంది. ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి పదవీకాలం ముగిసేలోగా.. అంటే ఈ నెలాఖరులోపు కొత్త డీజీపీ నియామకానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆమోదం లభించిన వెంటనే హోంశాఖ జీవో విడుదల చేయనుంది.ఇక తెలంగాణలో పలువురు సీనియర్ ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. 1994 బ్యాచ్‌కు చెందిన శిఖాగోయెల్‌ను హోంశాఖ ముఖ్యకార్యదర్శిగా నియమించారు. ప్రస్తుతం ఆమె విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా ఉన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్‌గానూ కొనసాగాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏసీబీ డైరెక్టర్‌గా ఉన్న 2004 బ్యాచ్ ఐపీఎస్ డా.తరుణ్‌జోషిని ఫ్యూచర్‌సిటీ కమిషనర్‌గా బదిలీ చేశారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) ఐజీపీగా ఉన్న 2006 బ్యాచ్ ఐపీఎస్ సుమతిని మల్కాజిగిరి కమిషనర్‌గా నియమించారు.

# ఆస్తులతో పాటు అప్పులు....

హైదరాబాద్, ఏప్రిల్ 25,

తెలంగాణ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కేసీఆర్ కుమార్తె కవిత ఇప్పుడు తన సొంత రాజకీయ పార్టీతో ప్రజల పరీక్షను ఎదుర్కోనున్నారు. అయితే ఆమెకు ఉన్న ఆస్తులు ఎన్ని, ఆమె ఇన్‌కమ్ సోర్స్ ఏంటనే చర్చ సాగుతోంది. ఈ పరిస్థితుల్లో గతంలో అంటే ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా దాఖలు చేసిన అఫిడవిట్ ప్రకారం కొన్ని వివరాలు అందుబాటులో ఉన్నాయి.. కవిత ఆస్తులు గత కొన్నేళ్లుగా అనూహ్యంగా పెరిగాయి. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆమె సమర్పించిన అఫిడవిట్ ప్రకారం ఆమె మొత్తం ఆస్తుల విలువ 7. 63 కోట్లుగా ఉంది. అయితే 2021లో నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నాటికి ఆస్తులు పెరిగినట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అప్పుడు చెప్పిన వివరాల ప్రకారం ఆమె ఆస్తులు విలువ 39.79 కోట్లు దాటింది. అంటే కేవలం ఆ మూడేళ్ల వ్యవధిలోనే ఆమె ఆస్తులు దాదాపు రెట్టింపు కంటే ఎక్కువ పెరిగాయి. ఇందులో చరాస్తుల విలువ రూ. 14. 78కోట్లు కాగా, స్థిరాస్తుల విలువ 5.70 కోట్లుగా ఉంది. కవిత వాహనాల వినియోగంపై కూడా ప్రజల్లో ఆసక్తి ఉంది. ఆమె అఫిడవిట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం ఆమె వద్ద టయోటా ఫార్చ్యునర్ కారు ఉంది. దీని విలువ సుమారు 7.58 లక్షలుగా చూపారు. ప్రస్తుతం ఆమె వద్ద ఉన్న కార్ల సమాచారం అందుబాటులో లేదు. అయితే ఆమె భద్రత దృష్ట్యా ప్రభుత్వం కల్పించిన వాహనాలపై అప్పట్లో దుమారం రేగింది. మావోయిస్టుల నుంచి ముప్పు పొంచి ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలతో 2016లో ఆమెకు బుల్లెట్ ప్రూఫ్ పార్చ్యునర్ వాహనాన్ని కేటాయించారు అంతేకాకుండా బీఆర్ఎస్ హయాంలో కొనుగోలు చేసిన 22 ల్యాండ్ క్రూయిజర్ వాహనాల వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద దుమారం రేపింది. ఈ వాహనాలు కేసీఆర్ కాన్వాయ్ కోసం కొనుగోలు చేశారని ప్రస్తుతం ప్రభుత్వం ఆరోపించగా, భద్రతా ప్రోటోకాల్‌లో భాగంగానే నిఘా వర్గాలు వీటిని ఏర్పాటు చేసినట్టు కవిత స్పష్టం చేశారు. కవిత కేవలం రాజకీయ నేతగానే కాకుండా తనను తాను బిజినెస్ ఉమెన్‌గా కూడా అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఆమె పెట్టుబడులు ప్రధానంగా రియల్ ఎస్టేట్, ఫార్మా రంగాల్లో ఉన్నాయి. స్ట్రక్చర్ డెవలపర్స్‌లో ఆమెకు 4.99 కోట్ల విలువైన వాటాలు ఉన్నాయి. నెట్‌పిక్సెల్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఆమె పెట్టుబడులు పెట్టారు. రిలిక్సర్ ఫార్మస్యూటికల్స్‌లో ఆమె భర్త అనిల్ కుమారు ప్రధాన భాగస్వామిగా ఉన్నారు. ఇందులో సుమారు 9.21 కోట్ల పెట్టుబడి ఉంది. వీటితోపాటు, భారత్ జాగృతి ఫౌండేషన్ వంటి స్వచ్ఛంద సంస్థల ద్వారా సామాజిక కార్యక్రమాల్లో కూడా ఆమె చురుగ్గా పాల్గొంటున్నారు. కవిత తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో విలువైన భూములు ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని మల్లె బోయినపల్లిలో తన తండ్రి కేసీఆర్ బహుమతిగా ఇచ్చిన పది ఎకరాల 16 గుంటల వ్యవసాయ భూమి ఆమె పేరిట ఉంది. వీటితోపాటు నిజామాబాద్, కరీంనగర్, సిద్ధిపేట జిల్లాల్లో కూడా వ్యవసాయ భూములు ఉన్నాయి. హైదరాబాద్‌లోని బంజారా హిల్స్‌లో నివాస భవనంతోపాటు సికింద్రాబాద్ ఎంజీ రోడ్డులో వాణిజ్య భవనాలు కూడా ఆమె ఆస్తుల జాబితాలో ఉన్నాయి. కవిత వద్ద 1.95 కిలోల బంగారం, డైమండ్ ఆభరణాలు ఉన్నట్టు అఫిడవిట్ పేర్కొంది. అలాగే 11.2 కిలోల వెండి వస్తువులు ఉన్నాయి. వీటి మొత్తం విలువ సుమారు 70.71 లక్షలుగా అప్పట్లో లెక్కించారు.

కవిత పేరుతో భారీగా అప్పులు

ఆస్తులు పెరుగుదలతోపాటు ఆమె అప్పులు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. ఆమెపై మొత్తం రూ. 21. 62 కోట్ల మేర రుణం ఉంది. ఇందులో బ్యాంక్ ఆఫ్ బరోడాలో తీసుకున్న కార్ లోన్(10.18లక్షలు), గోల్డ్ లోన్ (24 లక్షలు) రూ. 1.16 కోట్ల మార్టిగేజ్‌లోన్ ఉన్నాయి. ముఖ్యంగా స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు కోసం ఆమె 7 కోట్ల మేర అప్పు చేశారు. కవిత 1978లో కరీంనగర్‌లో జన్మించారు. జేఎన్టీయూ నుంచి బీటెక్ పూర్తి చేసిన ఆమె, అమెరికాలోని యూనివర్శిటీ ఆఫ్ సదరన్ మిస్సిస్సిపీ నుంచి మాస్టర్ డిగ్రీ పొందారు. 2004లో భారత్‌కు తిరిగి వచ్చి ఆమె తెలంగాణ జాగృతి సంస్థను స్థాపించి మలి దశ తెలంగాణ ఉద్యమంలో భాగమయ్యారు. కవిత ఆస్తుల లెక్కలు 2021లో ఇచ్చిన అఫిడవిట్ ప్రకారం ఉన్నాయి. ఇప్పుడు వీటిలో చాలా మార్పులు జరిగి ఉంటాయి.

# సెంటిమెంట్ మళ్ళీ పురుడుపోసుకుంటుందా?

## కవిత పార్టీకి స్పేస్ ఉందా

హైదరాబాద్, ఏప్రిల్ 25, (

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక అంకం మొదలైంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన సొంత రాజకీయ పార్టీని ప్రకటించారు. ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ వంటి మూడు బలమైన శక్తులు ఉన్న చోట.. నాలుగో శక్తి గా కవిత ఏ మేరకు రాణిస్తారనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. తెలంగాణలో ప్రస్తుతం త్రిముఖ పోటీ నెలకొంది. అధికారం కోల్పోయినా కేడర్ బలంగా ఉన్న బీఆర్ఎస్, అధికారంలో ఉన్న కాంగ్రెస్, పుంజుకుంటున్న బీజేపీ మధ్య రాజకీయ యుద్ధం నడుస్తోంది. ఈ దశలో కవిత కొత్త పార్టీని ప్రకటించడం సాహసోపేతమైన నిర్ణయంగానే కనిపిస్తోంది. అయితే, తెలంగాణ రాజకీయాల్లో స్పేస్ ఎప్పుడూ ఉంటుంది. ముఖ్యంగా సెంటిమెంట్, ప్రాంతీయ ఆకాంక్షలు బలంగా ఉన్న గడ్డపై, గొంతు లేని వర్గాలకు , అసంతృప్త నేతలకు కవిత పార్టీ ఒక వేదికగా మారే అవకాశం ఉంది. ప్రత్యేకించి మహిళా సాధికారత, తెలంగాణ సంస్కృతిని అజెండాగా మార్చుకుంటే కొంత మేర ఓటు బ్యాంకును ఆకర్షించవచ్చు.కవిత నిర్ణయం అన్నిటికంటే ఎక్కువగా బీఆర్ఎస్ పార్టీనే ప్రభావితం చేయనుంది. కేసీఆర్ నాయకత్వంపై అసంతృప్తితో ఉన్న నేతలు లేదా పార్టీలో ప్రాధాన్యత దక్కని సెకండ్ లైన్ లీడర్లు కవిత వైపు చూసే అవకాశం ఉంది. పార్టీ పేరులో తెలంగాణ ఉంటుంది. ఇది బీఆర్ఎస్ ఓటు బ్యాంకును చీల్చితే, అది పరోక్షంగా కాంగ్రెస్ , బీజేపీకి లాభం చేకూర్చవచ్చు. తండ్రి పార్టీ నుంచి సస్పెండ్ అయిన తర్వాత ఆమె తీసుకుంటున్న ఈ అడుగు, తెలంగాణలో ఒక కొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలకవచ్చు. కవిత తన తాజా వ్యాఖ్యల్లో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని పదేపదే ప్రస్తావిస్తున్నారు. తెలంగాణలో



జనాభా పరంగా పెద్ద సంఖ్యలో ఉన్న బీసీ సామాజిక వర్గాలను తన వైపు తిప్పుకోవడం ద్వారా బలమైన పునాది వేయాలని ఆమె వ్యూహంగా కనిపిస్తోంది. కాంగ్రెస్, బీజేపీలు కూడా బీసీ మంత్రాన్ని జపిస్తున్న తరుణంలో, కవిత తెలంగాణ బిడ్డగా వారి ఆకాంక్షలను ఏ మేరకు నెరవేరుస్తారనేది కీలకం. ఆమె పార్టీలో చేరబోతున్న మేధావులు, ఉద్యమకారుల జాబితాను బట్టి ఈ పార్టీ గమ్యం దిశానిర్దేశం అవుతుంది.తెలంగాణ జాగృతి ద్వారా దశాబ్ద కాలంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న కవితకు క్షేత్రస్థాయిలో ఒక నెట్‌వర్క్ ఉంది. ఉద్యమ సమయంలో పనిచేసిన వారు, ప్రస్తుతం రాజకీయంగా అవకాశాలు లేని వారు ఆమె వెంట నడిచే అవకాశం ఉంది. ఒకవేళ ఆమె బలమైన అభ్యర్థులను నిలబెట్టి, ఒక పది నుంచి పదిహేను శాతం ఓట్లు సాధించగలిగితే.. రాష్ట్రంలో ఏ పార్టీ అయినా ప్రభుత్వ ఏర్పాటుకు ఆమె మద్దతు కోరాల్సిన పరిస్థితి వస్తుంది. అంటే కింగ్ మేకర్ గా ఎదిగే అవకాశం ఆమెకు ఉంటుంది తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు త్రిముఖ పోటీ నుంచి చతుర్ముఖ పోటీ వైపు మళ్లుతున్నాయి. ఈ మార్పు తెలంగాణ ఓటరు నాడిని ఎలా మారుస్తుందో వేచి చూడాలి. ముఖ్యంగా మహిళా నేత నేతృత్వంలో వస్తున్న మొదటి ప్రాంతీయ పార్టీగా ఇది ఏ మేరకు సక్సెస్ అవుతుందో త్వరలోనే క్లారిటీ వస్తుంది.

టార్గెట్ క్లియర్

సాధారణంగా కొత్త పార్టీలు అధికార పార్టీని విమర్శించడం ద్వారా ఉనికిని చాటుకుంటాయి. కానీ కవిత మాత్రం అధికార కాంగ్రెస్‌ను , దూకుడుగా ఉన్న బీజేపీని కాకుండా, బీఆర్ఎస్ మీదనే ఎక్కువ దృష్టి సారించారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు సిద్ధాంతపరంగా ఆమె వైపు వచ్చే అవకాశం లేదని, అలాగే బీజేపీ హిందూత్వ ఓటు బ్యాంకు తన దరి చేరదని ఆమెకు బాగా తెలుసు. అందుకే, గత పదేళ్లుగా బీఆర్ఎస్ వెన్నంటి ఉన్న సంప్రదాయ ఓటు బ్యాంకును, ఆ పార్టీ పట్ల అసంతృప్తిగా ఉన్న శ్రేణులను తన వైపు తిప్పుకోవడమే ఆమె సింగిల్ పాయింట్ అజెండా గా కనిపిస్తోంది.బీఆర్ఎస్ పుంజుకునేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో కవిత ఎంట్రీ ఆ పార్టీకి పెనుగండంగా మారేలా ఉంది. బీఆర్ఎస్ వైఫల్యాలను, ముఖ్యంగా మలి దశ తెలంగాణ ఉద్యమకారులకు జరిగిన అన్యాయాన్ని ఆమె పదే పదే ప్రస్తావిస్తుండటం యాధృచ్ఛికం కాదు. రేజరగబోయే ఆవిర్భావ సభలో కూడా ఆమె ప్రసంగం బీఆర్ఎస్ అధినాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకునే సాగే అవకాశం ఉంది. తండ్రి చాటు బిడ్డగా కాకుండా, తెలంగాణ ఆకాంక్షలను మోసే స్వతంత్ర గళంగా తనను తాను ఆవిష్కరించుకోవడం ద్వారా బీఆర్ఎస్ క్యాడర్‌లో చీలిక తీసుకురావడమే ఆమె అసలు ప్లాన్. రాజకీయాల్లో కేవలం సెంటిమెంట్‌తోనే ఓట్లు పడవని గుర్తించిన కవిత, క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ బలహీనపడిన చోట తన పట్టును పెంచుకోవాలని చూస్తున్నారు. బీఆర్ఎస్ ఓటు బ్యాంకు చెల్లాచెదురైతే, అది కాంగ్రెస్‌కో లేదా బీజేపీకో వెళ్లకుండా తన కొత్త పార్టీ ఒక షెల్టర్ లాగా ఉపయోగపడాలని ఆమె ఆశిస్తున్నారు. ఈ వ్యూహం గనుక పారితే, బీఆర్ఎస్ ఉనికికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఒక రకంగా చెప్పాలంటే, బీఆర్ఎస్ పునాదుల మీదనే తన రాజకీయ సౌధాన్ని నిర్మించుకోవాలని కవిత గట్టి నిర్ణయానికి వచ్చారు.

రాజకీయాల్లో బంధుత్వాలు ఉండవు.. కేవలం బాధ్యతలే ఉంటాయి అనే సంకేతాన్ని కవిత ఇప్పటికే ఇచ్చారు. కేసీఆర్ అనుసరించిన కొన్ని విధానాలను ఆమె బహిరంగంగానే తప్పుపట్టడం ద్వారా, తాను బీఆర్ఎస్ బి-టీమ్ కాదనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. ఆవిర్భావ సభ తర్వాత ఆమె చేపట్టబోయే కార్యక్రమాలు కూడా బీఆర్ఎస్ కంచుకోటలుగా ఉన్న జిల్లాల్లోనే ఎక్కువగా ఉండేలా ప్లాన్ చేశారు. ఇది కచ్చితంగా గులాబీ దళానికి ఒక హెచ్చరిక లాంటిదే. కవిత రాజకీయ చదరంగంలో తొలి పావును అత్యంత తెలివిగా కదిపారు. ప్రత్యర్థులైన కాంగ్రెస్, బీజేపీలను వదిలేసి, తన సొంత ఇంటి ఓటు బ్యాంకుపైనే ఆమె యుద్ధం ప్రకటించడం తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు దారితీస్తోంది. రేపటి సభలో ఆమె ప్రకటించబోయే పార్టీ పేరు, విధివిధానాలు బీఆర్ఎస్ భవిష్యత్తును ఏ మేరకు ప్రభావితం చేస్తాయోనన్న ఆందోళన ఇప్పుడు ఆ పార్టీ వర్గాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. కవిత కొత్త ప్రయోగం' విజయవంతమైతే, తెలంగాణలో బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకోవడం అత్యంత కష్టతరంగా మారవచ్చు.

# పేటంట్స్ కోసం ప్లానింగ్...

హైదరాబాద్, ఏప్రిల్ 25,

శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థుల సృజనాత్మకతకు చట్టబద్ధమైన గుర్తింపునిచ్చేందుకు ఉస్మానియా , జేఎన్‌టీయూ (విశ్వవిద్యాలయాలు నడుం బిగించాయి. సాధారణంగా న్యాయశాస్త్ర విద్యార్థులకే పరిమితమైన 'మేధో హక్కుల పరిరక్షణ' అంశంపై ఇప్పుడు సైన్స్, ఇంజనీరింగ్ విద్యార్థులకు కూడా ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నాయి. వినూత్న ఆవిష్కరణలు చేసే విద్యార్థులకు తమ పేటెంట్ హక్కులను ఎలా కాపాడుకోవాలో నేర్పడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం.ప్రతి ఏటా ఒక్కో విశ్వవిద్యాలయం నుండి కనీసం మూడు పేటెంట్లు, రెండు ట్రేడ్ మార్కు హక్కుల దరఖాస్తులు దాఖలు చేసేలా రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి సాంకేతిక సహకారాన్ని అందిస్తోంది. ఇందుకోసం ఉస్మానియా యూనివర్సిటీలో 'ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్' కోర్సును అందుబాటులోకి తెచ్చారు. విద్యార్థులు తమ 3వ లేదా 4వ సెమిస్టర్లలో ఈ కోర్సును అభ్యసించడం ద్వారా పరిశోధనలు, సాఫ్ట్‌వేర్ కాపీరైట్స్ వంటి అంశాలపై పూర్తి అవగాహన పొందే అవకాశం ఉంది.

ఉపాధి అవకాశాలు..

ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి బహుళజాతి సంస్థల్లో అద్భుతమైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఐటీ సంస్థలకు కన్సల్టెంట్లుగా వ్యవహరిస్తూ సొంతంగానూ ఎదగవచ్చు.

ఓయూలో న్యాయశాస్త్రంతో పాటు ఈ ప్రత్యేక కోర్సులు చదివిన విద్యార్థులు ఎంఎన్‌సీలలో ఏడాదికి రూ. 30 లక్షల నుంచి రూ. 60 లక్షల వరకు జీతాన్ని అందుకుంటున్నారు.

యూపీకి చెందిన ముగ్గురు విద్యార్థులు నెలకు రూ. 8 లక్షల వేతనంతో సలహాదారులుగా నియమితులయ్యారు.

ఎల్.ఎల్.ఎమ్ పూర్తి చేసిన ఇద్దరు విద్యార్థులు మధ్యప్రదేశ్‌లోని ఐటీ కంపెనీల్లో రూ. 26 లక్షల వార్షిక వేతనంతో కన్సల్టెంట్ కొలువులు సాధించారు.

మొత్తానికి, విద్యార్థుల మేధస్సుకు చట్టపరమైన రక్షణ కల్పిస్తూనే, వారి భవిష్యత్తుకు ఈ కోర్సులు బంగారు బాటలు వేస్తున్నాయి.

# నన్ను క్షమించండి....

హైదరాబాద్, ఏప్రిల్ 25,

కేసీఆర్ పాలనలో ఆశించిన ఫలితాలు రాలేదని, ఆనాడు పరిపాలించిన కుటుంబంలో తాను భాగస్వామినైనందుకు తెలంగాణ ప్రజలు తనను క్షమించాలని తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కోరారు. సామాజిక తెలంగాణ కోసం అవతలివాడు మనవాడైనా యుద్ధం చేయడానికి పాంచజన్యం పూరిస్తామని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలపై ఆమె తీవ్ర విమర్శలు గుప్పించారుమేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ ఎలా ఉందంటే, ఫామ్ హౌస్‌లో పెద్దసారు ఉండాలి, చిన్నసారు ముఖ్యమంత్రి కావాలనే విధంగా ఉందని కేసీఆర్, కేటీఆర్‌లను ఉద్దేశించి విమర్శించారు. మన యుద్ధం మూడు పార్టీలపై ఉంటుందని అన్నారు. ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేస్తామని అన్నారు.నాడు ఉపఎన్నిక కోసమే దళితబంధు ప్రకటించారని ధ్వజమెత్తారు. జీహెచ్ఎంసీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. ఏ కలలతో మనం తెలంగాణను సాధించుకున్నామో అవి నిజం కాలేదని ఆమె అన్నారు. ఈరోజు నా జీవితంలో మరిచిపోలేని రోజు అని అన్నారు. తెలంగాణ భవిష్యత్తు రాసుకోవడానికి మనందరి భాగస్వామ్యం కావాలని అన్నారు. కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ఉద్యమ రథం దారి తప్పిందని విమర్శించారు.టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్‌గా మారిన తర్వాత రాష్ట్ర ప్రజల ఆర్తిని అర్థం చేసుకోవడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. సామాజిక తెలంగాణ రథ చక్రం విరిగి ముక్కలైందని అన్నారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో ఏం పనులు జరగాలో కేసీఆర్ పాలనలో అవి జరగలేదని ఆరోపించారు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావించామని, కానీ రైతులకు బేడీలు పడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ అంతా నిఘా నీడలో ఉందని అన్నారు.కేసీఆర్ పాలనలో తానూ భాగస్వామినైనందుకు సిగ్గుపడుతున్నానని, అందుకే ప్రజలను క్షమించమని కోరుతున్నానని అన్నారు. తెలంగాణ సాధించినందుకు గర్విస్తున్నాను కానీ పాలన సమయంలో తప్పులో భాగస్వామినైనందుకు ఆవేదనగా ఉందని అన్నారు. అందుకు తాను కేవలం క్షమాపణ చెబితే సరిపోదని, సామాజిక తెలంగాణ కోసం నడుం బిగించి కష్టపడి పని చేయాలని అన్నారు.

# కవిత టీఆర్ఎస్ పేరుకు
# ఈసీ అనుమతి ఇస్తుందా

హైదరాబాద్, ఏప్రిల్ 25,




తెలంగాణ ప్రజల గుండెల్లో బలంగా నాటుకుపోయిన టీఆర్ఎస్ అనే పేరు ఇప్పుడు బీఆర్ఎస్ అధినాయకత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేసే అంశంగా మారుతోంది. జాతీయ రాజకీయాల కోసం కేసీఆర్ తన పార్టీ పేరును బీఆర్ఎస్‌గా మార్చినా క్షేత్రస్థాయిలో తెలంగాణ అనే పదం లేకపోవడం ఒక లోటుగా మిగిలిపోయింది. అదే అవకాశంగా కల్వకుంట్ల కవిత టీఆర్ఎస్ పేరుతో కొత్త పార్టీ ప్రకటన చేశారు. కవితపార్టీ పేరును ఎన్నికల సంఘం ఆమోదించదని బీఆర్ఎస్ నేతలు ఆశాభావంతో ఉన్నారు. అసలుకు..నకిలీకి చాలా తేడా ఉంటుందని బీఆర్ఎస్ సెటైర్లు వేస్తోంది. ఆ పార్టీ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి టీఆర్ఎస్ పేరును ఈసీ ఆమోదించదు కాబట్టి బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళన చెందాల్సినపనిలేదని అంటున్నారు. భారత ఎన్నికల సంఘం రికార్డుల ప్రకారం, ఒకసారి ఒక పార్టీ తన పేరును అధికారికంగా మార్చుకున్నప్పుడు, పాత పేరు ఫ్రీ పూల్ లోకి వెళ్తుంది. అంటే సాంకేతికంగా తెలంగాణ రాష్ట్ర సమితి అనే పేరు ప్రస్తుతం ఖాళీగానే ఉంది. అయితే, ఎన్నికల గుర్తుల రూల్స్ ప్రకారం, ఓటర్లను తప్పుదోవ పట్టించేలా ఉన్న పేర్లను కేటాయించకూడదని ఈసీకి విచక్షణాధికారం ఉంటుంది. దశాబ్దాల చరిత్ర ఉన్న టీఆర్ఎస్ పేరును వేరొకరికి ఇవ్వడం వల్ల ఓటర్లు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉందని బీఆర్ఎస్ గట్టిగా వాదించవచ్చు. కానీ ఇక్కడ కవిత నేరుగా తెలంగాణ రాష్ట్ర సమితి అనే పేరు పెట్టలేదు. తెలివిగా.. తెలంగాణ రాష్ట్ర సేన అని పెట్టారు. షార్ట్ కట్ పేర్లను ఈసీ పెద్దగా పట్టించుకోకపోవచ్చు.

కవితకు పార్టీ పేరు అందకుండా కేసీఆర్ న్యాయపోరాటం ఖాయం

తెలంగాణ ఉద్యమ కాలం నుంచి ప్రజలు టీఆర్ఎస్ ను తమ సొంత ఇంటి పార్టీగా భావించారు. బీఆర్ఎస్‌గా మారిన తర్వాత, ఆ పార్టీకి ఉన్న ప్రాంతీయ బ్రాండ్ ఇమేజ్ కొంత మసకబారిందనేది కాదనలేని వాస్తవం. అందుకే టీఆర్ఎస్ పేరు కోసం కవిత ఈసీకి దరఖాస్తు చేసినప్పుడు, బీఆర్ఎస్ కచ్చితంగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తుంది. ఈసీ అనుమతిస్తే ఢిల్లీ హైకోర్టు లేదా సుప్రీంకోర్టు వరకు వెళ్లే అవకాశం ఉంది. అయితే, ఈ న్యాయపోరాటం ఫలితం ఎలా ఉన్నా, ఆ ప్రక్రియలో జరిగే చర్చ ప్రజల్లోకి నెగటివ్ సంకేతాలను పంపుతుంది. తమ పాత పేరును కూడా కాపాడుకోలేకపోతున్నారా " అనే భావన ప్రజల్లో కలిగితే అది పార్టీ నైతిక బలాన్ని తగ్గిస్తుంది. బీఆర్ఎస్ ఈ చర్చను కొనసాగించాలా లేదా అన్నది వారు ఖరారు చేసుకునే వ్యూహాలను బట్టి ఉంటుంది.

పేరు వెనుక ఉన్న పవర్ పాలిటిక్స్

రాజకీయాల్లో గుర్తు కంటే పేరు కే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది, ముఖ్యంగా ప్రాంతీయ ఆకాంక్షలతో ముడిపడినప్పుడు. అందుకే బీఆర్ఎస్ ఇప్పుడు ఇరకాటంలో పడటం ఖాయం . టీఆర్ఎస్ అనేది కేవలం మూడు అక్షరాలు మాత్రమే కాదు.. అది తెలంగాణ రాజకీయాలను మలుపు తిప్పగల ఒక శక్తివంతమైన ఆయుధం. టీఆర్ఎస్ పేరు తిరిగి తెరపైకి రావడం అదీ కూడా కవిత వైపు నుంచి రావడం బీఆర్ఎస్‌కు అతిపెద్ద రాజకీయ ముప్పుగా పరిణమించే అవకాశం ఉంది. సాంకేతికత కంటే రాజకీయ సెంటిమెంటే ఇక్కడ కీలక పాత్ర పోషించనుంది

============

# చంద్రబాబుకు అవార్డు...

విజయవాడ, ఏప్రిల్ 25,

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మరో అరుదైన జాతీయ స్థాయి గౌరవాన్ని అందుకోబోతున్నారు. దేశంలోని ప్రతిష్ఠాత్మక మీడియా సంస్థ ఎకనమిక్ టైమ్స్ ప్రకటించిన 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ 2025' అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. రాష్ట్రంలో పాలనను పరుగులు పెట్టిస్తూ, వ్యాపార నిర్వహణను సులభతరం చేస్తూ ఆయన అమలు చేస్తున్న విప్లవాత్మక విధానాలకు గుర్తింపుగా ఈ పురస్కారం వరించింది. ఈ అవార్డును అందుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ముంబైలో పర్యటించనున్నారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'తో పాటు 'స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు' వంటి విధానాలను పక్కాగా అమలు చేస్తూ, రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంలో చంద్రబాబు చూపుతున్న చొరవను ఎకనమిక్ టైమ్స్ జ్యూరీ ప్రత్యేకంగా ప్రశంసించింది. ముఖ్యంగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే రాష్ట్రానికి సుమారు రూ.20 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తీసుకురావడంలో ఆయన సఫలీకృతం కావడం ఈ అవార్డు ఎంపికలో కీలక పాత్ర పోషించింది.

పారిశ్రామిక అనుమతుల ప్రక్రియను సరళతరం చేయడం, టెక్నాలజీ, ఐటీ, ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ వంటి భవిష్యత్ రంగాల్లో ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలపాలనే ఆయన లక్ష్యాన్ని జ్యూరీ కొనియాడింది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా హైదరాబాద్‌ను ప్రపంచ ఐటీ పటంలో నిలబెట్టిన అనుభవాన్ని ప్రస్తుత నవ్యాంధ్ర నిర్మాణంలోనూ చంద్రబాబు ప్రదర్శిస్తున్నారని పేర్కొంది.

# జూన్ నాటికి పోలవరం జలాలు

కాకినాడ, ఏప్రిల్ 25,

ఉత్తరాంధ్ర జిల్లాల సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలను తీర్చడంలో గోదావరి జలాలు అత్యంత కీలకమని, ఈ నీటిని తరలించేందుకు పోలవరం ఎడమ కాలువే ప్రధాన ఆధారమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. జూన్ నాటికి మొదటి దశ పనులను పూర్తి చేసి, అనకాపల్లి వరకు గోదావరి జలాలను తరలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. కాకినాడ జిల్లా అన్నవరంలో పంపా ఆక్విడక్ట్ వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను మంత్రి ఈరోజు స్వయంగా పరిశీలించారు. ఆరెంపూడి, గవరయ్య కోనేరు గ్రామాల సమీపంలో నేషనల్ హైవే క్రాసింగ్ వద్ద జరుగుతున్న వంతెనల నిర్మాణ పనులను పర్యవేక్షించిన ఆయన, అనంతరం తుని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పనుల్లో జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదని ఏజెన్సీలను హెచ్చరించారు. ముఖ్యంగా హైవే క్రాసింగ్ వద్ద వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనకాపల్లి కేంద్రంగా వస్తున్న భారీ పరిశ్రమలకు నీటి ఎద్దడి లేకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలవరం ఎడమ కాలువ కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని మంత్రి ఆరోపించారు.

జగన్ ప్రభుత్వం ఉత్తరాంధ్ర ప్రజలపై కక్ష గట్టి పనులను ప్రీ-క్లోజర్ చేసిందని, కాలువ సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కుల నుంచి 8,122 క్యూసెక్కులకు తగ్గించి ప్రాంతీయ ప్రయోజనాలకు గండికొట్టారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు మొదటి ప్రాధాన్యతగా పోలవరం ప్రాజెక్టును, రెండో ప్రాధాన్యతగా ఈ ఎడమ కాలువను సందర్శించారని గుర్తుచేశారు.ప్రస్తుతం రూ.1,460 కోట్లు ఖర్చు చేసి పనులను పరుగులు పెట్టిస్తున్నామని, ఇప్పటివరకు 76 శాతం పనులు పూర్తయ్యాయని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా తుని వరకు ఉన్న 110 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు నిండటం వల్ల 28,557 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందన్నారు. పిఠాపురం అప్ టేక్ స్లూయిస్ నిర్మాణం పూర్తయితే మరో 67,674 ఎకరాల ఏలేరు ఆయకట్టుకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. మార్గమధ్యంలో ఉన్న 143 గ్రామాలకు చెందిన 5.23 లక్షల మందికి శాశ్వతంగా తాగునీటి సమస్య తీరుతుందన్నారు. అలాగే పాయకారావుపేట ఎగువన ఉన్న 98 ట్యాంకులు నిండటం ద్వారా 48,368 ఎకరాలకు నీరందుతుందని పేర్కొన్నారు. కుమ్మరిలోవ నిర్వాసితులకు రూ.30.38 కోట్ల పరిహారాన్ని అందించినట్లు వెల్లడించిన మంత్రి, ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటించారు.

# కేసీఆర్ నిర్మించిన
# పునాదులపైనే కవిత పార్టీ

హైదరాబాద్, ఏప్రిల్ 25,

టీఆర్ఎస్ పేరుతో పార్టీని ప్రారంభించిన కల్వకుంట్ల కవిత తన రాజకీయ ప్రస్థానంలో ఒక సాహసోపేతమైన మలుపు తీసుకున్నారు. కేవలం ఒక కొత్త పార్టీని స్థాపించడమే కాకుండా, తన తండ్రి కేసీఆర్ నిర్మించిన రాజకీయ పునాదుల పైనే ఎదిగేలా ఆమె రెడీ చేసుకున్న రూట్ మ్యాప్ తెలంగాణ రాజకీయాల్లో కొత్త మార్పులు తీసుకు రానుంది. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత బీఆర్ఎస్ పార్టీని టీఆర్ఎస్ గా మార్చే ఆలోచన ఉందని కేటీఆర్ చెప్పారు. దీనికి కారణం ప్రజలు బీఆర్ఎస్ పేరు మార్పుతో అనుబంధం కోల్పోయినట్లుగా ఫీలవుతున్నారని కూడా చెప్పారు. అయితే బీఆర్ఎస్ పార్టీని మళ్లీ టీఆర్ఎస్ గా మార్చేందుకు ఆసక్తి చూపించలేదు. ఇంతలోనే కవిత పార్టీ పేరును తెలంగాణ రాష్ట్ర సేన గా ప్రకటించారు. దీని వెనుక లోతైన రాజకీయ వ్యూహం ఉంది. బీఆర్ఎస్‌గా మారిన తర్వాత తెలంగాణ సమాజంలో టీఆర్ఎస్ అనే బ్రాండ్ పట్ల ఉన్న సెంటిమెంట్ అనాథగా మారిందని ఆమె గుర్తించారు. ఇప్పుడు సేన పేరుతో ఆ పాత బ్రాండ్‌ను తిరిగి సొంతం చేసుకోవడం ద్వారా, తెలంగాణ అస్తిత్వానికి అసలైన వారసురాలిని తానే అని ప్రజలకు సంకేతం ఇచ్చారు. టీఆర్ఎస్ అంటే ఇప్పుడు నా పార్టీయే అనే అర్థం వచ్చేలా ఆమె చేసిన ప్రసంగం, ఉద్యమకారులను తనవైపు తిప్పుకునే ప్రయత్నంగా కనిపిస్తోంది.తన ప్రసంగంలో కవిత ఎక్కడా తండ్రి పట్ల మమకారం చూపలేదు. కేసీఆర్ ఒకప్పుడు ఉద్యమ వీరుడని, కానీ ఇప్పుడు ఆయన కేవలం ఒక మరమనిషిగా మారిపోయారని వ్యాఖ్యానించడం ద్వారా ఆమె తన రాజకీయ దారిని స్పష్టం చేసుకున్నారు. కుటుంబ సభ్యురాలిగా గత పదేళ్ల పాలనలోని వైఫల్యాలకు క్షమాపణలు కోరడం ద్వారా, ఆమె ప్రజల ముందు ఒక క్లీన్ ఇమేజ్ తో రావాలని ఆశిస్తున్నారు. తండ్రి నీడ నుండి బయటకు వచ్చి, సొంతంగా ఎదిగే క్రమంలో ఆమె సెంటిమెంట్లను పక్కన పెట్టేసి అత్యంత వాస్తవిక రాజకీయాలను ఎంచుకున్నారు.సామాజిక రథ చక్రం విరిగి ముక్కలైంది అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ హయాంలో అణచివేతకు గురైన వర్గాలను ఉద్దేశించినవే. రైతులకు సంకెళ్లు, దళితులకు దెబ్బలు, ఫోన్ ట్యాపింగ్‌తో నిఘా నీడన బతుకులు.. ఇవేవీ మనం కోరుకున్న తెలంగాణ కాదని ఆమె కుండబద్దలు కొట్టారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ఆత్మను కోల్పోయిందని, దానికి ప్రత్యామ్నాయంగా తాను ఒక ప్రజాస్వామ్యయుత వేదికను అందిస్తున్నానని ఆమె కన్విన్సింగ్ గా చెప్పుకోగలిగారు. పార్టీలో తనను పక్కన పెట్టి, అవినీతి పరులైన పందికొక్కుల్ని కేసీఆర్ నెత్తిన పెట్టుకున్నారని కవిత చేసిన ఆరోపణ పార్టీ అంతర్గత సంక్షోభాన్ని ప్రతిబింబిస్తోంది. పార్టీని దోచుకునే వారికి ప్రాధాన్యత పెరిగిందని, నిబద్ధత గల వారికి స్థానం లేదని ఆమె మండిపడ్డారు. ఈ వ్యాఖ్యల ద్వారా బీఆర్ఎస్‌లో అసంతృప్తితో ఉన్న ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని తన పార్టీ వైపు ఆకర్షించేందుకు ఆమె గట్టి పునాది వేశారు. తన టీఆర్ఎస్ లో పారదర్శకత ఉంటుందని, అవినీతికి తావుండదని ఆమె హామీ ఇచ్చారు.చివరగా, తాను ఒక అమ్మగా ప్రజల కష్టాలు తీరుస్తానని చెప్పడం ద్వారా ఆమె ఒక ఎమోషనల్ కనెక్ట్ ఏర్పరచుకున్నారు. బీఆర్ఎస్ ఒక కార్పొరేట్ సంస్థలా మారిందని, తన తెలంగాణ రాష్ట్ర సేన మాత్రం ఒక కుటుంబంలా ఉంటుందని ఆమె నమ్మించగలిగారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ఉనికిని ప్రశ్నార్థకం చేసేలా తన అడుగులు వేస్తున్నారు. తెలంగాణ గడ్డపై ఇప్పుడు అసలైన టీఆర్ఎస్ పోరు మొదలైందని ఆమె చాటిచెప్పారు. కవిత రాజకీయంతో బీఆర్ఎస్ పార్టీకి చిక్కులు తప్పకపోవచ్చనిరాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి.

# గందరగోళమన్న బీఆర్ఎస్...లైట్ అంటున్న బీజేపీ

హైదరాబాద్, ఏప్రిల్ 25,

తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శనివారం (ఏప్రిల్ 25) సరికొత్త రాజకీయ పార్టీని ప్రకటించి సంచలనం సృష్టించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో జరిగిన భారీ ఆవిర్భావ సభలో తన పార్టీ పేరును 'తెలంగాణ రాష్ట్ర సేన' గా ఆమె నామకరణం చేశారు. గతంలో తన తండ్రి కేసీఆర్ స్థాపించిన పార్టీ పేరునే (టీఆర్ఎస్) స్వల్ప మార్పుతో మళ్ళీ తెరపైకి తీసుకురావడం విశేషం.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. తెలంగాణ ఉద్యమంలో జాగృతి సంస్థ ద్వారా తాను పోషించిన పాత్రను గుర్తు చేసుకున్నారు. "వచ్చిన తెలంగాణ దారి తప్పింది. సామాజిక తెలంగాణ రథచక్రం విరిగిపోయింది. గతంలో రాష్ట్రాన్ని పాలించిన కుటుంబంలో నేను భాగమైనందుకు కొన్ని విషయాల్లో, ముఖ్యంగా ఇసుక మాఫియా వంటి అంశాల్లో సిగ్గుపడుతున్నాను. కానీ, తెలంగాణ సాధించిన కుటుంబంలో ఉన్నందుకు గర్వపడుతున్నాను" అని ఆమె వ్యాఖ్యానించారు.

తమ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే ఐదు ప్రధాన అంశాలను 'పాంచజన్యం' పేరుతో ఐదు హామీలను కవిత ప్రకటించారు.

1. విద్య: ప్రైవేట్ పాఠశాలల్లోనూ ఉచిత విద్య.
2. వైద్యం: ఏ ఆస్పత్రిలోనైనా ఉచిత వైద్య సేవలు.
3. వ్యవసాయం: రైతే రాజు నినాదాన్ని నిజం చేయడం.
4. ఉపాధి: యువతకు రూ. 2 లక్షల నుంచి రూ. 20 కోట్ల వరకు రుణాలు. మొదటి ఏడాదిలోనే 4 లక్షల ఉద్యోగాల భర్తీతో పాటు, ఉద్యమకారుల కోసం లక్ష సూపర్‌న్యూమరీ పోస్టుల కేటాయింపు.
5. సామాజిక న్యాయం: అన్ని వర్గాల వారి సంక్షేమానికి ప్రాధాన్యత

కవిత ప్రకటనపై బీఆర్ఎస్ నేత పటోళ్ల కార్తీక్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. టీఆర్ఎస్ ఫార్టీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం (ఇఅఎ) నిబంధనల ప్రకారం.. పాత పార్టీల పేర్లను పోలిన పేర్లతో కొత్త పార్టీలను అనుమతించరని ఆయన స్పష్టం చేశారు. ఇది కేవలం ప్రజలను గందరగోళానికి గురిచేసే ఎత్తుగడ మాత్రమేనని కొట్టిపారేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక చీ ద్వారా పేర్కొన్నారు.

మరోవైపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పందిస్తూ.. తెలంగాణలో ఎన్ని పార్టీలు వచ్చినా బీజేపీకి వచ్చే నష్టం లేదని ధీమా వ్యక్తం చేశారు. గతంలో టీఆర్ఎస్, ఇప్పుడు బీఆర్ఎస్, మళ్లీ ఇప్పుడు పుట్టబోయే టీఆర్ఎస్ అంటూ ఎద్దేవా చేశారు. ప్రజలు అవినీతి రహిత మోదీ పాలన వైపే ఉన్నారని, తెలంగాణలో బీజేపీయే అధికారంలోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. మొత్తానికి కవిత కొత్త పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

# ఒరిజనల్ ఎప్పుడు ఒరిజనలే...

హైదరాబాద్, ఏప్రిల్ 25,

తెలంగాణలో మరో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించిన నేపథ్యంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తన పార్టీకి 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)' అని పేరు పెట్టడంపై బీఆర్ఎస్ పార్టీ వ్యంగ్యంగా స్పందించింది. ఈ మేరకు బీఆర్ఎస్ తన అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో ఓ సెటైరికల్ పోస్టు పెట్టింది. కోల్‌గేట్ టూత్‌పేస్ట్, బిస్లేరీ వాటర్ బాటిల్‌కు సంబంధించి ఒరిజినల్, నకిలీ ఉత్పత్తుల ఫొటోలను పక్కపక్కనే జోడించింది. దీనికి "ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే!" అనే క్యాప్షన్‌ను జత చేసింది. కవిత తన పార్టీకి టీఆర్ఎస్ అని పేరు పెట్టుకున్నప్పటికీ, తామే అసలైన పార్టీ అని బీఆర్ఎస్ ఈ పోస్టు ద్వారా పరోక్షంగా స్పష్టం చేసింది. తమ పార్టీ బ్రాండ్‌కే ప్రజల్లో ఆదరణ ఉంటుందని, కొత్తగా వచ్చిన పార్టీకి కాదని చెప్పకనే చెప్పింది. రాష్ట్రంలో అసలైన తెలంగాణ వాద పార్టీ తమదేనని చాటుకునే ప్రయత్నం చేసింది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత, 'తెలంగాణ రాష్ట్ర సేన' పేరుతో కొత్త పార్టీని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ నుంచి ఈ స్పందన వచ్చింది. దీంతో టీఆర్ఎస్ పేరు చుట్టూ తెలంగాణ రాజకీయాలు మరోసారి వేడెక్కాయి.

# ఎస్సార్ నగర్ లో కూల్చివేతలు

హైదరాబాదం ఏప్రిల్ 25,

హైకోర్టు ఆదేశాల మేరకు ఫుట్ పాత్ ఆక్రమణలపై జి హెచ్ ఎం సి అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఎస్సార్ నగర్, బికే గూడ ప్రాంతాల్లో అక్రమంగా ఫుట్ పాత్ లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిపై జిహెచ్ఎంసి అధికారుల ఉక్కుపాదం మోపారు. హైకోర్టు ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టిన జిహెచ్ఎంసి అధికారులు ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ నుండి బి కె గూడ చౌరస్తా వరకు ఫుట్ పాత్ ఆక్రమణలను పోలీస్ బందోబస్త్ మధ్య కూల్చివేతలు చేపట్టారు.

# చేనేత కళలను ప్రోత్సహించాలి

హైదరాబాద్ ఏప్రిల్ 25,

చేనేత కళలను ప్రోత్సహించాలని పద్మశ్రీ డాక్టర్ పద్మజారెడ్డి అన్నారు. శ్రీనగర్కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో నేషనల్ సిల్క్ ఎక్స్పో పేరిట ఏర్పాటు చేసిన చేనేత వస్త్రప్రదర్శనను ఆమె ప్రారంభించారు. వస్త్ర ప్రదర్శనలోని వస్త్రాలను తిలకించి చేనేతకారులను అభినందించారు. దేశంలో ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కారులు తమ ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ వస్త్రాలను సుమారు 80 స్టాళ్లల్లో ప్రదర్శిస్తున్నారని నిర్వాహకులు జయేషుప్తా చెప్పారు. ఈనెల 28వ తేదీ వరకు ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

# మైలవరం లో ఇంధన కొరత

మైలవరం ఏప్రిల్ 25,

ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో ఇంధన కొరత తీవ్రమైంది. శుక్రవారం సాయంత్రం నుండి పెట్రోల్ బంకుల్లో ఇంధనం లేకపోవడంతో వాహనాలు కిలోమీటర్ల మేర క్యూ కట్టాయి. ఏదో ఒక సమయానికి ఇంధనం వస్తుందనే ఆశతో వాహనదారులు బంకుల వద్ద వేచి చూస్తున్నారు. అధికారులు స్పందించి ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఆయిల్ కంపెనీలు సరఫరా తగ్గించడంతో పెట్రోల్ బంకులు ఖాళీ అయ్యాయి. దీనివల్ల వరి కోతలు నిలిచిపోయాయి, ఆక్వా చెరువులకు ఏరియేటర్లు నడపలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. క్రెడిట్ సౌకర్యం రద్దు కావడం డీలర్లకు అదనపు సమస్యగా మారింది. వాహనదారులు, రైతులు వెంటనే సరఫరా పునరుద్ధరించాలని కోరుతున్నారు.

# ఇబ్రహీంపట్నంలో నడిరోడ్డుపై అగ్నికి ఆహుతైన కారు!

విజయవాడ ఏప్రిల్ 25,

ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ సమీపంలో కారులో ఒక్కసారిగా చెలరేగిన మంటలలో కారు దగ్ధమయింది. బ్యాటరీలో సాంకేతిక లోపం కారణంగా ఇంజిన్ నుండి మంటలు వ్యాపించచాయి. వాహనదారులు భయాందోళనలో పడ్డారు. విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసుల మెరుపు వేగంతో స్పందించారు. మంటలను అదుపు చేసి పెను ప్రమాదాన్ని తప్పించారు. పోలీసుల సమయస్ఫూర్తితో కారు ప్రయాణికులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఘటనతో ట్రాఫిక్ రహదారిపై నిలిచిపోయింది. దెబ్బతిన్న వాహనాన్ని రోడ్డు పక్కకు తొలగించి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు.

# జర్నలిస్టులకు ఆరోగ్య శిబిరం

హైదరాబాద్ ఏప్రిల్ 25,

జర్నలిస్టుల ఆరోగ్యం, సంక్షేమ పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. హైదరాబాద్ బేగంపేట నేచర్ క్యూర్ హాస్పిటల్ లో నిర్వహించిన మెగా జర్నలిస్టుల ఆరోగ్య శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. జర్నలిస్టులు నిత్యం పని ఒత్తిడికి లోనవుతుంటారని , వారి కోసం ప్రత్యేకంగా ఇలాంటి సమగ్ర ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించడం రాష్ట్రంలో ఇదే తొలిసారి కావడం విశేషమన్నారు. జర్నలిస్టులు ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషిస్తూ ప్రభుత్వం?ప్రజల మధ్య వారధిగా నిలుస్తున్నారని, కష్టసాధ్యమైన పరిస్థితుల్లో పనిచేసే మీడియా ప్రతినిధుల ఆరోగ్యం కాపాడటం అత్యవసరమని ఆమె అన్నారు.

జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని వివరించారు. హైదరాబాద్ జిల్లాలో 94 మంది జర్నలిస్టులకు ?94 లక్షలు ఆర్థిక సహాయం, 17 మందికి అనారోగ్య సహాయం అందించామని చెప్పారు. అలాగే జర్నలిస్టుల కుటుంబాలకు నెలవారీ పెన్షన్, పిల్లలకు విద్యా సహాయం, వేలాది ఆరోగ్య కార్డుల జారీ, ఉచిత బస్సు పాసులు వంటి పథకాలు అమలులో ఉన్నాయని వెల్లడించారు.

వేగంగా మారుతున్న సమాచార యుగంలో నిజ నిర్ధారణతో కూడిన బాధ్యతాయుత జర్నలిజం అవసరమని, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంలో మీడియా పాత్ర కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. జర్నలిస్టులు ఈ ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# అదుపుతప్పి డ్రైనేజీలోకి దూసుకెళ్లిన కారు

## తాడేపల్లి భరతమాత సెంటర్‌లో ప్రమాదం

### క్షేమంగా బయటపడ్డ వ్యక్తి



తాడేపల్లి, ఏప్రిల్ 25,

గుంటూరు జిల్లా తాడేపల్లిలోని భరతమాత సెంటర్ వద్ద శనివారం తెల్లవారుజామున ఓ కారు ప్రమాదానికి గురైంది. వేగంగా వెళ్తున్న కారు ఒక్కసారిగా అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న డ్రైనేజీ కాల్వలోకి దూసుకుపోయింది. ఈ ఘటన ఈరోజు ఉదయం సుమారు 5 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో కారులో ఉన్న ఎయిర్ బ్యాగులు (ఎయిర్ బెలూన్లు) వెంటనే తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి స్వల్ప గాయాలతో క్షేమంగా బయటపడ్డారు. కాగా, సదరు కారు పోలీస్ శాఖకు చెందినదిగా స్థానికులు చర్చించుకుంటున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులోని వ్యక్తి కిందకు దిగి, తన సెల్‌ఫోన్ మరియు వాకీటాకీని తీసుకుని అక్కడి నుంచి వెళ్ళిపోయినట్లు సమాచారం. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పోలీసుల ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

సిద్దిపేట ఏప్రిల్ 25,




సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాల్ ఆధ్వర్యంలో శనివారం మెగా జాబ్ మేళా జరిగింది. ఐటి, ఫార్మా తో పాటు దాదాపు 150 కంపెనీ లు ఇందులో పాల్గొన్నాయి 624 మంది ఉద్యోగం పొందారు అని తెలిసింది . సిద్దిపేట జిల్లా పోలీస్ యంత్రంగం అంతా జాబ్ మేళా లో పాల్గొనడం విశేషం!. సీపీ ప్రతి స్టాల్ ను సందర్శిస్తూ సెలెక్ట్ అయిన యువతీ యువకులకు స్వయంగా నియామక పత్రాలు అందజేసారు. పోలీస్ లు అంటే లా అండ్ ఆర్డర్ కాపాడటమే కాదు అని సిద్దిపేట పోలీస్ నిరూపించారు. మన ఊరు మన పల్లె పేరుతో కూడా సిద్దిపేట సీపీ సామజిక కార్యక్రమం లో పాల్గొంటున్నారు పలు అంశాల పట్ల ప్రజల్ని చైతన్యం చేస్తున్నారు.

సమాజం లో యువత సరైన అవకాశాలు లేక చెడు దారులను ఎంచుకుంటున్నారు... జాబ్ ఎలా ఎక్కడ చేయాలో చాలా మందికి అవగాహనా కూడా ఉండటం లేదు. సో అందరికి ఒక అవకాశం ఇస్తే తమ ప్రతిభ నిరూపించుకుని ఉద్యోగం సాధిస్తారని భావించి జాబ్ మేళా నిర్వహించినట్టు సీపీ తెలిపారు. సామాజిక బాధ్యత గా భావించి, సమాజానికి మనం కూడా ఎంతో కొంత సేవ చేయాలనీ జాబ్ మేళా చేపట్టామని సిద్దిపేట త్రీ టౌన్ సిఐ లక్ష్మణ్ బాబు అన్నారు. అపాయింట్మెంట్ ఆర్డర్ తీసుకున్న యువత కళ్ళ లో ఆనందం చూస్తే ఎంతో గొప్ప ఫీలింగ్ కలిగిందన్నారు... మధ్యాహ్నం వరకు వివిధ కంపెనీ లలో వందకు పైగా యువత సెలెక్ట్ అయ్యారు

# నెల రోజుల నుంచి ఒక్క గింజ కొన్న పాపానపోలేదు

సిరిసిల్ల ఏప్రిల్ 25,


సిరిసిల్ల నియోజకవర్గంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను కేటీఆర్ సందర్శించారు. ఈ ప్రభుత్వం వడ్లు కొంటే మద్దతు ధర, బోనస్ ఇవ్వాల్సి వస్తుందని కొనటం లేదు. సిరిసిల్ల జిల్లాలో నెల రోజుల నుంచి కొనుగోలు కేంద్రాలకు వడ్లు తీసుకొస్తే ఇప్పటివరకు ఒక్క గింజ కొన్న పాపానపోలేదు. రైస్ మిల్ కేటాయించపోతే ఎవరు కొనాలి ఎలా తూకం వేయాలి. దళారులకు అప్పగిస్తే వాళ్ళు ఇంత కమిషన్ ఇస్తారు.. అందుకే కొనకుండా వదిలేశారు. రైతుబంధు అని చెప్పి అది కూడా ఇవ్వడం లేదని అన్నారు.

సిరిసిల్లలో అధికారులను అడిగితే 1000 క్వింటాలు కూడా వడ్లు కొనలేదని అంటున్నారు. అకాల వర్షం వచ్చి ధాన్యం తడిసిపోయి పాడైపోతుందని రైతులు టార్పలిన్ కవర్లు కొని కప్పుకుంటున్నారు. ఇంత దౌర్భాగ్యమైన ప్రభుత్వం ఎక్కడా చూడలేదు. రైతుల ధాన్యం కొనుగోలు చేయాలి.. లేదంటే మేము రోడ్డెక్కుతాం. రెండేళ్లలో మళ్ళీ మన ప్రభుత్వం వస్తుంది.. ఆ తర్వాత రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటామని కేటీఆర్ అన్నారు.

# పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ కథ ముగిసింది...

# లైసెన్స్ రద్దు చేసిన ఆర్బీఐ

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రముఖ యూపీఐ ఆధారిత ఆర్థిక సేవల సంస్థ పేటీఎంకు చెందిన పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ లైసెన్సును రద్దు చేసింది. నేడు (ఏప్రిల్ 24వ తేదీన) పనివేళలు ముగిసిన తర్వాత ఈ రద్దు నిర్ణయం అమల్లోకి వస్తుందని ఆర్బీఐ ఒక అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. బ్యాంకింగ్ నియంత్రణ చట్టం 1949, సెక్షన్ 22(4) కింద ఈ చర్యలు తీసుకున్నట్లు ఆర్బీఐ తెలిపింది. ఈ నిర్ణయంతో పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ తక్షణమే ఎలాంటి బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహించకుండా నిషేధం విధించింది. బ్యాంకును పూర్తిగా మూసివేసే (వైండింగ్ అప్) ప్రక్రియ కోసం హైకోర్టును ఆశ్రయించనున్నట్లు కూడా వెల్లడించింది. అయితే, డిపాజిటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆర్బీఐ భరోసా ఇచ్చింది. బ్యాంకు వద్ద ఉన్న డిపాజిటర్లందరికీ వారి డబ్బును తిరిగి చెల్లించేందుకు సరిపడా నగదు నిల్వలు ఉన్నాయని స్పష్టం చేసింది. బ్యాంకు కార్యకలాపాలు డిపాజిటర్ల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉండటం, యాజమాన్యం తీరు ప్రజాప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉండటం, లైసెన్స్ షరతులను ఉల్లంఘించడం వంటి కారణాలతో లైసెన్సును రద్దు చేసినట్లు ఆర్బీఐ వివరించింది. గతంలో




2022 మార్చి నుంచి కొత్త కస్టమర్ల చేరికపై, 2024 జనవరి నుంచి డిపాజిట్లు, టాప్-అప్‌లపై ఆర్బీఐ ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా పూర్తిస్థాయిలో లైసెన్సును రద్దు చేస్తూ కఠిన నిర్ణయం తీసుకుంది

# జలధార కార్యక్రమాన్ని చక్కటి ప్రణాళికతో అమలు చేయాలి:జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



వై ఎస్ ఆర్ కడప, ఏప్రిల్ 25 (భారత శక్తి ): నీటి భద్రతా కార్యక్రమంలో రైతులు, సాగునీటి సంఘాల భాగస్వాములతో జలధార కార్యక్రమాల ప్రణాళికలను మరింత ప్రాధాన్యతతో పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి నోడల్ అధికారులు,మండల స్థాయి బృందాల అధికారులను ఆదేశించారు.

శనివారం కలెక్టరేట్ లోని సభా భవన్ లో నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీదర్ చెరుకూరి 'జలధార.. జల హారతి, నీటి భద్రత- అమలు ప్రణాళిక పై అన్ని మండలాల నోడల్ అధికారులు,ఎంపిడిఓ లు,ఇరిగేషన్,డ్వామా అధికారులు లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూగర్భ జలాలు మట్టాన్ని పెంపొందించడం,నీటి వనరులు సంరక్షణ,సాగునీటి వ్యవస్థ బలోపేతం లక్ష్యంగా క్షేత్రస్థాయిలో అవసరాలను గుర్తించాలన్నారు.అందులో భాగంగా నీటి వనరులను గుర్తించడం నీటి భద్రత, సాగునీటి పొదుపు, కొత్త ఆయకట్టు మదుపు,వాగులు, చెరువుల అనుసంధానం, సూక్ష్మ సేద్యం,వర్షపు నీటిని ఒడిసి పట్టడం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

మే 1వ తేదీ నుండి 30 వ తేదీ వరకు గ్రామాల వారీ గా వారి పరిధి లోని చెరువుల్లో వారి సొంత అవసరాలకు మట్టిని తోలుకోవచ్చుని, కమర్షియల్ గా కాకుండా వారి సొంత అవసరాలకు మట్టిని తోలు కోవచ్చునని తెలియజేసారు. ఈ విషయంలో గ్రామస్థులు వాణిజ్య అవసరాలకు కాకుండా కేవలం వారి సొంత అవసరాలు అంటే.. పొలాలకు మట్టి తోలడం, ఇంటి నిర్మాణం కోసం, గ్రామంలో అభివృద్ధి అవసరాలకు, ఇంటి పరిసరాల పనుల కోసం చెరువుల నుండి ఉచితంగా మట్టిని తోలుకోవచ్చున్నారు. కాగా ఈ ప్రక్రియలో గ్రామస్థులు సొంత అవసరాల కోసం, వారి సొంత ఖర్చుతోనే ఇరిగేషన్ అధికారులు సూచించిన డీసిల్టేషన్ నిబంధనల మేరకు మట్టి లెవెల్స్ ప్రకారం తవ్వుకోవచ్చున్నారు.

సాగునీటి కాలువలు, చెరువులు గట్లను బలోపేతం చేయడం,కాలువల పూడిక తీత,లాక్స్ మరమ్మతులు వంటి పనులు చేపట్టాలన్నారు.గ్రామాల్లో చెక్ డ్యాములు,రోడ్డు పక్కన ఉన్న కాల్వల డైవర్షన్ వంటి పనులు చేసి ఉంటే గుర్తించి క్లియర్ చేసేందుకు ఎన్ఆర్ఈజిఎస్ ద్వారా పనులనుప్రతిపాదించాలన్నారు.పనుల గుర్తింపు,పనుల నిర్వహణ కు సంబంధించి జేసీబీలు,ఇతర సాంకేతిక పరికరాల అవసరాల నివేదికలను ఇవ్వాలన్నారు.

గ్రామ పరిసరాల్లో ఉన్న చెరువులు,కుంటలు, కాల్వలలో పిచ్చి మొక్కలు, కంపచెట్లను తొలగింపు, చెరువులు,కాలువల అను సంధానం,భూగర్భ జలాల సంరక్షణ కోసం సూక్ష్మ నీటి సాగును ప్రోత్సహించడం స్లూయిజ్ కాల్వల రిపేరీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.కాస్కెట్ ట్యాంక్ లు,తాత్కాలికంగా మల్లింపు చేసిన కాలువలను గుర్తించి రిస్టోర్ చేయాలన్నారు.

ఈ పనుల్లో ప్రజలు ముఖంగా మహిళా రైతులు,డ్వాక్రా మహిళలు భాగస్వామ్యంతో పనులను వేగవంతంగా, నాణ్యతగా చేపట్టాలన్నారు. జలవనరులు శాఖ,అటవీ శాఖ,పంచాయతీ రాజ్, వ్యవసాయ,పశుసంవర్ధక శాఖలు,డ్వామా తదితర శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు.

సాగునీటి సంఘాలను పటిష్టం చేసే దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. భూగర్భ జలాలను పెంపొందించే దిశ గా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.

ఈ సమీక్షా సమావేశం లో డ్వామా పీడి ఆదిశేషారెడ్డి, జెడ్పి సీఈఓ రామచంద్రారెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ అబ్దుస్, గ్రౌండ్ వాటర్.డిడి మురళీధర్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దత్తత సంస్థలలో పిల్లల స్క్రీనింగ్ కార్యక్రమం: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి



వైఎస్ఆర్ కడప, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 25: రిమ్స్ -- డీఈఐసీ విభాగం వారు - జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి వైఎస్ఆర్ కడప జిల్లా వారి ఆదేశాల మేరకు "మిషన్ వాత్సల్య -- పిల్లల సంరక్షణ సంస్థలు మరియు దత్తత సంస్థలలో పిల్లల స్క్రీనింగ్ కార్యక్రమం" నిర్వహించడం జరిగింది. వైఎస్ఆర్ కడప జిల్లా లోని బాలసదనం అక్కయ్య పల్లి కడప సందర్శించి, అక్కడ ఉన్న పిల్లలకు డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ టీమ్ ద్వారా సమగ్ర ఆరోగ్య పరిశీలన కార్యక్రమం నిర్వహించబడింది.

ఈ కార్యక్రమం లో ఆర్బీఎస్కే కార్యక్రమ అధికారి డాక్టర్ ఎన్ ఆరిఫుల్ల పర్యవేక్షణలో విజయవంతంగా నిర్వహించబడింది.ఈ స్క్రీనింగ్ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ టీమ్కి చెందిన సభ్యులు పాల్గొన్నారు. శిశు వైద్య నిపుణులు డాక్టర్ విష్ణు వందన గారు,దంత వైద్య నిపుణులు , శిశు మరియు క్లినికల్ మానసిక నిపుణులు, డీఈఐసీ మేనేజర్ ఎన్ .నవీన్ కుమార్ ,స్పెషలిస్ట్ వైద్య బృందం మరియు శ్రీమతి పద్మజ సూపరింటెండెంట్ బాలసదనం అక్కయ్య పల్లి కడప వారు పాల్గొన్నారు. పై బృందం కలిసి బాలసదనం అక్కయ్య పల్లి కడప 26 పిల్లలందరికీ సమగ్రంగా ఆరోగ్య పరిశీలన నిర్వహించారు. స్క్రీనింగ్ సమయంలో గుర్తించిన ఆరోగ్య మరియు అభివృద్ధి సమస్యలున్న పిల్లలను తదుపరి చికిత్స మరియు ప్రత్యేక సేవల కోసం డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ కి సూచించడం జరిగింది.

ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడానికి ఆర్బీఎస్కే కార్యక్రమ అధికారి డాక్టర్ ఎస్ ఆరిఫుల్ల , బాలసదనం అక్కయ్య పల్లి కడప సిబ్బంది అందరూ పూర్తి సహకారం అందించారు.

# ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి విజయవంతంగా ముగిసిన శిక్షణ కార్యక్రమము




కడప, ఏప్రిల్ 25(భారత శక్తి ) : శనివారం ఖావీఖ ఆఫీస్ నందు మూడవ విడత చివరి రోజున పోరుమామిళ్ల, కలసపాడు, ఖాజీపేట, బి .కోడూరు, బి .మట్టం, బద్వేల్, ముద్దనూరు మండలాలు సంబంధించిన సిబ్బందికి చివరి రోజు శిక్షణా ముగింపు కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా కడప జిల్లా జిల్లా వ్యవసాయ అధికారి సుబ్రమణ్యం రావు మాట్లాడుతూ రాబోవు కరువు నివారణ కోసం

ప్రకృతి వ్యవసాయం ద్వారా శిక్షణ పొందుతున్న ఐసిఆర్పి ల శిక్షణ కార్యక్రమాన్ని అందిస్తున్నామన్నారు. ఇందులో ఎలీనినో వల్ల వచ్చే ప్రకృతి మార్పులకు అనుగుణంగా రైతులతో పంటలు సాగుచేయించి వారికీ సాగులో సలహాలు, సూచనాలు ఇస్తూ అండగా నిలవాలన్నారు.

ముఖ్యం గా కరువును ఎదుర్కొందుకు పంటలు ప్లాన్ చేసుకొని సోయింగ్ చేయాలి అని సూచనలు ఇచ్చారు అలాగే జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి ఎస్ వి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఆఫ్ మున్, డ్రాఫ్ట్ ప్రూఫ్ మోడల్, పీఎండ్స్, మోడల్ వేయించాలన్నారు అలాగే జీవామృతం, ఘనజీవామృతం, కాషాయాలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

వ్యవసాయ విభాగంలో ఐసీఆర్పీలకు ఈ శిక్షణలో అన్ని విషయాలు తెలుసుకొని గ్రామాలలో చెప్పాలి అని చెప్పడం జరిగింది. అలాగే క్యాడర్ సొంత పొలాల స్టేటస్ అడిగి తీసుకోవడం జరిగినది. 365రోజులు భూమిని ఏవిధంగా పచ్చదనం తో కప్పి ఉంచాలి అని వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో మంచి ఆరోగ్యం, ఆదాయం, దిగుబడి, ఉంటుంది. కొత్తగా సెలెక్ట్ అయిన కార్య కర్తలు బాగా నేర్చుకొని, సొంతంగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ, ఇతర రైతులతో మోడల్స్ చేయించాలని తెలియజేసారు.

ఈ కార్యక్రమం లో వై పి భరత్ కుమార్ రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ మలేరియా దినోత్సవం

పత్తికొండ భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 25ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా డాక్టర్ కార్తీక్ అధ్యర్యములో పత్తికొండ పట్టణములో జూనియర్ కళాశాల నుండి సుంకం గేటు ద్వారా చక్రాల రోడ్డు వీధుల్లో ప్రపంచ మలేరియా దినోత్సవం పై ర్యాలీ మరియు అవగాహన కార్యక్రమము నిర్వహించడమైనది. ఈ సందర్భంగా డాక్టర్ గారు మాట్లాడుచు "ఇప్పుడు మనం సాధించ గలం ఇప్పుడు మనం సాధించాలి " మలేరియా రహిత సమాజాన్ని నిర్మిద్దామని తెలియజేశారు.దోమలు పుట్టకూడదు దోమలు కుట్టకూడదు అనే నినాదంతో ,ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని,ఆడ అనాఫిలిస్ దోమ ద్వారా మలేరియా చలి, వణుకు తో కూడిన జ్వరము వచ్చునని కావున వెంటనే రక్త పరీక్ష చేపించు కొని మందులు వాడాలని, దోమలు పెరగకుండా నీటి నిల్వలు లేకుండా చూడాలని,ఇంటి పరిసరాలలో రోళ్ళు, టైర్లు, కొబ్బరి బొండాలు, టెంకాయచిప్పలు, ప్లాస్టిక్ వస్తువులు లేకుండా చూడాలని, ఫ్రైడే డ్రైడే పాటించాలని, సాయంత్ర పూట వేపాకుపొగ వేసుకొనవలెనని స్లోగన్స్ ద్వారా అవగాహన కలిగించడమైనది.ఈ కార్యక్రమము నందు మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, ఆరోగ్య విస్తరణ అధికారి సాయిబాబా ఆరోగ్య పర్యవేక్షకుడు ప్రకాష్,మలేరియా హెల్త్ అసిస్టెంట్ రమేష్,ఆరోగ్య కార్యకర్తలు చాముండేశ్వరి,శంకరమ్మ, చైతన్య,లక్ష్మి,ఎంఎల్ హెచ్ పి లు కరుణ, ప్రసన్న, పుష్ప, అనిల్, మౌనిక, సాహెదా,ఐసీటీసీ సిబ్బంది కర్రెన్న , క్షయ సూపర్వైజర్ ఈరన్న మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

# శ్రీ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు.

హ్వాళగుంద, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 25

మండల కేంద్రంలో స్థానిక 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీ అగ్రహారం ఆంజనేయ స్వామి,కోట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.

ముందుగా ఉదయం నుంచి స్వామివారికి జలభిషేకం,పంచామృత అభిషేకం,బి ల్వార్చన,ఆకుపూజ ,దేవునికి పెద్ద ఎత్తున పూల మాలతో అలంకరించారు.అలాగే భక్తులు అనుకున్న మొక్కుబడులు తీర్చుకున్నారు.

అలాగే చుట్టుపక్కల గ్రాములు శ్రీ ఆంజనేయ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు దేవాలయనీకి వచ్చిన భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# ఏపీలో మరోసారి చమురు షాక్..! వినియోగదారులకు చుక్కలు..!

తిరువూరు/ ఏప్రిల్ 25 :

ఏపీలో మరోసారి పెట్రోల్, డీజిల్ సంక్షోభం (ఈబీవశ్రీ అతీతిబతిబ) తలెత్తేలా కనిపిస్తోంది. రాష్ట్రంలో నిన్నటి నుండి పలు ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల్లో డీజిల్ కొరత ఏర్పడటంతో వినియోగదారులు నిరాశగా వెనుదిరుగుతున్నారు.ఇంకొన్ని చోట్ల రెండు రోజులుగా చమురు కొరత ఉందని చెప్తున్నారు. చమురు కంపెనీలు క్రెడిట్ సౌకర్యం నిలిపివేయడమే ఇందుకు కారణమని కొన్ని పెట్రోల్ బంకుల యజమానులు చెప్తున్నారు. అంతర్జాతీయంగా పెరుగుతున్న ధరలు, సరఫరా ఇబ్బందులు కారణమని ఇంకొందరు చెప్తున్నారు.యన్ టి ఆర్ జిల్లా తిరువూరు మండలంతో పాటు దాని పరిసర ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా పెట్రోల్, డీజిల్ కొరత వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ముఖ్యంగా రిలయన్స్ బంక్, ఇండియన్ బంక్ ఉన్నటువంటి కీలక పెట్రోల్ బంకుల్లో 'నో డీజిల్' బోర్డులు దర్శనమిస్తుండటంతో ప్రయాణికులు, రైతులు బెంబేలెత్తిపోతున్నారు.

# ఈ వీకెండ్ ఓటీటీలో వినోదం పంచే చిత్రాలు.. వెబ్‌సిరీస్‌లు!

సంగీత దర్శకుడు, నటుడు జీవీ ప్రకాశ్‌కుమార్ (GV Prakash Kumar) హీరోగా మరియా రాజా తెరకెక్కించిన సినిమా 'హ్యాపీరాజ్' (Happy Raj). శ్రీగౌరి ప్రియ హీరోయిన్. దాదాపు 11 ఏళ్ల తర్వాత నటుడు అబ్బాస్ (Abbas) ఈ సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చారు. ప్రస్తుతం ఈ మూవీ అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా తెలుగు, తమిళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది.

'కోర్ట్' సినిమాతో హిట్ పెయిర్‌గా నిలిచిన హర్ష్ రోషన్, శ్రీదేవి నటించిన కొత్త చిత్రం 'బ్యాండ్ మేళం' (Band Melam). మార్చిలో థియేటర్లలో సందడి చేసిన ఈ సినిమా ఓటీటీలోకి వచ్చేసింది. 'జీ 5' (Zee 5)లో స్ట్రీమింగ్ అవుతోంది. సతీశ్ జివ్వాజీ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ప్రముఖ రచయిత కోన వెంకట్ నిర్మించడం విశేషం.

శ్రీనాథ్ మాగంటి కథానాయకుడిగా బాల సతీశ్ దర్శకత్వంలో రూపొందిన కామెడీ విలేజ్ డ్రామా 'మెన్షన్ హౌస్ మల్లేష్' (Mension House Mallesh). గాయత్రి రమణ కథానాయిక. మార్చి 6న థియేటర్స్‌లో విడుదలైన ఈ మూవీ ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో అందుబాటులోకి వచ్చింది. పూర్తి గ్రామీణ నేపథ్యంలో సినిమాను తీర్చిదిద్దారు.


మలయాళ సినిమాలకు ఓటీటీ ప్రేక్షకుల్లో క్రేజ్ మరో స్థాయిలో ఉంటుంది. ఈ వారం జియో హాట్‌స్టార్ వేదికగా అందుబాటులోకి వచ్చిన పొలిటికల్ థ్రిల్లర్ డ్రామా 'ప్రతిఛాయ' (Prathichaya). మలయాళంతో పాటు, తెలుగులోనూ ఈ మూవీ స్ట్రీమింగ్ అవుతోంది.









# పవన్‌కల్యాణ్ 'జానీ'కి 23ఏళ్లు.. సినిమా హిట్ అయి ఉంటే..

తొలి ప్రేమ.. తమ్ముడు.. బద్రి.. ఖుషి.. చిరంజీవి సోదరుడిగా పవన్‌కల్యాణ్ వెండితెరకు పరిచయమైనా మిలీనియంలో వరుస హిట్‌లతో దూసుకుపోయారు. తనకంటూ ఓ బ్రాండ్ ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు. అలాంటి సమయంలో 'జానీ' ప్రకటన ఓ సంచలనం. అప్పటివరకూ తాను నటించిన సినిమాల్లో కేవలం యాక్షన్ సీక్వెన్స్‌లో మార్షల్ ఆర్ట్స్ చేశారు పవన్. కానీ, పూర్తి మూవీ అనేసరికి అంచనాలు పెరిగిపోయాయి. లాస్ ఏంజిల్స్, జపాన్ వెళ్లి ఇంకొన్ని మెళకువలు నేర్చుకున్నారు. యూత్‌లో విపరీతమైన ఫాలోయింగ్ ఉన్న పవన్ మేకోవర్ చూడగానే ఫ్యాన్స్ షాక్. 'జానీ' కర్చీఫ్‌లు, బనియన్స్ అంటూ మార్కెట్‌లో కొత్త ట్రెండ్. పైగా హిట్ కాంబో రమణ గోగుల మ్యూజిక్ డైరెక్టర్. పవన్ కూడా రెండు పాటలు పాడారు. ఇక ఆడియో విడుదలై సూపర్ హిట్ అయింది. భారీ అంచనాల నడుమ 250కు పైగా ప్రింట్స్‌తో 2003 ఏప్రిల్ 25న 'జానీ' విడుదలైంది. తెల్లవారుజాము నుంచే థియేటర్స్ వద్ద ఫ్యాన్స్ పడిగాపులుగాశారు. షో పడింది. ప్రేక్షకులు బయటకు వచ్చారు. అంతా నిశ్శబ్దం. ఫ్యాన్స్ డీలా. అప్పటివరకూ 'బద్రి', 'ఖుషి' చిత్రాల్లో ఎనర్జిటిక్ పవన్ నుంచి చూసిన అభిమానులు ఇందులో బక్క చిక్కిన పవన్ చూసి జీర్ణించుకోలేకపోయారు. ఆ డ్రామాను భరించలేకపోయారు. అది మర్చిపోవడానికి చాలా కాలమే పట్టింది.

**జానీ హిట్ అయి ఉంటే..**

''నేను నటించి దర్శకత్వం వహించిన 'జానీ' ఫ్లాప్ అయింది. సత్యం ఒప్పుకొని తీరాలి. తప్పించుకుని తిరగడానికి వీల్లేదు. క్రియేటివ్ ఫీల్డ్‌లో ఫెయిల్యూర్ సహజం. దానికి భయపడకూడదు. వెనక్కి పారిపోకూడదు. అప్పుడు అన్నయ్య చిరంజీవి నాతో ఒక మాట అన్నారు. 'ఇంకా కష్టపడి ఉంటే బాగుండేది' అని చెప్పారు. కష్టపడ్డాను కానీ, అది సరైన దారిలో, విధి విధానాలతో కష్టపడలేదేమోనని ఇప్పుడు అనిపిస్తోంది. అవివేకంతోనో, అజ్ఞానంతోనే 'జానీ' చేయలేదు. నాకు తెలిసి ఆ రోజుకు దొరికిన ఆ మార్గాన్ని ఎంచుకున్నా. 'జానీ' సక్సెస్ అయ్యి ఉంటి సినిమాలు వదిలేసేవాడిని. ఆ సమయంలో శిష్టా ఆంజనేయశాస్త్రి రచించిన 'ఖారవేలుడు' రాజకీయం పట్ల నా ఆలోచనా ధోరణిని మార్చేసింది. 'జానీ' ఫ్లాప్ అయినప్పుడు నా రెండో సోదరుడు నాగబాబు ఈ పుస్తకాన్ని నాకు అందించారు. ఈ అద్భుత పుస్తకం తర్వాత నాకు రాజకీయంగా మార్గ నిర్దేశాన్ని చేసింది''అని పవన్‌కల్యాణ్ ఓ సందర్భంలో వెల్లడించారు.



# 'గూఢచారి 2' అద్భుతంగా ఉంటుంది

: అడవి శేష్

విజయవాడ: 'డెకాయిట్' మూవీని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలని కథానాయకుడు అడవి శేష్ అన్నారు. మూడో వారంలో కూడా తన చిత్రానికి ప్రేక్షకుల నుంచి ఆదరణ లభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కంటెంట్ ఉన్న చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తూనే ఉంటారని పేర్కొన్నారు. శనివారం విజయవాడ విచ్చేసిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ''డెకాయిట్' విడుదలైన అన్ని కేంద్రాలలో సంచలన విజయం సాధించడం ఎంతో సంతోషంగా ఉంది. ఒక అందమైన ప్రేమ కథను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చాం. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ చిత్రం అద్భుతంగా ఉందని ప్రశంసిస్తున్నారు. దర్శకుడు షానీల్ డియో, నిర్మాత సుప్రియ యార్లగడ్డ సహకారం మర్చిపోలేనిది. విజయవాడకు వచ్చిన ప్రతిసారి దుర్గమ్మను దర్శించుకుంటా. ఆమెను దర్శించుకుంటే శుభాలు కలగడంతోపాటు నా చిత్రాలన్నీ ఘనవిజయం సాధించాయి'' ''గూఢచారి' చిత్రాన్ని ఎంతగానో ఆదరించారు. త్వరలో 'గూఢచారి 2'తో వస్తున్నా. అది కూడా అద్భుతంగా ఉంటుంది. 'హిట్ 4' త్వరలో పట్టాలెక్కే అవకాశం ఉంది. దర్శకుడు శైలేష్ కొలను స్క్రిప్ట్ రైటింగ్ ఉన్నారు. మల్టీస్టారర్ చిత్రాల్లో నటించే అవకాశం వస్తే సిద్ధంగా ఉన్నా'' అని అడవి శేష్ చెప్పుకొచ్చారు.

# మరో లోకంలోకి తీసుకెళ్లే 'టాక్సిక్'

"కాంతార: ఏ లెజెండ్ చాప్టర్ 1" చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి రుక్మిణీ వసంత్, ప్రస్తుతం యశ్ హీరోగా నటిస్తున్న "టాక్సిక్: ఏ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్-అప్స్" సినిమాలో నటిస్తున్నారు. ఇటీవల మీడియాతో మాట్లాడిన ఆమె, ఈ సినిమా గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. సినిమా భారీతనం, తెరపై ఆవిష్కరించబోతున్న ప్రపంచం గురించి ఆమె వివరించారు. ఈ సినిమా రేంజ్ చాలా పెద్దదని, తానిప్పటి వరకు ఇంత భారీ చిత్రాన్ని చూడలేదని రుక్మిణీ అన్నారు. "దీని స్కేల్ నేను ఇప్పటివరకు చూడని స్థాయిలో ఉంది" అని ఆమె పేర్కొన్నారు. దర్శకురాలు గీతూ మోహన్‌దాస్, హీరో యశ్ కలిసి ఓ సరికొత్త ప్రపంచాన్ని నిర్మిస్తున్నారని ఆమె ప్రశంసించారు. "మా డైరెక్టర్ గీతూ, స్టార్ యశ్ నిర్మిస్తున్న ప్రపంచం చాలా విస్తృతమైనది, కొత్తది. ఇది నాకు చాలా మార్గదర్శకంగా అనిపిస్తోంది. ఈ కొత్త ప్రపంచానికి ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని ఆమె తెలిపారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ పతాకాలపై వెంకట్ కె. నారాయణ, యశ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో యశ్‌తో పాటు నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, హ్యూమా ఖురేషీ, రుక్మిణీ వసంత్, అక్షయ్ ఒబెరాయ్ వంటి భారీ తారాగణం ఉంది. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, మలయాళం, హిందీతో పాటు పలు అంతర్జాతీయ భాషల్లో విడుదల చేయనున్నారు. "టాక్సిక్" సినిమాతో పాటు, రుక్మిణీ వసంత్ ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న 'డ్రాగన్' (పేరు పరిశీలనలో ఉంది) చిత్రంలో కూడా నటిస్తున్నారు. మరికొన్ని ప్రాజెక్టులు కూడా ఆమె చేతిలో ఉన్నట్లు తెలుస్తోంది.




# నాగార్జున లేకుంటే వర్మ లేరు: జేడీ

టాలీవుడ్ నటుడు జేడీ చక్రవర్తి తాను నటించిన తాజా చిత్రం 'గాయపడ్డ సింహం' ప్రమోషన్లలో బిజీగా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన సినీ కెరీర్‌ను మలుపు తిప్పిన 'శివ' సినిమా షూటింగ్ మొదటి రోజు జరిగిన ఒక అద్భుతమైన సంఘటనను గుర్తు చేసుకున్నారు. "షూటింగ్ మొదటి రోజే ఒక భారీ యాక్షన్ సీక్వెన్స్ ప్లాన్ చేశారు. అప్పటి టాప్ ఫైట్ మాస్టర్ రాజు గారు టైర్లు కాల్చడం, పొగ ఎఫెక్ట్స్ వంటివి డిజైన్ చేశారు. కానీ అప్పుడే ఇండస్ట్రీకి పరిచయమవుతున్న ఆర్జీవీ... అవన్నీ వద్దని, తనకు నేచురల్‌గా కావాలని ముక్కుసూటిగా చెప్పేశారు. ఒక కొత్త దర్శకుడు అంతటి మాస్టర్ ఆలోచనను కాదనడం అప్పట్లో చర్చనీయాంశమైంది. అయితే హీరో నాగార్జున మాత్రం వర్మ ప్రతిభను నమ్మి ఆయనకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు, ఆ నమ్మకమే నేడు ఆర్జీవీని ఈ స్థాయిలో నిలబెట్టింది" అని జేడీ విశ్లేషించారు. లేకపోతే ఆయన కెరీర్ అప్పుడే ముగిసిపోయేదని అన్నారు.



# 'ఠాగూర్' సినిమా చేజారడం బాధించింది

: రాజశేఖర్

మెగాస్టార్ చిరంజీవి నటించిన 'ఠాగూర్' చిత్రం ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాపై యాంగ్రీ హీరో రాజశేఖర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వాస్తవానికి ఈ సినిమా రాజశేఖర్ చేయాల్సిందట. తమిళంలో విజయ్ కాంత్ నటించిన 'రమణ' చిత్రం చూడగానే, ఆ కథ రాజశేఖర్ కు బాగా నచ్చింది. ఆ రీమేక్ హక్కులను తానే సొంతం చేసుకోవాలని గట్టిగా ప్రయత్నించారట. కొన్ని రాజకీయ, వ్యాపార కారణాల వల్ల ఆ కథ చిరంజీవి, నిర్మాత మధు వద్దకు వెళ్ళింది. చివరకు వినాయక్ దర్శకత్వంలో అది 'ఠాగూర్'గా మారి ఇండస్ట్రీ రికార్డులను తిరగరాసింది. దీనిపై రాజశేఖర్ మాట్లాడుతూ... "ఆ సినిమా నేను చేసి ఉంటే నా కెరీర్ మరోలా ఉండేది. అవకాశం చేజారడం అప్పట్లో బాధ కలిగించినా, చిరంజీవి ఆ పాత్రకు పూర్తి న్యాయం చేశారు" అని భావోద్వేగానికి లోనయ్యారు.




# ఆ విషయంలో విఫలం అయ్యాం..
# క్షమించండి: ఓపెన్ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్

ఓపెన్ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ క్షమాపణలు చెప్పారు. ఆన్‌లైన్‌లో ఒక టీనేజర్ అభ్యంతరకర ప్రవర్తనను గుర్తించినప్పటికీ.. అధికారులను అలర్ట్ చేయడంలో విఫలమయ్యామని పేర్కొన్నారు. తర్వాత ఆ టీనేజర్ మాస్ షూటింగ్‌కు పాల్పడటంతో 9 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. ఫిబ్రవరిలో కెనడా లోని బ్రిటిష్ కొలంబియా రాష్ట్రం టంబ్లర్ రిడ్జ్ ప్రాంతంలోని సెకండరీ పాఠశాలలో కాల్పుల ఘటన చోటుచేసుకుంది. 18



ఏళ్ల వాన్ రూట్సెల్లార్.. తన తల్లి, సవతి సోదరుడుతో పాటు మరో ఆరుగురు విద్యార్థులను చంపేసింది. తర్వాత తుపాకి గాయాలతో ఆమె కూడా మరణించింది. ఈ ఘటనపై టంబ్లర్ రిడ్జ్ ప్రాంత ప్రజలను ఉద్దేశించి ఆల్ట్‌మన్ లేఖ రాశారు. ''ఆన్‌లైన్‌లో ఆమె అభ్యంతరకర ప్రవర్తనను గుర్తించి చాట్‌జీపీటీ ఖాతాను గత జూన్‌లోనే సస్పెండ్ చేశాం. ఆ విషయంపై మేము పోలీసులను అప్రమత్తం చేయలేకపోయినందుకు చింతిస్తున్నాం. నా మాటలు మీకు ఓదార్పునివ్వలేవని తెలుసు. ఈ ప్రాంత ప్రజలకు జరిగిన నష్టానికి క్షమాపణలు చెప్పడమే సరైందని భావిస్తున్నాను'' అని లేఖలో రాసుకొచ్చారు.




## స్నాప్‌చాట్‌కు పోటీగా..
# ఇన్‌స్టా కొత్త యాప్

మెటాకు చెందిన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఇన్‌స్టాగ్రామ్ కు యువతలో ఉన్న క్రేజ్ గురించి వేరే చెప్పక్కర్లేదు. తాజాగా ఈ ప్లాట్‌ఫాం వినియోగదారుల కోసం కొత్త ఆలోచనతో ముందుకు వచ్చింది. స్నాప్‌చాట్‌కు పోటీగా ఇన్‌స్టాలోనూ 'ఇన్‌స్టాంట్స్' పేరుతో క్విక్ ఫొటో షేరింగ్ యాప్‌ను ప్రారంభించింది. దీని సహాయంతో వినియోగదారులు యాప్‌లోని కెమెరాను ఉపయోగించి ఒకే ట్యాప్‌తో ఫొటోలు తీసుకోవచ్చు. వీటిని షేర్ చేసిన అనంతరం చాట్ లిస్ట్‌లో 24 గంటల పాటు ఉండి ఆ తర్వాత వాటంతట అవే డిలీట్ అవుతాయి. అయితే ఈ యాప్‌లో ఎడిటింగ్ ఫీచర్లను ఇన్‌స్టాగ్రామ్ అందుబాటులోకి తీసుకురాలేదు. తాము తీసిన ఫొటోలకు వినియోగదారులు కేవలం టెక్స్ట్ మాత్రమే జోడించగలరు. 'ఇన్‌స్టాంట్స్' యాప్‌లోని కెమెరాను ఉపయోగించి తీసిన చిత్రాలను మాత్రమే షేర్ చేయగలరు. ఒకేసారి పలువురు మిత్రులతో వీటిని పంచుకోవచ్చు. మొబైల్ గ్యాలరీలోని ఫొటోలను అప్‌లోడ్ చేసే అవకాశం ఉండదు. ప్రస్తుతం ఈ యాప్ స్పెయిన్, ఇటలీలోని ఆండ్రాయిడ్ ఐఓఎస్ (iOS) వినియోగదారులకు అందుబాటులో ఉంది. త్వరలోనే ఇతర దేశాల్లోనూ ఈ సేవలు విస్తరించనున్నట్లు తెలిపింది. ఇప్పటికే ఈ ఫీచర్‌తో స్నాప్‌చాట్, లాకెట్, బీరియల్ వంటి యాప్‌లు ఉన్నాయి. యువతకు మరింత దగ్గరయ్యేందుకు ఇన్‌స్టా కూడా ఈతరహా యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

# యూఏఈ కీలక నిర్ణయం.. 50శాతం ప్రభుత్వ సేవలు ఏఐతోనే..!

గల్ఫ్ దేశం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కీలక నిర్ణయం తీసుకుంది. 50శాతం ప్రభుత్వ సేవలు, కార్యకలాపాలు ఏఐతోనే నడుస్తాయని ప్రకటించింది. ఏజెంటిక్ ఏఐ వినియోగాన్ని విస్తరించనున్నట్లు వెల్లడించింది. 2028 నాటికి ఈ మార్పులు తీసుకురానున్నట్లు యూఏఈ ప్రధాని షేక్ మహ్మద్ బిన్ రషీద్ అల్ మఖ్తుమ్ వెల్లడించారు. ప్రపంచంలోనే ఈ స్థాయిలో కృత్రిమ మేధను వినియోగించే తొలి దేశంగా యూఏఈ నిలవనుంది. ఏఐ ఇక ఓ సపోర్ట్ టూల్‌గా మాత్రమే కాకుండా ఒక ఎగ్జిక్యూటివ్ పార్ట్‌నర్‌గా మారనుందని ప్రధాని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజలకు అందించే సేవలు మెరుగుపర్చడానికి, నిర్ణయాలు తీసుకొనే ప్రక్రియను వేగవంతం చేయడానికి ఈ సాంకేతికతను ఉపయోగిస్తామని పేర్కొన్నారు. ఏజెంటిక్ ఏఐ అంటే.. ఇప్పటివరకూ



ఉపయోగిస్తోన్న ఏఐ వ్యవస్థలు సాధారణంగా మనం అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తాయి. కానీ ఏజెంటిక్ ఏఐ అంతటితో ఆగదు. ఒక లక్ష్యం ఇస్తే.. దాన్ని సాధించడానికి అవసరమైన దశలను తానే నిర్ణయించుకుని, అవసరమైన చర్యలు తీసుకుని, పని పూర్తయ్యేవరకు ముందుకుసాగుతుంది. అంటే ఇది కేవలం 'సమాధానం చెప్పే ఏఐ' కాదు. ఇప్పటివరకూ ఏఐ ఒక సాధనం (టూల్)లా పనిచేసింది. మనకు అవసరం ఉంటే ఉపయోగించుకునేలా ఉండేది. కానీ ఇప్పుడు ఏజెంటిక్ ఏఐ.. మనతో కలిసి పనిచేసే సహచరుడిలా మారుతోంది. ఇది అవసరాన్ని అర్థం చేసుకుని, అనేక దశల్లో పని చేసి, కొంతవరకు నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరుకుంటోంది. ఇది చిన్న మార్పు కాదు.. సహాయక టెక్నాలజీ నుంచి సహకార టెక్నాలజీకి ప్రయాణమని టెక్ నిపుణులు పేర్కొంటున్నారు.

# యాక్సిస్ బ్యాంకు లాభం రూ.7,071 కోట్లు..
# డివిడెండ్ రూ.1

ప్రముఖ ప్రైవేట్ రంగ యాక్సిస్ బ్యాంకు 202526 చివరి త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. జనవరిమార్చి త్రైమాసికంలో రూ.7,071 కోట్ల నికరలాభాన్ని నమోదుచేసింది. అంతకుముందు ఇదే కాలంలో నమోదైన రూ.7,117 కోట్లతో పోలిస్తే 0.6 శాతం తగ్గుదల నమోదైంది. బలహీనమైన వడ్డీయేతర ఆదాయం, అధిక కేటాయింపులే ఇందుకు కారణంగా బ్యాంక్ పేర్కొంది. అయితే గత డిసెంబర్ త్రైమాసికం నికర లాభం రూ.6,489.57 కోట్లతో పోలిస్తే 9 శాతం వృద్ధి సాధించింది. బ్యాంకు నికర వడ్డీ ఆదాయం 5% పెరిగి 14,457 కోట్లకు చేరుకుంది. నికర వడ్డీ మార్జిన్ 2 బేసిస్ పాయింట్ల మేర తగ్గి 3.62 శాతానికి చేరింది. బ్యాలెన్స్ షీట్ బలోపేతానికి అదనంగా రూ.2001 కోట్ల ప్రొవిజన్లను కేటాయించినట్లు బ్యాంకు పేర్కొంది. దీంతో మార్చి త్రైమాసికంలో ప్రొవిజన్లు రూ.3,522 కోట్లకు చేరాయి. బ్యాంకులో మొండి బకాయిలు కొంతమేర తగ్గుముఖం పట్టాయి. డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే రూ.6007 కోట్ల నుంచి రూ.4,709 కోట్లకు తగ్గాయి. దీంతో రుణాల నాణ్యత మెరుగుపడింది.

# గేమర్స్ కోసం ₹459తో జియో ప్రీపెయిడ్ ప్లాన్




ప్రముఖ టెలికాం కంపెనీ రిలయన్స్ జియో కొత్త ప్రీపెయిడ్ ప్లాన్‌ను తీసుకొచ్చింది. రూ.459తో యూత్ అండ్ గేమింగ్ ప్లాన్ ను పరిచయం చేసింది. 28 రోజుల వ్యాలిడిటీతో వస్తోంది. మొత్తం 61 జీబీ డేటాతో పాటు జియో గేమ్స్, స్నాప్‌చాట్ +, గూగుల్ జెమినీ యాక్సెస్ వంటి పలు ప్రయోజనాలను అందిస్తోంది. ముఖ్యంగా గేమర్స్, యూత్‌ను ఆకర్షించేవిధంగా ఈ ప్లాన్‌ను కంపెనీ రూపొందించింది.

**ప్లాన్ వివరాలిలా...**

28 రోజుల వ్యాలిడిటీ, రోజుకు 2జీబీ హైస్పీడ్ డాటా (మొత్తం 61జీబీ) + అదనంగా 5 జీబీ రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు, అపరిమిత కాల్స్ మై జియో యాప్‌లో జియో గేమ్స్‌తో పాటు క్లౌడ్‌గేమింగ్ యాక్సెస్ స్నాప్‌చాట్ + సబ్‌స్క్రిప్షన్ జియో హాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్ మూడు నెలల పాటు ఉచితం. రూ.35,100 విలువైన గూగుల్ జెమినీ ప్రో యాక్సెస్ 18 నెలల పాటు ఉచితం

# ఆ చెంపదెబ్బతో హర్భజన్‌కు రూ.కోటి ఆదాయం
# శ్రీశాంత్ సంచలన ఆరోపణలు

తొలి ఐపీఎల్ సీజన్‌లో మాజీ ఆటగాళ్లు హర్భజన్ సింగ్ శ్రీశాంత్ మధ్య జరిగిన 'చెంపదెబ్బ' ఘటన ఇప్పటికీ చర్చనీయాంశమే. దీనిపై తాజాగా మాజీ పేసర్ శ్రీశాంత్ స్పందిస్తూ సంచలన ఆరోపణలు చేశాడు. ఆ ఘటనను ఉపయోగించుకుని హర్భజన్ రూ.కోటి లాభం పొందాడని ఆరోపించాడు. ఈ మేరకు ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దీని గురించి స్పందించాడు. ''భజ్జీ గురించి నేను ఇప్పటివరకు ఏ ఇంటర్వ్యూల్లో మాట్లాడలేదు. బహుశా ఇదే తొలిసారి. నాటి చెంపదెబ్బ గురించి నేను పట్టించుకోవడం మానేశా. కానీ, ఇటీవల కాలంలో హర్భజన్ దానిపై ఓ యాడ్ చేశాడు. దాన్నుంచి రూ.కోటి వరకు ఆదాయం పొందాడు. అక్కడితో ఆగకుండా ఆ యాడ్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేయమని నాకు ఫోన్ చేసి అడిగాడు. అప్పుడు నేను అతడికి ఒకే మాట చెప్పా.. 'నేను నిన్ను క్షమిస్తాను.. కానీ ఆ ఘటనను ఎప్పటికీ మర్చిపోను' అని అన్నా. మనకు ఏదైనా చెడు జరిగితే.. దానికి బాధ్యులైన వారిని క్షమించాలి కానీ, ఆ చెడును మర్చిపోకూడదు. ఒకవేళ మర్చిపోతే.. అవతలి వ్యక్తి మళ్లీ అదే తప్పు చేయాలని చూస్తాడు. అందుకు భజ్జీనే సరైన ఉదాహరణ'' అని శ్రీశాంత్ ఆరోపించాడు. ''ఈ మధ్య చాలా ఇంటర్వ్యూల్లో హర్భజన్ ఈ ఘటన గురించి మాట్లాడాడు. తాను చాలా పెద్ద తప్పు చేశానని సానుభూతి పొందే ప్రయత్నం చేశాడు. నా కుమార్తె గురించి కూడా మాట్లాడాడు. వ్యక్తిగతంగా




నాకు అతడిపై ద్వేషం లేదు. కానీ, ఒకట్రెండు నెలల క్రితం ఈ యాడ్ చేయడంతో భజ్జీని ఇన్‌స్టాలో బ్లాక్ చేశా. అతడిదంతా నటనేనని అప్పుడే అర్థమైంది'' అని శ్రీశాంత్ విమర్శించాడు.

**ఏంటీ చెంపదెబ్బ ఘటన..**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ తొలి సీజన్ 2008లో మొదలైంది. ఆ ఎడిషన్‌లో ముంబయి ఇండియన్స్, కింగ్స్ ఎలెవన్ పంజాబ్ మ్యాచ్ అనంతరం ఆటగాళ్లంతా షేక్‌హ్యాండ్ ఇచ్చుకుంటుండగా.. ఉన్నట్టుండి శ్రీశాంత్ చెంపపై హర్భజన్ దెబ్బ కొట్టాడు. దీంతో శ్రీశాంత్ మైదానంలోనే కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఈ ఘటన అనంతరం భజ్జీపై ఎనిమిది మ్యాచ్‌ల నిషేధం విధించారు. ఇది జరిగి 18 ఏళ్లు గడిచింది. ఇటీవల ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ దీని వీడియో విడుదల చేయడంతో మళ్లీ చర్చనీయాంశమైంది. ఇటీవల రవిచంద్రన్ అశ్విన్ యూట్యూబ్ ఛానల్‌లో హర్భజన్ సింగ్ మరోసారి ఆ ఘటనను గుర్తు చేసుకున్నాడు.




# సింధు కణతపై 'టెంపుల్'


ఉబర్ కప్‌లో సింధు తన ఆటతీరుతోనే కాకుండా.. కుడి కణతపై ధరించిన ఓ కొత్త పరికరంతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. శుక్రవారం డెన్మార్క్‌తో జరిగిన పోరులో తొలి సింగిల్స్ మ్యాచ్‌లో సింధు నీలి బూడిద రంగులోని స్టిక్కర్‌తో ఉన్న 'టెంపుల్' అనే సరికొత్త వేరబుల్ టెక్నాలజీని ప్రయోగాత్మకంగా ధరించి కోర్టులోకి అడుగుపెట్టింది. గత కొన్ని వారాలుగా శిక్షణలో ఈ పరికరాన్ని వాడుతున్నప్పటికీ ఒక అంతర్జాతీయ మ్యాచ్‌లో సింధు దీనిని ధరించడం ఇదే మొదటిసారి. మెదడు పనితీరు, రక్త ప్రసరణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే ఈ పరికరం ఇప్పుడు క్రీడా ప్రపంచంలో చర్చనీయాంశమవుతోంది. ఈ పరికరం మెదడులో రక్త ప్రవాహం, ఆక్సిజన్ స్థాయిలను రియల్ టైమ్‌లో కొలుస్తుంది. ఇది నియర్ ఇన్‌ఫ్రారెడ్ స్పెక్ట్రోస్కోపీ (ఎన్ఐఆర్ఎస్) టెక్నాలజీని ఉపయోగించి మెదడులో ఆక్సిజన్ స్థాయిని అంచనా వేస్తుంది. ఈ



డేటా ద్వారా మానసిక అలసట, ఒత్తిడి, ఏకాగ్రత, మెదడు పనితీరు గురించి పూర్తి సమాచారం తెలుస్తుంది. ఒకరకంగా ఇది 'బ్రెయిన్ ఫిట్‌నెస్ ట్రాకర్' లాంటిదే. చేతికి పెట్టుకునే స్మార్ట్ వాచ్ హార్ట్ రేట్, స్టెప్స్‌ను కొలిచినట్లు.. ఇది మెదడు పనితీరును పర్యవేక్షిస్తుంది. మ్యాచ్ లేదా ట్రైనింగ్ సమయంలో ఏకాగ్రత స్థాయి ఎలా ఉందో.. అలసట ఏమేరకు ఉందో తెలుసుకోవచ్చు. రికవరీ ఎలా జరుగుతుందో తెలుస్తుంది. మొత్తంమీద మెదడు పనితీరును మెరుగుపరచడానికి సహాయపడే డేటా కోసం ఈ 'టెంపుల్'ను ఉపయోగిస్తారు. అయితే ఈ పరికరం ఇంకా ప్రయోగ దశలోనే ఉంది. ఈ పరికరాన్ని జొమాటో వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్ బృందం అభివృద్ధి చేస్తోంది.

# 265 ఉఫ్.. పంజాబ్ కింగ్స్ రికార్డు ఛేదన

ఢిల్లీ: ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ వరుస విజయాలతో దూసుకుపోతోంది. ఇప్పటివరకు ఈ సీజన్‌లో ఓటమి ఎరుగని ఆ జట్టు దిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో గెలిచింది. ప్రత్యర్థి 265 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించినా.. ఏ మాత్రం బెదరకుండా 7 బంతులు మిగిలుండగానే టార్గెట్‌ను పూర్తి చేసింది. ఐపీఎల్ చరిత్రలో ఇదే రికార్డు ఛేదన. అంతకుముందు కూడా ఈ రికార్డు పంజాబ్ పేరిటే ఉంది. 2024లో కోల్‌కతా నిర్దేశించిన 262 రన్స్ టార్గెట్‌ని పంజాబ్ ఛేజ్ చేసింది. తాజా మ్యాచ్‌లో దిల్లీ ఓపెనర్ కేఎల్ రాహుల్ (152 నాటౌట్; 67 బంతుల్లో 16 ఫోర్లు, 9 సిక్సులు) విధ్వంసకర సెంచరీతో విరుచుకుపడటంతో తొలుత ఆ జట్టు 2 వికెట్లు కోల్పోయి 264 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ లక్ష్యాన్ని 18.5 ఓవర్లలో పంజాబ్ 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. పంజాబ్ ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్ సింగ్ (76;




26 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్సులు), ప్రియాంశ్ ఆర్య (43; 17 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సులు) అదిరే ఆరంభం ఇవ్వడంతో పవర్ ప్లే ముగిసేసరికి జట్టు 116/0తో నిలిచింది. తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (71*; 36 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్సులు) దూకుడు కొనసాగించి జట్టును విజయతీరాలకు చేర్చాడు. నేహల్ వధేరా (25), శశాంక్ సింగ్ (19*), కూపర్ కనోలి (17) రన్స్ చేశారు. ముకేశ్ కుమార్ వేసిన ఇన్నింగ్స్ ఆరో ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్ వరుసగా ఆరు బౌండరీలు బాదడం విశేషం.

**ఎంగిడికి గాయం**

ఈ మ్యాచ్‌లో పంజాబ్ ఇన్నింగ్స్ సాగుతున్నప్పుడు దిల్లీ ఫీల్డర్ లుంగి ఎంగిడి తీవ్రంగా గాయపడ్డాడు. అక్షర్ పటేల్ వేసిన 2.3 ఓవర్‌లో ప్రియాంశ్ క్యాచ్‌ను అందుకునేందుకు ప్రయత్నించి ఎంగిడి కిందపడ్డాడు. అతడి తల నేలకు బలంగా తాకింది. గాయం తీవ్రమైనది కావడంతో వెంటనే అంబులెన్స్‌ను మైదానంలోకి తీసుకొచ్చి ఎంగిడిని ఆస్పత్రికి తరలించారు.

# రాజస్థాన్‌తో మ్యాచ్‌లో కమిన్స్

జైపుర్: ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు శుభవార్త. ఫిట్‌నెస్ నిరూపించుకుని, క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి ఆమోదం పొందిన ప్యాట్ కమిన్స్.. శనివారం రాజస్థాన్ రాయల్స్‌తో పోరులో బరిలో దిగనున్నట్లు ధ్రువీకరించాడు. ''చాలా రోజులుగా ఎదురుచూస్తున్నా. మైదానంలోకి దిగేందుకు ఉత్సుకతతో ఉన్నా'' అని తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్టు పెట్టాడు. తాను జట్టు పగ్గాలు కూడా అందుకోనున్నట్లు కమిన్స్ స్పష్టం చేశాడు. తాత్కాలిక కెప్టెన్ ఇషాన్ కిషన్ నేతృత్వంలో హైదరాబాద్ హ్యాట్రిక్ విజయాలతో జోరు మీదుంది. ఇప్పుడు కమిన్స్ చేరికతో జట్టు మరింత పటిష్ఠం కాబోతుందనడంలో సందేహం లేదు. గాయంతో గత ఏడాది యాషెస్ సిరీస్ తర్వాత క్రికెట్‌కు దూరమైన



అతడు.. ఈ సీజన్ ఆరంభం నుంచి సన్‌రైజర్స్ జట్టుతోనే ఉన్నాడు. హైదరాబాద్‌తో గత మ్యాచ్‌లో కంగుతిన్న రాజస్థాన్.. ఈసారి సొంతగడ్డపై ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తోంది.



# నేరేడు పళ్ళు.. ఆరోగ్యానికి మేలు

నేరేడు పండు.. దీన్ని జావా ప్లం, సిజిజియం క్యుమిని అని కూడా పిలుస్తుంటారు. ఇది ఎంతో రుచికరంగా ఉంటుంది. అంతేకాదు ఆరోగ్యానికి కూడా ఎంతో మంచింది. ఈ చిన్న, ముదురు ఊదా రంగు పండు యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలతో సమృద్ధిగా ఉంటుంది. ఆరోగ్యంగా ఉండాలనుకునేవారికి ఇది చాలా బాగా పనిచేస్తుంది. నేరేడు పండ్లు తింటే మనకు ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయి, అసలు దీన్ని ఎందుకు తినాలో ఓ సారి చూద్దాం.

### యాంటీఆక్సిడెంట్ పవర్హౌస్...

బ్లాక్ జామున్‌లోని ముఖ్య ప్రయోజనాల్లో ఒకటి దాని అధిక యాంటీఆక్సిడెంట్ కంటెంట్. యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడతాయి. ఇవి కణాలకు నష్టం కలిగించే హానికరమైన అణువులు. క్యాన్సర్, గుండె జబ్బులతో సహా వివిధ ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి. ఇందుకోసం నేరేడు పండులోని ఆంథోసైనిన్లు, ఎల్లాజిక్ ఆమ్లం, టానిన్లు వంటి యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడి, వాపుతో పోరాడటానికి సహాయపడతాయి.

### రక్తంలో చక్కెర నియంత్రణ...

నేరేడు పండ్ల అత్యంత ముఖ్యమైన ప్రయోజనాల్లో ఒకటి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడే సామర్థ్యం. ఈ పండు రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తగ్గించడానికి, ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరచడానికి సహాయపడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది డయాబెటిస్ లేదా ప్రీడయాబెటిస్ ఉన్నవారికి ఆహారంలో విలువైన సహాయకులుగా ఉంటుంది. పండ్లలోని యాంటీఆక్సిడెంట్లు డయాబెటిక్ న్యూరోపతి, మూత్రపిండాల నష్టం వంటి అధిక రక్తంలో చక్కెరకు సంబంధించిన సమస్యల నుండి రక్షించడానికి కూడా ఎంతో సహాయపడతాయి.

### విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా...

నల్ల జామున్ మొత్తం ఆరోగ్యానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలకు కూడా గొప్ప మూలం. ఇందులో విటమిన్ సి అధికంగా ఉంటుంది, ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇంకా ఆరోగ్యకరమైన చర్మాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ పండులో విటమిన్ ఎ కూడా ఉంటుంది, ఇది మంచి దృష్టికి ముఖ్యమైనది. విటమిన్ బి 6 ఇది మెదడు పనితీరు, జీవక్రియకు మద్దతు ఇస్తుంది. వీటితోపాటు పొటాషియం, కాల్షియం, ఇనుము వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి, ఇవి సరైన కండరాల పనితీరు, ఎముక ఆరోగ్యం, ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి అవసరం.

# అలోవెరా లాభాలు భళా..!



అలోవెరా.. ఔషధ లక్షణాల కోసం చాలామంది దీన్ని ఉపయోగిస్తుంటారు. కలబందను తినడానికి అత్యంత పాపులర్ పొందిన మార్గాలలో ఒకటి రసం రూపంలో ఉంటుంది. అలోవెరా రసం అనేక పోషకాలతో నిండి ఉంటుంది. అలాగే అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటుంది. ఇందులో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. అలోవెరా రసంలో మంచి ఆరోగ్యానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇందులో విటమిన్లు ఎ, సి, ఇ, బి విటమిన్లతో పాటు కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు ఉంటాయి. ఈ పోషకాలు రోగనిరోధక వ్యవస్థను పెంచడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి ఎంతగానో సహాయపడతాయి. ఇక కలబంద రసం మీ ఆరోగ్యానికి ఎందుకు మంచిదో ఓ సారి చూద్దాం.

### జీర్ణక్రియకు సహాయపడుతుంది...

అలోవెరా రసం జీర్ణవ్యవస్థను ఉపశమనం చేసే సామర్థ్యానికి ప్రసిద్ధి చెందింది. ఇది అజీర్ణం, ఉబ్బరం, మలబద్ధకం లక్షణాల నుండి ఉపశమనం పొందడానికి సహాయపడుతుంది. అలోవెరా రసంలో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు కూడా ఉన్నాయి. ఇవి పేగుల్లో మంటను తగ్గించడానికి అలాగే జీర్ణక్రియను మెరుగుపరచడానికి సహాయపడతాయి.

### శరీరాన్ని నిర్విషీకరణ చేస్తుంది...


కలబంద రసం సహజమైన నిర్విషీకరణగా పనిచేస్తుంది. శరీరం నుండి విషాన్ని అలాగే మలినాలను తొలగించడానికి సహాయపడుతుంది. ఇది కాలేయం, మూత్రపిండాలను శుభ్రపరచడానికి మొత్తం నిర్విషీకరణను ప్రోత్సహించడానికి ఇంకా ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి సహాయపడుతుంది.

### చర్మ ఆరోగ్యానికి తోడ్పడుతుంది...

కలబంద రసాన్ని అంతర్గతంగా తీసుకుంటే ప్రయోజనకరంగా ఉండటమే కాకుండా.., సమయోచితంగా అప్లై చేస్తే చర్మానికి అద్భుతమైన ప్రయోజనాలను అందిస్తుంది. ఇది గాయాలను నయం చేయడానికి, వాపును తగ్గించడానికి అలాగే కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహించడానికి సహాయపడుతుంది. కలబంద రసం తాగడం వల్ల చర్మం ఆరోగ్యాన్ని లోపలి నుండి మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

### రోగనిరోధక శక్తిని పెంచుతుంది...

కలబంద రసంలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడానికి, హానికరమైన ఫ్రీ రాడికల్స్ నుండి శరీరాన్ని రక్షించడానికి సహాయపడతాయి. కలబంద రసాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం అనారోగ్యాన్ని నివారించడానికి అలాగే ఆరోగ్యంగా, శక్తివంతంగా ఉంచడానికి సహాయపడుతుంది.



# మీ ఆరోగ్యానికి ఏది మంచిది? టీ.. లేదా కాఫీ?

టీ లేదా కాఫీ లేనిది చాలా మందికి రోజు గడవదు. ఉదయం నిద్రలేవగానే టీ, కాఫీ తాగితేనే వారికి హాయిగా ఉంటుంది. కొందరికి ఒక్కపూట టీ, కాఫీ తాగకపోతే తలబద్ధలై పోయినట్లువుతుంది. కాగా, కొందరు టీ తాగడానికి ఇష్టపడుతుండగా.. మరి కొంతమంది కాఫీ తాగడానికి ఇష్టపడుతుంటారు. కానీ ఈ రెండింటిలో ఏదీ మన ఆరోగ్యానికి మంచిదని చాలా మందికి తెలియదు. టీ, కాఫీలో ఏది తాగడం వల్ల మన శరీరానికి ఆరోగ్యంగా పనిచేస్తుందని విషయానికి ఎప్పటికప్పుడు పలు అధ్యయనాలు వెల్లడిస్తూనే ఉన్నాయి. అసలు మన శరీర సంబంధించి ఏది తాగాలో ఒకసారి చూద్దామా..

### టీ.. ఓ ఆరోగ్యకరమైన ఎంపిక...

టీ, ముఖ్యంగా గ్రీన్ టీ దాని అనేక ఆరోగ్య ప్రయోజనాలకు చాలాకాలంగా వింటూనే ఉన్నాము. యాంటీఆక్సిడెంట్లతో నిండిన టీ జీవక్రియను పెంచుతుంది. అలాగే జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇంకా గుండె జబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. టీలో కనిపించే క్యాటెచిన్లు బరువు తగ్గడం, మెదడు పనితీరును మెరుగుపరచడంతో ముడిపడి ఉన్నాయి. వీటితోపాటు ఇంకా టీ అనేది ఆర్ద్రీకరణకు గొప్ప మూలం. అలాగే మనస్సును శాంతపరచడాని, ఒత్తిడిని తగ్గించడానికి ఇది ఎంతగానో సహాయపడుతుంది.





### కాఫీ.. ఓ వివాదాస్పద ఎంపిక...

ఇక ఆరోగ్యం విషయానికి వస్తే.. కాఫీకి కొంచెం మిశ్రమ పేరు ఉంది. కాఫీ త్వరగా శక్తిని అందించి, దృష్టిని మెరుగుపరుస్తుందనేది నిజం అయినప్పటికీ.. అధిక వినియోగం నిద్రలేమి, ఆందోళనలతోపాటు హృదయ స్పందన రేటు పెరగడం వంటి సమస్యలతో ముడిపడి ఉంది. అయితే, కాఫీలో యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. అలాగే అల్జీమర్స్, పార్కిన్సన్స్ వంటి కొన్ని వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

### మీ ఆరోగ్యానికి ఏది మంచిది...?

అంతిమంగా.. టీ, కాఫీ మధ్య ఎంపిక వ్యక్తిగత ప్రాధాన్యత. ప్రతి పానీయం మీ శరీరాన్ని ఎలా ప్రభావితం చేస్తుందనే దానిపై ఆధారపడి ఉంటుంది. మీరు కెఫిన్ పట్ల సున్నితంగా ఉంటే లేదా నిద్రపోవడంలో ఇబ్బంది ఉంటే 'టీ' మీకు మంచి ఎంపిక కావచ్చు. మరోవైపు, మీకు త్వరితగతిన కాఫీని తీసుకోవాలనుకుంటే లేదా కాఫీ రుచిని ఆస్వాదించాలనుకుంటే, మితంగా సేవించినప్పుడు అది ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా ఉంటుంది.



# ఇదే చివరి బ్యాచ్...! తెలంగాణ పోలీసుల ఎదుట 47 మంది మావోల లొంగుబాటు

- **హైదరాబాద్‌లో 47 మంది మావోయిస్టుల సామూహిక లొంగుబాటు**
- **డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో ఆయుధాలు అప్పగించిన మావోలు**
- **'ఆపరేషన్ కగార్' విజయంతోనే ఇది సాధ్యమైందని వెల్లడి**
- **లొంగిపోయిన వారిలో అత్యధికులు ఛత్తీస్‌గఢ్ వాసులే**
- **ఆయుధాలు వీడి జనజీవనంలోకి రావాలని డీజీపీ పిలుపు**

హైదరాబాద్, ఏప్రిల్ 25(భారత శక్తి) : తెలంగాణలో మావోయిస్టు ఉద్యమానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఏకంగా 47 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో ఈ లొంగుబాటు జరిగింది. ఈ సందర్భంగా వారు 34 అత్యాధునిక ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. లొంగిపోయిన వారిలో అత్యధికులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారని అధికారులు తెలిపారు. తెలంగాణఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో 'ఆపరేషన్ కగార్' పేరుతో గ్రేహౌండ్స్, సీఆర్‌పీఎఫ్ బలగాలు చేపట్టిన ముమ్మర కూంబింగ్ ఆపరేషన్ల వల్లే ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసుల నిఘా పెరగడం, సాయుధ పోరాటంపై విరక్తి చెందడంతో జనజీవన స్రవంతిలో కలిసేందుకు వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ సామూహిక లొంగుబాటుతో రాష్ట్రంలో మావోయిస్టుల కార్యకలాపాలు దాదాపుగా ముగిసినట్లేనని పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి. దేశవ్యాప్తంగా మావోయిస్టు ఉద్యమానికి ఇది గట్టి దెబ్బగా పరిగణిస్తున్నారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ... ఇంత పెద్ద సంఖ్యలో మావోలు లొంగిపోయిన చివరి బ్యాచ్ బహుశా ఇదేనని, ఇకపై ఈ స్థాయిలో లొంగిపోవడానికి మావోయిస్టులు కూడా ఎక్కువ మంది లేరని అన్నారు."హింస ద్వారా ఏ సమస్య పరిష్కారం కాదు. ఆయుధాలు విడిచిపెట్టి జనజీవనంలోకి రావాలి" అని ఇంకా అజ్ఞాతంలో ఉన్న కొద్దిమంది మావోయిస్టులకు ఆయన పిలుపునిచ్చారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో పునరావాసం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. త్వరలోనే హెల్త్ కార్డుల పంపిణీ ఉంటుందని తెలిపారు.

## ప్రధాని నరేంద్రమోదీ
# తెలంగాణ పర్యటన ఖరారు

హైదరాబాద్, ఏప్రిల్ 25(భారత శక్తి) : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెలలో తెలంగాణలో పర్యటించనున్నారు. మే 9వ తేదీన ఆయన రాష్ట్రానికి రానున్నారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర పర్యటన ఖరారైంది. పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటారు. హైదరాబాద్ నగరంలోని పరేడ్ మైదానంలో భారీ బహిరంగ సభకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయ్యాక తెలంగాణకు రావడం ఇదే మొదటిసారి. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఆయన తెలంగాణకు వస్తారు. తెలంగాణ పర్యటనలో భాగంగా ఎంఎంటీఎస్ ఫేజ్ 2ను ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్నారు. బీబీనగర్ ఎయిమ్స్ హాస్పిటల్‌ను జాతికి అంకితం చేసే అవకాశముంది. రాష్ట్రంలో పలు జాతీయ రహదారులకు శంకుస్థాపన చేసే అవకాశముంది. కాగా, మల్లారెడ్డి యూనివర్సిటీలో నిర్వహించే కార్యక్రమానికి ప్రధాని మోదీని ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి హాజరవుతారా లేదా తెలియాల్సి ఉంది.

# ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు అంగీకరించాం

హైదరాబాద్, ఏప్రిల్ 25(భారత శక్తి) : ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం సహా పలు డిమాండ్లకు తమ ప్రభుత్వం అంగీకరించిందని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు ,అధికార ప్రతినిధులతో ఆయన వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రెండు రోజుల సమ్మెలోనే పలుమార్లు కార్మికులతో చర్చలు జరిపినట్లు తెలిపారు. వారి చిరకాల స్వప్నమైన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మిక సంఘాల ఎన్నికలు, 11 శాతం పీఆర్సీ ప్రకటన పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. ప్రభుత్వం డిమాండ్లకు అంగీకరించడంతో కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై మంత్రుల బృందం సుమారు 15 గంటలు చర్చించి వారి సమస్యలను పరిష్కరించి, సమ్మెను విరమింపజేశారని అన్నారు. ఆర్టీసీ కార్మికుల అంశాలపై ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కేడర్ సంబరాలు నిర్వహించాలని సూచించారు. ఆర్టీసీ కార్మికుల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించిందని అన్నారు. ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాల ఎన్నికల నిర్వహణ, ఉద్యోగులకు 11 శాతం పీఆర్సీ ప్రకటనతో పాటు మిగిలిన సమస్యలను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గతంలో కార్మికులు 55 రోజుల పాటు సమ్మె చేస్తే గత ప్రభుత్వం ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. ఆ రోజు సమ్మె సమయంలో 30 మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వానికి శత్రుత్వం ఉండదని, వారు కూడా కుటుంబ సభ్యులే అన్నారు. ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ వ్యవహరించిన తీరు సరికాదని అన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ శవరాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో మనం ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగ నియామకాలు, కారుణ్య నియామకాలు, సర్వీసు నుంచి తొలగించిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకోవడం జరిగిందని అన్నారు. రోజుకు 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణం చేస్తున్నారని తెలిపారు.

# ఆసుపత్రి, బడి, గుడి, గుడిసె అన్నీ లెక్కిస్తాం: జనగణన తెలంగాణ డైరెక్టర్

హైదరాబాద్, ఏప్రిల్ 25(భారత శక్తి) : జనగణన తెలంగాణ డైరెక్టర్ భారతి హోళికెరె జనాభా లెక్కల సేకరణ వివరాలను శనివారం మీడియాకు వివరించారు. తెలంగాణ భౌగోళిక పరిధిలో ఉన్న ప్రతి ఇంటిని లెక్కిస్తామని ఆమె వెల్లడించారు. ప్రతి నిర్మాణాన్ని లెక్కలోకి తీసుకుంటామని తెలిపారు. ఆసుపత్రి, బడి, గుడి, గుడిసె, అద్దె భవనం ఇలా అన్నింటి గణన జరుగుతుందని వెల్లడించారు. అలాగే ఒక భవనం లేదా కాంప్లెక్స్‌లో ఉండే ప్రతి కుటుంబాన్ని పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు. 2027 ఫిబ్రవరిలో రెండో దశ జనగణన మొదలయ్యేలోగా అన్నీ సిద్ధం చేస్తామని తెలిపారు. రెండో దశ జనగణనలో భాగంగా 2027 ఫిబ్రవరి నుంచి వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తామని అన్నారు. ఇళ్ల గణన కోసం బ్లాకులుగా విభజించి ఎన్యుమరేటర్లను కేటాయిస్తామని తెలిపారు. మే 11వ తేదీ నుంచి జూన్ 9 వరకు ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి మార్కింగ్ చేస్తారని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి జనగణనకు సంబంధించిన యాప్ ద్వారా 33 ప్రశ్నలను అడిగి వాటిని పూరిస్తారని చెప్పారు. జనగణనకు సంబంధించి ఒక ఇంటి నుంచి ఒక మొబైల్ నెంబర్ తీసుకుంటామని చెప్పారు. భాషను, ఇంటి పెద్దల వివరాలు సరిగ్గా ఇవ్వాలని సూచించారు. మొబైల్ నెంబర్, భాష, ఇంటి పెద్ద పేర్లను ఒకసారి నమోదు చేస్తే, వాటిని మార్చడానికి వీలుండదని తెలిపారు.

# జనగణనలో భాగంగా రేపటి నుంచి సెల్ఫ్-ఎన్యుమరేషన్



హైదరాబాద్, ఏప్రిల్ 25(భారత శక్తి) : జనగణన2027లో భాగంగా తెలంగాణలో ఈ నెల 26 నుంచి సెల్ఫ్‌ఎన్యుమరేషన్ కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు జనగణన తెలంగాణ డైరెక్టర్ భారతీ హోళికెరి తెలిపారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియ ఏప్రిల్ 26 నుంచి మే 10వ తేదీ వరకు కొనసాగుతుందని వివరించారు. శనివారం హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొదటి జనగణన ఇది అని పేర్కొన్నారు. డిజిటల్ పద్ధతిలో జరుగుతున్న తొలి జనగణన కూడా ఇదేనని తెలిపారు. స్వాతంత్ర్యం తర్వాత తొలిసారి కులగణన జరుగుతుండటం కూడా ఈసారి జనగణనలో ప్రత్యేకమని వివరించారు. ముఖ్యంగా మొదటిసారిగా జనగణన ప్రక్రియలో ఈసారి సెల్ఫ్‌ఎన్యుమరేషన్ ప్రక్రియ పాటిస్తున్నామని.. ప్రజలు నేరుగా జనగణనలో పాల్గొనేందుకు ఇది ఒక మంచి అవకాశమని ఆమె చెప్పారు. ప్రజలు https://se.census.gov.in వెబ్ పోర్టల్ ద్వారా స్వచ్ఛందంగా జనగణనకు తమ వివరాలను అందించవచ్చని తెలిపారు. సెల్ఫ్‌ఎన్యుమరేషన్ అనేది తప్పనిసరి కాదని.. కేవలం ప్రజలకు ఒక సౌలభ్యం మాత్రమేనన్నారు.తెలంగాణ భౌగోళిక పరిధిలో ఉన్న ప్రతి ఇంటినీ లెక్కిస్తామని భారతీ హోళికెరి అన్నారు. జనాభా లెక్కల సేకరణ వివరాలను ఆమె మీడియాకు వివరించారు. ఆస్పత్రి, బడి, గుడి, గుడిసె, అద్దెభవనం ఇలా ఏదైనా జనగణన జరుగుతుందన్నారు. " భవనంలో ఉన్న ప్రతి కుటుంబాన్నిపరిగణనలోకి తీసుకుంటాం. 2027 ఫిబ్రవరిలో రెండో దశ మొదలయ్యేలోగా అంతా సిద్ధం చేస్తాం. రెండో దశలో 2027 ఫిబ్రవరి నుంచి వ్యక్తిగత సమాచారం సేకరిస్తాం. ఇళ్ల గణన కోసం బ్లాకులుగా విభజించి ఎన్యుమరేటర్లను కేటాయిస్తాం. మే 11 నుంచి జూన్ 9 వరకు ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి మార్కు చేస్తారు. ప్రతి భవనంలో ఎన్ని ఇళ్లు ఉన్నాయనేది మార్కు చేస్తారు'' అని ఆమె పేర్కొన్నారు.



# హైదరాబాద్ మెట్రో నిర్వహణకు కమిటీ ఏర్పాటు

హైదరాబాద్, ఏప్రిల్ 25(భారత శక్తి) : హైదరాబాద్ మెట్రో రైలు విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మే 1 నుంచి హైదరాబాద్ మెట్రో రైలు ప్రభుత్వ నిర్వహణలోకి రానుంది. ఈక్రమంలో మెట్రో రైలు నిర్వహణకు సీఎస్ రామకృష్ణారావు ఛైర్మన్‌గా కమిటీని ఏర్పాటు చేసింది. హెచ్ఎంఆర్ఎల్ నిర్వహణకు అధికారులతో డైరెక్టర్స్ బోర్డు ఏర్పాటు చేసింది. దీనికి ఎండీగా ఐఏఎస్ అధికారి సర్ఫరాజ్ అహ్మద్‌కు, జాయింట్ ఎండీగా శివేంద్ర ప్రతాప్‌కు బాధ్యతలు అప్పగించారు.

# అజారుద్దీన్, కోదండరామ్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలకు లైన్ క్లియర్







హైదరాబాద్, ఏప్రిల్ 25(భారత శక్తి) : గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి రాష్ట్ర మంత్రివర్గం ప్రతిపాదించిన అజారుద్దీన్, కోదండరాం అభ్యర్థిత్వాలకు లైన్ క్లియర్ అయ్యింది. వారిద్దరి అభ్యర్థిత్వాలను ఆమోదిస్తూ గవర్నర్ శివప్రతాప్ శుక్లా సంతకం చేశారు. దీనిపై త్వరలో గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై గత మూడేళ్లుగా వివాదం కొనసాగుతోంది. ఈ నెల 30 లోగా ఎమ్మెల్సీ కాకపోతే అజారుద్దీన్ మంత్రి పదవి కోల్పోనున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను త్వరగా పరిశీలించాలని గవర్నర్‌ను ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ నేపథ్యంలో రాష్ట్రమంత్రి వర్గం ప్రతిపాదించిన పేర్లను ఆమోదిస్తూ గవర్నర్ తాజాగా సంతకాలు చేశారు.

# ఎన్ని పార్టీలు వచ్చినా.. భాజపాకు ఇబ్బంది లేదు

**: రామచందర్‌రావు**



హైదరాబాద్, ఏప్రిల్ 25(భారత శక్తి) : రాష్ట్రంలో ఎన్ని పార్టీలు ఉన్నా.. ఎన్ని కొత్త పార్టీలు వచ్చినా.. భాజపాకు ఇబ్బంది లేదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. తెలంగాణలో భాజపాకు మంచి వాతావరణం ఉందని పేర్కొన్నారు. 12 ఏళ్లుగా నరేంద్ర మోదీ అవినీతి రహిత పాలన అందిస్తున్నారని కొనియాడారు. కవిత కొత్త పార్టీ పెట్టడంపై రామచందర్‌రావు స్పందించారు. భాజపా కార్యాలయంలో పండిట్ దీన్‌దయాల్ ప్రశిక్షణ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. శిక్షణ తరగతుల్లో పార్టీ బలోపేతం, సిద్ధాంతాలను కార్యకర్తలకు వివరించారు.

# కవిత పార్టీ 'టీఆర్ఎస్' పేరుకు దిగువన 'అసోసియేషన్'.. ఎందుకు?

- **నేడు పార్టీ పేరును ప్రకటించిన కవిత**
- **కేసీఆర్ స్థాపించిన టీఆర్ఎస్‌ను పోలి ఉన్న కవిత పార్టీ**
- **లీగల్ సమస్య రాకుండా ఈ పదాన్ని చేర్చారనే అభిప్రాయాలు**




హైదరాబాద్, ఏప్రిల్ 25(భారత శక్తి) : కల్వకుంట్ల కవిత 'తెలంగాణ రాష్ట్ర సేన' పేరుతో తన పార్టీని ఈరోజు ప్రకటించిన విషయం తెలిసిందే. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని మునీరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆమె పార్టీ ప్రకటన చేశారు. పాతిక సంవత్సరాల క్రితం తన తండ్రి కేసీఆర్ స్థాపించిన 'టీఆర్ఎస్' అని వచ్చేలా ఆమె తన పార్టీ పేరును ప్రకటించారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ పార్టీ పేరును బీఆర్ఎస్‌గా మార్చారు. క్లుప్తంగా కేసీఆర్ స్థాపించిన టీఆర్ఎస్‌ను పోలేలా తన పార్టీ పేరు ఉండేలా కవిత చూసుకున్నారు. కవిత తన పార్టీ పేరును తెలంగాణ రాష్ట్ర సేనగా ప్రకటించినప్పటికీ, దాని కింద చిన్న అక్షరాల్లో 'అసోసియేషన్' అని కనిపించింది. ఈ అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అయితే కేసీఆర్ స్థాపించిన టీఆర్ఎస్‌ను పోలిన నేపథ్యంలో లీగల్ సమస్య రాకుండా ఉండేందుకు కింద అసోసియేషన్ అని చేర్చినట్లు తెలుస్తోంది.

# 'ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే'.. కవిత కొత్త టీఆర్ఎస్‌పై బీఆర్ఎస్ సెటైర్!

- **తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్త రాజకీయ పార్టీ**
- **పార్టీకి 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)'గా నామకరణం**
- **ఒరిజినల్, ఫేక్ ఉత్పత్తుల ఫొటోలను షేర్ చేసిన బీఆర్ఎస్**




హైదరాబాద్, ఏప్రిల్ 25(భారత శక్తి) : తెలంగాణలో మరో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించిన నేపథ్యంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తన పార్టీకి 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)' అని పేరు పెట్టడంపై బీఆర్ఎస్ పార్టీ వ్యంగ్యంగా స్పందించింది. ఈ మేరకు బీఆర్ఎస్ తన అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో ఓ సెటైరికల్ పోస్టు పెట్టింది. కోల్‌గేట్ టూత్‌పేస్ట్, బిస్లేరీ వాటర్ బాటిల్‌కు సంబంధించి ఒరిజినల్, నకిలీ ఉత్పత్తుల ఫొటోలను పక్కపక్కనే జోడించింది. దీనికి "ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే!" అనే క్యాప్షన్‌ను జత చేసింది. కవిత తన పార్టీకి టీఆర్ఎస్ అని పేరు పెట్టుకున్నప్పటికీ, తామే అసలైన పార్టీ అని బీఆర్ఎస్ ఈ పోస్టు ద్వారా పరోక్షంగా స్పష్టం చేసింది. తమ పార్టీ బ్రాండ్‌కే ప్రజల్లో ఆదరణ ఉంటుందని, కొత్తగా వచ్చిన పార్టీకి కాదని చెప్పకనే చెప్పింది. రాష్ట్రంలో అసలైన తెలంగాణ వాద పార్టీ తమదేనని చాటుకునే ప్రయత్నం చేసింది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత, 'తెలంగాణ రాష్ట్ర సేన' పేరుతో కొత్త పార్టీని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ నుంచి ఈ స్పందన వచ్చింది. దీంతో టీఆర్ఎస్ పేరు చుట్టూ తెలంగాణ

# అన్నపై పెట్రోల్ పోసి నిప్పంటించిన తమ్ముడు



మంథని, ఏప్రిల్ 25(భారత శక్తి) : తల్లిని ఇంట్లోకి రానివ్వడం లేదని ఆగ్రహంతో అన్నపై తమ్ముడు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటన పెద్దపల్లి జిల్లా మంథని మండలం లక్కేపూర్ గ్రామంలో జరిగింది. నిద్రిస్తున్న అన్న రఘుపై తమ్ముడు అనిల్ కిటికీలోంచి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో మంటలు చెలరేగి రఘుకు తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుడిని వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు.

# గులాబీ కోటలో 'చీలిక' విస్ఫోటనం: తండ్రిపై తనయ సమరశంఖం!





హైదరాబాద్, ఏప్రిల్ 25(భారత శక్తి) : తెలంగాణ రాజకీయ యవనికపై శనివారం ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. పాతికేళ్లుగా అజేయంగా సాగుతున్న కల్వకుంట్ల సామ్రాజ్యంలో అనూహ్యమైన చీలిక ఏర్పడింది. తన తండ్రి, రాజకీయ గురువు కె.చంద్రశేఖరరావు నాయకత్వంలోని 'భారత్ రాష్ట్ర సమితి' (BRS) సిద్ధాంతాలతో పూర్తిగా విభేదిస్తూ, ఆయన కుమార్తె కల్వకుంట్ల కవిత సొంత రాజకీయ పక్షాన్ని ప్రకటించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో జరిగిన భారీ బహిరంగ సభ సాక్షిగా "తెలంగాణ రాష్ట్ర సేన" (TRS) జెండాను ఆమె ఆవిష్కరించారు. "ఉద్యమ ఆశయాలు ప్రగతి భవన్లో బందీ అయ్యాయి.. అస్తిత్వం కోసం మళ్లీ అడుగు వేస్తున్నా" అంటూ ఆమె చేసిన ఆవేశపూరిత ప్రసంగం రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది.

*** నాడు 'సమితి'.. నేడు 'సేన': అస్తిత్వ పోరాటమే అజెండా!**

తెలంగాణ పేరును పక్కన పెట్టి దేశ రాజకీయాల కోసం కేసీఆర్ 'బీఆర్ఎస్'గా మారిన నిర్ణయాన్ని కవిత పరోక్షంగా తప్పుబట్టారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ వీధుల్లో తాకట్టు పెట్టలేమని, ఆనాటి 'టీఆర్ఎస్' భావజాలాన్ని పునరుద్ధరించడమే ఈ 'సేన' ప్రధాన లక్ష్యమని ఆమె ప్రకటించారు. కేసీఆర్ ఫోటో లేకుండానే సభ నిర్వహించడం ద్వారా ఆమె తన స్వతంత్ర రాజకీయ అస్తిత్వాన్ని చాటుకున్నారు.

*** గత పాలనపై పశ్చాత్తాపం.. ఇసుక మాఫియాపై విమర్శలు**

సభలో కవిత చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేశాయి.

> "తెలంగాణ సాధించిన కుటుంబంలో ఉన్నందుకు గర్వపడుతున్నప్పటికీ, గత పాలనలో జరిగిన కొన్ని తప్పిదాలకు సిగ్గుపడుతున్నాను. ఇసుక మాఫియా వంటి ఘటనలు రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీశాయి. ప్రజలు ఆశించిన ఫలితాలు అందలేదు. ఈ విషయంలో తెలంగాణ ప్రజలు నన్ను క్షమించాలి" అని ఆమె బహిరంగంగా పశ్చాత్తాపం వ్యక్తం చేశారు.

*** చీలికకు దారితీసిన 'ముగ్గురు' ముక్కలాట!**

పార్టీ అంతర్గత వర్గాల విశ్లేషణ ప్రకారం ఈ చీలికకు ప్రధానంగా మూడు కారణాలు కనిపిస్తున్నాయి:

1. వారసత్వ పోరు: కేటీఆర్ ప్రాధాన్యత పెరగడం, కవితను కొంతకాలంగా పక్కన పెట్టడం.
2. ఒంటరి పోరాటం: ఢిల్లీ లిక్కర్ స్కామ్ వ్యవహారంలో పార్టీ నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు లభించలేదనే ఆవేదన.
3. క్యాడర్ మద్దతు: బీఆర్ఎస్ పేరు మార్పుతో అసంతృప్తిగా ఉన్న పాత ఉద్యమకారులను ఏకం చేయడం.

*** 'పాంచజన్యం' - కవిత ఐదు వాగ్దానాలు**

రాష్ట్రంలోని మూడున్నర కోట్ల మంది ప్రజలకు ఒక తల్లిలా అండగా నిలుస్తానని చెబుతూ, పార్టీ అజెండాగా 'పాంచజన్యం' పేరుతో ఐదు ప్రధాన అంశాలను ప్రకటించారు:

విద్య: నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు.
వైద్యం: అందరికీ మెరుగైన ఉచిత చికిత్స.

- **వ్యవసాయం: రైతు సంక్షేమం, పెట్టుబడి సాయం.**
- ఉపాధి: యువతకు నిరుద్యోగ భృతి మరియు నిరుద్యోగ యువతకు లక్ష ఉద్యోగాలు.
- సామాజిక న్యాయం: అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యత.
- ఈసీ చదరంగం: 'అసోసియేషన్' పేరుతో లీగల్ మైండ్!

ప్రస్తుతం ఉన్న పార్టీల పేర్లతో కొత్త పార్టీలు పెట్టడం సాంకేతికంగా సాధ్యం కానప్పటికీ, కవిత "Telangana Rashtra Sena Association" అనే పేరుతో రిజిస్ట్రేషన్ చేయించడం వెనుక పెద్ద వ్యూహమే ఉంది. పాత 'TRS' బ్రాండ్ క్రేజ్‌ను తన ఖాతాలో వేసుకోవడం ద్వారా ప్రజల్లోకి సులభంగా వెళ్లవచ్చని ఆమె భావిస్తున్నారు.

**ఎవరికి లాభం? ఎవరికి నష్టం?**

ఈ చీలిక గులాబీ దళానికి గట్టి దెబ్బేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కేసీఆర్ ఓటు బ్యాంకు రెండుగా చీలితే అది అధికార కాంగ్రెస్‌కు వరంగా మారే అవకాశం ఉంది. రాబోయే జీహెచ్ఎంసీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో తమ సత్తా చాటుతామని, రెండేళ్లలో అధికారంలోకి వస్తామని కవిత ధీమా వ్యక్తం చేశారు.

**సభలో పాల్గొన్న ప్రముఖులు:**

ఈ చారిత్రాత్మక సభలో రూప సింగ్, నవీనచారి, కొల శ్రీను, శివారెడ్డి అల్లంపల్లి, రామకోటి, నరేష్, శ్రీకాంతారావు, ఇస్మైల్, రంజిత్, శ్రావణి, మాధవి, కొట్టల యాదగిరి తదితర నాయకులు పాల్గొన్నారు.




## కవిత నూతన పార్టీ ఆవిర్భావ సభకు తరలిన శ్రేణులు

*** ఇబ్రహీంపట్నం నుంచి భారీగా తరలివెళ్లిన జాగృతి కార్యకర్తలు**

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 25(భారత శక్తి) : తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించనున్న నూతన పార్టీ ఆవిర్భావ సభకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుండి కార్యకర్తలు, యువకులు, మహిళలు భారీగా తరలివెళ్లారు. మేడ్చల్ జిల్లా మునిరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్ వేదికగా జరగనున్న ఈ సభ కోసం నియోజకవర్గ నాయకుడు మంచిరెడ్డి విజయ్ కిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు వాహనాల్లో బయలుదేరారు. ఈ ర్యాలీని జాగృతి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.

**ప్రజా ఆకాంక్షల మేరకే నిర్ణయం:**

ఈ సందర్భంగా పాండురంగా రెడ్డి, విజయ్ కిరణ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రగతి లక్ష్యంగా, ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగానే కవిత నూతన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్ర రాజకీయాల్లో ఈ పార్టీ కీలక పాత్ర పోషిస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలే ఎజెండాగా ఈ పార్టీ పనిచేస్తుందని పేర్కొన్నారు.

**ప్రభుత్వాల వైఫల్యాలపై విమర్శలు:**

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించిందని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమైందని వారు విమర్శించారు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడమే తమ నూతన పార్టీ (టిఆర్ఎస్) ప్రధాన ఉద్దేశ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాగృతి నియోజకవర్గ స్థాయి నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

## మచ్చా దత్తా రెడ్డిని రిటైన్ చేసుకున్న తుంగభద్ర వారియర్స్ జట్టు




విజయవాడ, ఏప్రిల్ 25(భారత శక్తి ప్రతినిధి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం, మంగళగిరి, కడప పట్టణాల్లో జూన్ నెలలో నిర్వహించనున్నఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్‌కు ముందు జరుగుతున్న రిటెన్షన్ ప్రక్రియలో తుంగభద్ర వారియర్స్ జట్టు కీలక నిర్ణయం తీసుకుంది. గత ఏడాది విజేత జట్టు తుంగభద్ర వారియర్స్ యాజమాన్యం కొంతమంది క్రికెటర్లను రీటైన్ చేసుకుంది. గత ఏడాది తుంగభద్ర వారియర్స్ జట్టు విజేతగా నిలిచేందుకు వికెట్ కీపింగ్ బ్యాటింగ్లో అద్భుతంగా రాణించి గెలుపులో కీలక పాత్ర పోషించినఅనంతపురం జిల్లాకు చెందినజట్టు నమ్మకమైన ఓపెనింగ్ బ్యాటర్, అనుభవజ్ఞుడైన వికెట్ కీపర్ మచ్చా దత్తా రెడ్డి ని 2026 క్రికెట్ సీజన్ కు వచ్చే సీజన్‌కు కూడా రిటైన్ చేసుకుంది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కు ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ఏ పీ ఎల్ గవర్నింగ్ బాడీకు ఈ విషయాన్ని తెలియజేస్తూ తుంగభద్ర వారియర్స్ జట్టు యజమాన్యం లేఖ రాసింది ఈ నిర్ణయంతో వారియర్స్ అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపైంది. రేపు ఆదివారం 26 ఉదయంవిశాఖపట్నంలో ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ఏపీఎల్ క్రికెటర్ల వేలంపాట జరగనుంది ముందుగా ప్రతి జట్టు 5 మంది క్రికెటర్లను రీటైన్ చేసుకునే అవకాశాన్ని ఆంధ్ర క్రికెట్ సంఘం కల్పించింది. అందులో గత ఏడాది ఆడిన వారిలో మచ్చా దత్త రెడ్డి, జ్ఞానేశ్వర్, రోహిత్, సౌరబ్ కుమార్, దీపక్ లను ఐదు మంది క్రికెటర్లనురిటైన్ చేసుకుంటూ తుంగభద్ర వారియర్స్ జట్టు యాజమాన్యంఆంధ్ర క్రికెట్ సంఘానికి లేఖ రాసింది.

*** సీనియర్స్ క్రికెట్అంతర్ జిల్లాల వేదికపై సత్తా**

క్రికెట్ ప్రేమికులకు సుపరిచితుడైన మచ్చా దత్తా రెడ్డి తన సమర్థతను ఇప్పటికే అంతర్జిల్లా సీనియర్ క్రికెట్ వేదికపై నిరూపించుకున్నారు. ఇటీవల కడపలో జరిగిన వన్డే టోర్నమెంట్‌లో 4 మ్యాచ్‌లలో 187 పరుగులు, టీ20 పోటీల్లో 4 మ్యాచ్‌లలో 105 పరుగులు చేసి అనంతపురం జట్టు విజయానికి వెన్నెముకగా నిలిచారు. ఓపెనింగ్ బ్యాటర్‌గా, వికెట్ కీపర్‌గా ఆయన ప్రదర్శించిన రెండు పాత్రల సమన్వయం జట్టు తుంగభద్ర వారియర్స్ జట్టు మేనేజ్‌మెంట్‌ను ఆకట్టుకుంది.

*** అండర్-16 నుంచి రంజీ వరకు అద్భుత ప్రయాణం**

మచ్చా దత్తా రెడ్డి ప్రతిభ కేవలం సీనియర్ స్థాయికే పరిమితం కాలేదు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే అన్ని విభాగాలలో ఆంధ్ర జట్టుకి ఎంపికయ్యారు అన్ని విభాగాల్లో రాష్ట్ర జట్టు ప్రాతినిధ్యం వహించి అనేకసార్లు అద్భుత ప్రతిభతో ఆంధ్ర జట్టుని గెలిపించారుఅండర్ 12, 16, 19, 23, 25 విభాగాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ఎంపికై పలు విజయాలను అందించారు. అండర్ 19 జాతీయ క్రికెట్లో అద్భుత ప్రతిభ కనబరిచి నేషనల్ క్రికెట్ అకాడమీ ఎన్సీఏ శిక్షణ పొందారుఅంతేకాదు — దేశీయ క్రికెట్‌లో అత్యున్నత వేదికగా పరిగణించే రంజీ ట్రోఫీ జట్టులో కూడా స్థానం దక్కించుకున్న ఘనత ఆయనది. యువతరానికి స్ఫూర్తిప్రదమైన ఈ ప్రయాణం ఏపీఎల్ వేదికపై మరింత వెలుగు చూడనుంది.

*** వారియర్స్ శిబిరంలో విశ్వాసం..***

గత ఏడాది ఆంధ్ర ప్రీమియర్ లీగ్ విజేత తుంగభద్ర వారియర్స్ జట్టుయాజమాన్యం ఈ నిర్ణయంపై స్పందిస్తూ మచ్చా దత్తా రెడ్డి మా జట్టుకు అమూల్యమైన ఆస్తి. ఆయన అనుభవం, క్రీజులో స్థిరత్వం మా బృందానికి ఎంతో బలాన్నిస్తాయి. ఈ సీజన్‌లో ఆయన మరింత ప్రకాశిస్తారని నమ్మకంగా ఉన్నాం అని పేర్కొంది.

*** సీజన్‌పై పెరిగిన అంచనాలు..**

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ఏ పీ ఎల్ ఐదవ సీజన్ త్వరలో మంగళగిరి విశాఖపట్నం కడప పట్టణాల్లో ప్రారంభం కానున్నదిమచ్చా దత్తా రెడ్డి రిటెన్షన్ నేపథ్యంలో వారియర్స్ శిబిరంలో మరింత ఉత్సాహం నెలకొంది. అంతర్జాతీయ నాణ్యమైన స్థాయి ప్రదర్శన చేయగల ఓపెనర్, నమ్మకమైన వికెట్ కీపర్ జట్టులో కొనసాగడం ఈ సీజన్‌లో తుంగభద్ర వారియర్స్ అవకాశాలను మరింత బలపరుస్తుందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఏపీఎల్ వేదికపై మచ్చా దత్తా రెడ్డి బ్యాటు మళ్ళీ మెరిసేందుకు సిద్ధమైందని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




## రాయచోటి సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ ల విజిట్

కడప, ఏప్రిల్ 25(భారత శక్తి ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప డాక్టర్ సి యామిని వారి సూచనల మేరకు సెక్రటరీకంసీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ రాయచోటి సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ లను విజిట్ చేయడం జరిగినది. రిజిస్టర్లను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగినది. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏవైనా సమస్యలుంటే రాయచోటి మండల న్యాయ సేవా సమితిని, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప ను సంప్రదించ వచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి సబ్ జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు మరియు ఖైదీలు పాల్గొన్నారు.

## 27న ప్రజావాణి రద్దు


**: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 25 ( భారత శక్తి ) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించిన గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖల సమస్యలపై ప్రభుత్వం ఈ నెల 27 న హైదరాబాద్ లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినందున 27వ తేదీన ప్రజావాణి రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రకటనలో తెలిపారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని, మే 4వ తేదీ సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు

**: జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా**



కడప, ఏప్రిల్ 25(భారత శక్తి ) : జిల్లాలో పెట్రోల్, డీజిల్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేదని, ఆయిల్ కంపెనీ డిపోల నందు ప్రజల రోజువారీ అవసరాలకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా తెలిపారు. శనివారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా ఆయిల్ కంపెనీ సేల్స్ అధికారులు, పౌర సరఫరా అధికారులు మరియు పెట్రోలియము డీలర్లతో సమావేశము నిర్వహించారు. ఈ సందర్భముగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం పెట్రోల్ బంకులలో (ఐఓసీ65, బీపీసీఎల్58, హెచ్పీసీఎల్92, నయారా 14, రిలియన్స్ జియో5) ఉన్నాయని తెలియజేశారు. ప్రైవేటు రంగ సంస్థలకు చెందిన బంకుల నందు పెట్రోలు/డీజిలు ధరలు పెరగడము వలన సదరు బంకుల్లో అధిక శాతం డీజిల్ విక్రయాలు తగ్గిపోయాయని, సదరు వినియోగదారులంతా ప్రభుత్వ రంగ సంస్థల బంకులకు వస్తున్నారన్నారు. దీంతో వినియోగం పెరిగడంతో గతంలో కాంట్రాక్టర్లు, ఇతర బల్క్ వినియోగదారులు గతంలో నేరుగా ఆయిల్ కంపెనీ నుండి డీజిల్ కొనుగోలు చేసేవారు ప్రస్తుతం ధరలు పెంచడము వలన ఇప్పుడు వారంతా ప్రభుత్వ రంగ డీలర్ల నుంచి డీజిల్ కొనుగోలు చేస్తున్నారన్నారు. పరిశ్రమల అవసరాలకు సరఫరా చేసే డీజిల్ ధర లీటరుకు రూ.152 వరకు చేరింది. దీంతో వీరు కూడా ప్రభుత్వ రంగ బంకుల్లోనే డీజిల్ కొంటున్నారు. పెట్రోలు కొరత లేదని కాని భయంతో వాహనదారులు అవసరానికి మించి కొనుగోలు చేస్తు న్నారు అధికశాతం మంది ఫుల్ ట్యాంక్ చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో వాహనదారులు ఎవరూ ఇంధన కొరత వస్తుందని ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఆందోళనతో అవసరానికి మించి కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. అపోహలకు లోనుకాకుండా ప్రజలు ఎప్పట్లాగే తమ సాధారణ వినియోగాన్ని కొనసాగించాలని కోరారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.